సాక్షి 24|7
సంగారెడ్డి
బుధవారం 3-1-2018

నారాయణఖేడ్: ఉల్లి ధరలు మార్కెట్‌లో ఘాటెక్కిస్తున్నా రైతుకు మాత్రం ఏటా కన్నీళ్లే పెట్టిస్తున్నాయి. పంటను నిల్వచేసుకునేందుకు గిడ్డంగులు లేక.. ఎక్కువ రోజులు ఇంట్లోనే పెట్టుకుంటే పాడై కనీసం పెట్టుబడులు కూడా రావన్న ఉద్దేశంతో తక్కువ ధరకైనా విక్రయించేవారు. ఇకపై వారి కష్టాలు దూరం కానున్నాయి. ఇన్నాళ్లూ అయినకాడికి అమ్ముతూ నష్టాలు చవిచూసిన రైతులు ఇక లాభాల బాట పట్టనున్నారు. రాష్ట్రంలోనే నారాయణఖేడ్‌లో మొట్టమొదటగా ప్రయోగాత్మకంగా ఉల్లి గోడౌన్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. 50శాతం సబ్సిడీతో వీటిని నిర్మించాలని నిర్ణయించారు. ఖేడ్‌లో ఈప్రయోగం విజయవంతమైతే రాష్ట్రం మొత్తం అమలు చేస్తామని ఇప్పటికే మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. రెండు నెలల క్రితం ఉల్లి రైతులతో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఉల్లి గోడౌన్లతో కలిగే ప్రయోజనాలపై వారికి అవగాహన కల్పించారు. దీనికి రైతుల నుంచి అనూహ్య స్పందన లభించింది.

సబ్సిడీపై ఉల్లి గోడౌన్లు



- ప్రయోగాత్మకంగా ఖేడ్‌లో అమలు
- విజయవంతమైతే రాష్ట్రం మొత్తం విస్తరణ
- మంత్రి హరీశ్ ప్రత్యేక చొరవ
- రైతుల నుంచి అనూహ్య స్పందన
- 200మందికి పైగా దరఖాస్తులు
- జిల్లాలో పెరగనున్న ఉల్లిసాగు విస్తీర్ణం
- రైతుల్లో హర్షాతిరేకాలు

నిర్మించుకొన్న గోడౌన్లు భవిష్యత్తులో పూర్తిగా రైతుల సొంతం కానుండడంతో వీటిని వ్యవసాయ క్షేత్రాలు, లేదా రైతులు చూపిన వారి అనువైన స్థలాల్లో నిర్మించాలని మార్కెటింగ్‌శాఖ అధికారులు యోచిస్తున్నారు. ఒక్కో గోడౌన్‌కు సుమారు రూ.2లక్షలకుపైగా వ్యయం అవుతుందని, కాస్త చిన్నగా నిర్మిస్తే రూ.లక్ష వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. రైతులకు 50శాతం సబ్సిడీ అందజేసి గోడౌన్లను నిర్మించనున్నారు. మొదట్లో 75శాతం సబ్సిడీ ఇస్తామన్న ప్రచారం సాగింది. 75శాతం సబ్సిడీ ఇస్తే ఎక్కువ మంది ముందుకు రావడమే కాకుండా, ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉందని

- మిగతా 2లో

గోడౌన్లు నిర్మిస్తే సంతోషం..



"ఉల్లి గోడౌన్లను రైతుల చేలల్లో నిర్మిస్తే సంతోషం. సబ్సిడీ 75శాతం ఇస్తే ఇంకా మేలు. ఆసక్తి ఉన్నవారందరికీ అవకాశం ఇవ్వాలి. గోడౌన్‌తోపాటు అమ్ముకొనేందుకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. ఇక్కడే అమ్ముకొనేందుకు మార్కెట్ ఉంటే రవాణా చార్జీలు తగ్గుతాయి."

- శామయ్య, ఉల్లి రైతు, సత్తెగామ

మోతీమాత నమోస్తుతే..





- ★ జాతరకు పోటెత్తిన గిరిజనం
- ★ తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తరలివచ్చిన భక్తులు
- ★ అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ★ జనసంద్రంగా మారిన ఉప్పర్‌పల్లి తండా

మోతీమాత ఆలయానికి పోటెత్తిన భక్తజనం, (ఇన్‌సెట్) భక్తులతో పూజలందుకున్న మోతీమాత

వివరాలు 16లో

అక్షయ'పాత్ర' అమోఘం

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత
- ఇప్పటికే మధ్యాహ్న భోజనం సరఫరా
- ప్రస్తుతం షూ పంపిణీలో నిమగ్నం
- గత ఏడాది ఆగస్టు 3న లాంఛనంగా ప్రారంభం
- జిల్లాలోని 15 మండలాల్లో పంపిణీ

వివరాలు 8-9లో

సమన్వయం లేదు

- నగర పంచాయతీలో ఒక్క కాగితం సరిగ్గాలేదు
- స్వచ్ఛ భారత్ పనులపై అసంతృప్తి
- సీడీఎంఏ కార్యాలయ రీజనల్ డైరెక్టర్ మసూద్

6లో

వ్యవసాయ భూమి 7,37,292.26 ఎకరాలు



- జిల్లాలో రెవెన్యూ గ్రామాలు : 600
- భూ రికార్డుల ప్రక్షాళన జరిగినవి: 596
- జిల్లా భౌగోళిక విస్తీర్ణం: 10,93,561.20 ఎకరాలు
- ప్రక్షాళనలో గుర్తించింది: 10,90,812.34 ఎకరాలు
- వివరాలు వెల్లడించిన కలెక్టర్ మాణిక్కరాజ్ కణ్ణన్

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ ప్రక్షాళన కార్యక్రమం గతనెల 31తో ముగిసింది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ యంత్రాంగం సర్వే చేసి పూర్తి నివేదికను రూపొందించింది. జిల్లాలో భూ రికార్డుల ప్రక్షాళన పూర్తయిందని కలెక్టర్ మాణిక్కరాజ్ కణ్ణన్ తెలిపారు. జిల్లాలో 600 రెవెన్యూ గ్రామాలు ఉండగా 596 గ్రామాల్లో ప్రక్షాళన పూర్తి చేశామన్నారు. మిగిలిన నాలుగు గ్రామాలు సింగూరు ముంపు ప్రాంతాలని వెల్లడించారు. జిల్లా భౌగోళిక విస్తీర్ణం 10,93,561.20 ఎకరాలుగా ఉంది. భూ ప్రక్షాళనలో భాగంగా 10,90,812.34 ఎకరాలను గుర్తించారు. 32,821.20 ఎకరాల భూమి పూర్తికాలేదు. ప్రధానంగా పౌతి, కుటుంబానికి సంబంధించిన సమస్యలతో 117.2 ఎకరాలు, భూ సమస్యలు 914.06, విస్తీర్ణంలో తేడాలు 5963.03, సర్వే వివాదానికి సంబంధించిన 14.25 ఎకరాలు, మాజీ సైనిక ఉద్యోగులకు కేటాయించిన భూములు 772.15, అదనపు భూమి 1,271.26, భూమి కేటాయించినా భౌతికంగా స్వాధీనంలో లేనిది 706.22 ఎకరాలు, ప్లాట్లు 360.01 ఎకరాలుగా ఉన్నాయి. కుటుంబం, సరిహద్దులు, సర్వే నంబర్లు, పొజిషన్, సర్వే తదితర అంశాలపై 2,011.08, సివిల్ కోర్టు కేసులు

- మిగతా 2లో

సమాచారం

5న చేతిరాత పోటీలు

కొండాపూర్(సంగారెడ్డి): విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి తెలుగులో చేతిరాత పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ విజయకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ పాఠశాలల్లోని 6,7 తరగతి విద్యార్థులు ఈ పోటీలకు అర్హులన్నారు. ఈనెల 5న (శుక్రవారం) అన్ని మండలాల పరిధిలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు స్థానిక ఎంఈఓ పర్యవేక్షణలో పోటీలు ఉంటాయన్నారు. 8న డివిజన్ కేంద్రాల్లో సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్‌లలో మండల స్థాయిలో గెలుపొందిన నలుగురు విద్యార్థుల చొప్పున పాల్గొనాల్సి ఉంటుందన్నారు. 10న జిల్లా సైన్స్ కేంద్రంలో మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 వరకు, డివిజన్ స్థాయిలో గెలుపొందిన ఎనిమిది మంది విద్యార్థుల చొప్పున హాజరుకావాలని సూచించారు.

7న రెడ్‌ఫ్లాగ్ మహాసభలు

సంగారెడ్డిజోన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 7న హైదరాబాద్‌లో సీపీఐ ఎంఎల్ రెడ్‌ఫ్లాగ్ తెలుగు రాష్ట్రాల మహాసభలను నిర్వహిస్తోందని ఆ సంఘం కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసులకు చెందిన లక్షలాది ఎకరాల భూములను బహుళ జాతి సంస్థలు కార్పొరేట్ పరం చేస్తున్నాయన్నారు. భవిష్యత్ విప్లవ ప్రజా ఉద్యమాల నిర్వహణ కోసం 7న జరిగే మహాసభల్లో మేధావులు, కవులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సబ్సిడీపై ఉల్లి గోడౌన్లు

▶మొదటిపేజీ తరువాయి

రైతులు పేర్కొంటున్నారు.

200మంది రైతుల ఆసక్తి...

ఇప్పటికే అధికారులు రైతులతో సమావేశం కాగా 200మందికి పైగా ఉల్లిగోడౌన్లను నిర్మించుకొనేందుకు ముందుకు వచ్చారు. ఈమేరకు దరఖాస్తులు సైతం సమర్పించారు. మండలాల వారీగా ఉల్లి సాగుచేసే రైతుల వివరాలు, గోడౌన్ల నిర్మాణానికి ఆసక్తి ఉన్నవారి వివరాలు సైతం అధికారులు సేకరించారు. ప్రభుత్వం నిర్మాణాలను వేగవంతం చేసిన పక్షంలో మరికొందరు ముందుకు వచ్చే అవకాశం ఉంది.

పెరగనున్న ఉల్లిసాగు..

ఉల్లిసాగు జిల్లాలోనే నారాయణఖేడ్ నియోజకవర్గంలో అధికంగా ఉంటుంది. గతంలో పదివేల ఎకరాల్లో సాగయ్యేది. రానురాను తగ్గుతూ వచ్చి 2వేల నుంచి 3వేల ఎకరాలకు పడిపోయింది. అందోల్, జహీరాబాద్, సంగారెడ్డి నియోజకవర్గాల్లోనూ ఉల్లిసాగులో ఉంది. గతంలో ఉల్లి అధికంగా సాగుచేసిన రైతులు మార్కెట్లో ధర పడిపోవడంతో పంటను రోడ్లపై పారబోసి ఆందోళనలు చేసిన సంఘటనలు ఉన్నాయి. పంట చేతికి రాగానే వ్యాపారులు మార్కెట్లో ధరలు అమాంతం తగ్గించేస్తున్నారు. ఫలితంగా రైతులు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్నారు. రైతుల వద్ద పంట అయిపోగానే



సాగులో ఉన్న ఉల్లిపంట

ధరలను అమాంతం పెంచేస్తున్నారు. పంట చేతికి వచ్చిన సమయంలో వ్యాపారులు రైతుల నుంచి రూ.200 నుంచి రూ.400లలోపు క్వింటాలు కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్లో ఉల్లి క్వింటాల్‌కు రూ.3,500 నుంచి రూ.4,000 వరకు ధర పలుకుతోంది. చిల్లరగా మార్కెట్లో కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. గోడౌన్ల నిర్మాణంతో రైతులు మార్కెట్లో ధర ఉన్న సమయంలో అమ్ముకొని లబ్ధిపొందే అవకాశం ఉంటుంది.

మార్కెటింగ్ సౌకర్యం కావాలి..

ఉల్లి పంట అమ్ముకొనేందుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, మహారాష్ట్రలోని లాతూర్, ఉద్గీర్ మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నారు. దీంతో రవాణా చార్జీలు తడిసి మోపెడవుతున్నాయి. గత ఏడాది ప్రభుత్వం వ్యవసాయ క్షేత్రాల నుంచి నేరుగా పంటను కొనుగోలు చేయడంతో మద్దతు ధర దక్కింది. మొత్తమ్మీద ప్రభుత్వం గోడౌన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటుండడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

చాలా మేలు..



ఇన్నాళ్లూ తక్కువ ధరకు పంట అమ్ముకున్నాం. పంట చేతికి రాగానే మార్కెట్లో వ్యాపారులు ధర తగ్గిస్తున్నారు. పంట అయిపోగానే పెంచి అమ్ముకుంటున్నారు. మేం మాత్రం నష్టపోతున్నాం. ఉల్లి గోడౌన్లను నిర్మిస్తే రైతులకు చాలా మేలు అవుతుంది.

– సాయిలు, ఉల్లి రైతు, సత్తెగామ

అందరికీ అవకాశం ఇవ్వాలి..



సబ్సిడీపై ఉల్లి గోడౌన్లు నిర్మించుకొంటాం. అందరికీ ప్రభుత్వం అవకాశం ఇవ్వాలి. ఇంట్లో పెట్టుకుంటే మురిగి పోతుందని నిల్వ చేసుకోం. పంటరాగానే అమ్ముకొంటాం. గోడౌన్లు నిర్మిస్తే నిల్వ చేసుకుంటాం. ధర ఉన్నప్పుడు అమ్ముకొంటాం. – దేవసాయం, ఉల్లి రైతు, సత్తెగామ

సబ్సిడీపై నిర్మిస్తాం



ఉల్లి గోడౌన్లను సబ్సిడీపై నిర్మింపచేస్తాం. మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే నారాయణఖేడ్‌లో రైతులతో సమావేశమయ్యాం. 200మందికి పైగా రైతులు ముందుకు వచ్చారు. ఎంత మంది ముందుకు వస్తే అంతమందికి నిర్మింపచేస్తాం. నాబార్డు సాయంతో మరిన్ని ఎక్కువ నిర్మాణాలకు యోచిస్తున్నాం. – నరేందర్, మార్కెటింగ్ శాఖ ఏడీ, సంగారెడ్డి

వ్యవసాయ భూమి 7,37,292.26 ఎకరాలు

▶మొదటిపేజీ తరువాయి

8,786.11 ఎకరాలు, రెవెన్యూ కోర్టు కేసులు 2,612, ఫారెస్టు రెవెన్యూ బౌండరీ గొడవలు 5,824.12 ఎకరాలు, పీఓటీ కేసులు 3,344.29 ఎకరాలు, సాదాబైనామా 378.80 ఎకరాలుగా వెల్లడించారు. జిల్లాలో 6,46,193 సర్వే నంబర్లు క్లియర్‌గా ఉన్నాయని, 3,77,978 ఖాతాలు భూ ప్రక్షాళనలో పరిశీలించామన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములు 7,37,292.26 ఎకరాలుగా పేర్కొన్నారు. వ్యవసాయ యోగ్యం కాని పట్టా భూములు 81,196.22 ఎకరాలు, ప్రభుత్వ ఆస్తులు 85,689.23 ఎకరాలు, అటవీ భూములు 46,131.01, దేవాదాయ భూములు 1,374.05, వక్ఫ్‌భూములు 7,384.29 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. సింగూరు ప్రాజెక్టులో మునిపల్లి మండలానికి చెందిన రామచంద్రాపూర్, రేకులపహాడ్, పుల్‌కల్ మండలానికి చెందిన హన్మాపూర్, శేరిపెద్దరెడ్డిపేట గ్రామాలు ముంపు ప్రాంతాలని వివరించారు.

సేవా పతకాలకు ఇద్దరి ఎంపిక

సంగారెడ్డి జోన్: రాష్ట్ర పోలీస్‌శాఖలో ఉత్తమ పనితీరును కనబర్చిన పోలీస్ అధికారులకు రాష్ట్ర హోంశాఖ పతకాలు ప్రకటించిందని ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు ఈ సేవా పతకానికి ఎంపికయ్యారన్నారు. ఐటీ కోర్టు టీమ్ సభ్యుడు ఈడీ సంజీవ్, డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎం.రమేష్ పతకాన్ని పొందిన వారిలో ఉన్నారని చెప్పారు.

విజయవంతంగా భూరికార్డుల ప్రక్షాళన

రెవెన్యూ డైరీ ఆవిష్కరణలో కలెక్టర్, జేసీ

సంగారెడ్డి జోన్: జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులు రాత్రి, పగలు తేడా లేకుండా పని చేయడంతో భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేశామని కలెక్టర్ మాణిక్యరాజ్ కణ్ణన్, జేసీ వాసం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ డైరీని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావడంలో రెవెన్యూ ఉద్యోగులు ఎంతో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.శివప్రసాద్ మాట్లాడుతూ భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమంలో మూడు నెలలుగా అహర్నిశలు కృషి చేసి రాష్ట్రంలో రికార్డు నెలకొల్పామన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగులు అన్ని వేళల్లో ప్రభుత్వానికి, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయడం, ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. పీఆర్‌సీలో ప్రత్యేక అలవెన్స్‌ను ఇవ్వాలన్నారు. డైరీ ఆవిష్కరణలో అసోసియేషన్



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాణిక్యరాజ్ కణ్ణన్

జిల్లా కార్యదర్శి బి.రాములు, కోశాధికారి గోపాల్, ఇతర బాధ్యులు షఫీ, విజయకుమార్, వినయ్‌కుమార్, ఎం.వరప్రసాద్, శ్రీనివాస్, వీరేశం, బాల్‌రాజ్, దశరథ్‌సింగ్, గుండెరావు, ఉమర్‌పాష, నాగరాజు, కిశోర్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్, జేసీకి శుభాకాంక్షల వెల్లువ

సమీకృత కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కలెక్టర్ మాణిక్య రాజ్ కణ్ణన్, జేసీ వాసం వెంకటేశ్వర్లుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దీంతో వారు సైతం వచ్చిన వారికి శుభాకాంక్షలు చెప్పారు.

స్కీమ్ వర్కర్ల సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య

సంగారెడ్డి జోన్: వివిధ స్కీంలలో పని చేస్తున్న వారందరినీ కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న దేశవ్యాప్త సమ్మెను నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య తెలిపారు. సుందరయ్య భవనంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెను చేపడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 5 నిర్వహించే జిల్లాసదస్సులో స్కీమ్ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రణాళికా సంఘాన్ని రద్దు చేయడమే కాకుండా స్కీంలకు బడ్జెట్ పెంచకపోగా ఖర్చులు కేంద్రం 60, రాష్ట్రం 40శాతం పెట్టాలని నిర్ణయించిందన్నారు. స్కీంలకు పెట్టే పోషకాహారం, వర్కర్ల వేతనాలు, మెడిసిన్ తదితర రోజువారీ ఖర్చులను రానున్న కాలంలో రాష్ట్రం భరించాలని కేంద్రం చెబుతోందన్నారు. స్కీంలలో నగదు బదిలీ అమలు చేయాలని కేంద్రం నిర్ణయించిందని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

వ్యతిరేకించకపోగా కేసీఆర్ పూర్తి మద్దతు ప్రకటించారని వారు విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తూ 17న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు మల్లయ్య, కిషన్‌రావు, రాందాసు, శ్రీధర్, మల్లేశ్వరి, జయరాజు, దుర్గేష్, శ్రీశైలం, రమేష్, స్వాతి, సంతోష్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన మానసిక వికలాంగులు

సంగారెడ్డిజోన్: సంగారెడ్డిలోని సబితా మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సమీకృత కలెక్టరేట్‌లో జేసీ వాసం వెంకటేశ్వర్లు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి మోతిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, సబితా, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



జేసీని కలిసిన సబితా మానసిక వికలాంగులు, ఉద్యోగులు

కోర్టులో కొత్త సంవత్సర వేడుకలు

సంగారెడ్డి జోన్: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రధాన న్యాయమూర్తి సాయికళ్యాణ్ చక్రవర్తి కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం మంచి, చెడులను బేరీజు వేసుకొని కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. న్యాయవాదులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరన్నపాటిల్, సీనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. అసోసియేషన్ బాధ్యులు రవీందర్ రాజు వర్మ, అనిల్ పాటిల్, దయాకర్‌రెడ్డి, నీలిమ, శివకుమార్, గోవర్ధన్‌రావు, మాధవి పాల్గొన్నారు.

అయ్యో దేవుడా..


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన సామగ్రి


బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న మ్యాడం బాలకృష్ణ


కాలిపోయిన ఇళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

- రాజ్‌పేటలో ఐదిళ్లు దగ్ధం
- అర్ధరాత్రి చెలరేగిన మంటలు
- రూ. 6.28 లక్షల ఆస్తి నష్టం
- బాధితుల రోదనలతో దద్దరిల్లిన రాజ్‌పేట

హవేళిఘణాపూర్(మెదక్): అయ్యో దేవుడా.. ఇల్లం తా కాలిపోతాంది.. ఏం చెయ్యాలే.. బయటి దేశం నుంచి పంపిన పైసలు కాలిపోతున్నయి.. అనే రోదనలతో ఆ పల్లె నిద్రలేచింది. మండల పరిధిలోని రాజ్‌పేటలో సోమవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన పిరాణి దాసుకు చెందిన పూరిల్లుకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. ఇది గమనించిన చుట్టుపక్కల వారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించే లోపే ఇంట్లోని గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా పేలింది. దీంతో చుట్టూ ఉన్న చిన్న జ్యోతి, పెద్ద జ్యోతి, సాయిలు, స్వామిల పూరిళ్లు సైతం అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ. 6లక్షల 28వేల 290 నష్టం వాటిల్లింది. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదు, వడ్లు, నిత్యావసర సరుకులు కాలిపోయాయి. దీంతో గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీకాంత్, ఆర్‌ఐ శ్రీహరిలు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. కాగా పిరాణి దాసు(రూ. 1 లక్ష 18వేల 680), చిన్న జ్యోతి (రూ. 92 వేలు), పెద్ద జ్యోతి (రూ. 1లక్ష 36వేల 410), కర్రోల సాయిలు(రూ. లక్ష 88వేలు), కర్రోల స్వామి(రూ. 93వేల 200)లకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు తహసీల్దార్ తెలిపారు. కాగా తక్షణ సహాయం కింద ఆయన ఒక్కొక్కరికి పది కిలోల బియ్యం అందజేశారు.

ఆదుకున్న ద్వారకా చారిటబుల్ ట్రస్ట్

విషయం తెలుసుకున్న ద్వారకా చారిటబుల్ ట్రస్ట్ అధినేత మ్యాడం బాలకృష్ణ రాజ్‌పేటకు చేరుకొని బాధితులను పరామర్శించారు. ప్రమాద ఘటనపై ఆయన బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఒక్కో కుటుంబానికి నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను ఆయన అందజేశారు.

ఎట్లా బతకాలి సారూ..

పొట్టకూటి కోసం నా భర్త ఏడాది దేశానికి వలస వెళ్లాడు. నా భర్త పంపించిన రూపాయి రూపాయి పోగేసి ఇంట్లో దాచుకున్నా. ఒక్కసారిగా ఇల్లు మొత్తం మంటలు అంటుకున్నాయి. దాచుకున్న రూ. నాలుగు వేలు అగ్ని పాలయ్యాయి. ఇప్పుడు ఎట్లా బతకాలి సారూ..

– పిరాణి అనసూజ, రాజ్‌పేట

అనాథలుగా మారిన పిల్లలు

- అంతు చిక్కని వ్యాధితో తల్లిదండ్రుల మృతి
- అగమ్యగోచరంగా చిన్నారుల భవిష్యత్


అనాథలుగా మారిన చిన్నారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): అంతు చిక్కని వ్యాధితో వివాహిత మరణించిన సంఘటన సోమవారం సాయంత్రం చిలప్‌చెడ్ మండలంలోని గౌతపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గౌతపూర్ గ్రామానికి చెందిన చిట్కుల అర్జున్, లక్ష్మి దంపతులు. నాలుగేళ్ల క్రితం అర్జున్ అంతు చిక్కని వ్యాధితో మృతి చెందాడు. అదే వ్యాధి లక్ష్మికి కూడా సోకింది. సోమవారం వ్యాధి కారణంగా లక్ష్మి(35) మృతి చెందడంతో వారికున్న ఇద్దరు పిల్లలు అనాథలుగా మారిన ఘటన పలువురి మనసులను కలచివేసింది. లక్ష్మికి ప్రభుత్వం రోగ నిరోధక మాత్రలు అందించినప్పటికీ, వాటిని సక్రమంగా వాడకపోవడంతో ఆరోగ్యం క్షీణించి మృత్యువుకు చేరువైంది. అలా పూర్తిగా ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం 108 వాహనంలో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు లక్ష్మి శరీరం వైద్యానికి సహకరించడం లేదని తెలిపారు. దీంతో ఆమెను బంధువులు వెనక్కి తీసుకువచ్చారు. పూర్తిగా ఆరోగ్యం క్షీణించిన లక్ష్మి సోమవారం మరణించింది. మృతి చెందిన దంపతులకు కుమారుడు కుమార్, కూతురు స్వాతి ఉన్నారు. తల్లిదండ్రులు మరణించడంతో చిన్నారులు అనాథలయ్యారు. ఇప్పటివరకు వారికి ఇల్లు లేదని, పూరి గుడిసెలో నివాసం ఉండేవారని గ్రామస్తులు తెలిపారు. తల్లిదండ్రులు చనిపోవడంతో పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం చిన్నారులను ఆదుకోవాలని బంధువులు కోరారు.

కారు పల్టీకొట్టి ఐదుగురికి తీవ్ర గాయాలు

మనూరు(నారాయణఖేడ్): నాగల్ గిద్ద మండలంలోని కరస్‌గుత్తివద్ద కారు పల్టీ కొట్టడంతో ఐదుగురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగల్‌గిద్ద మండలం మోర్గి గ్రామానికి చెందిన యువకులు కర్నాటక నుండి నాగల్‌గిద్ద వైపు వస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు విస్తరణలో భాగంగా ఇరు వైపులా తవ్వడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. కారులో ప్రయాణిస్తున్న యువకులకు తీవ్రగాయాలవడంతో స్థానికులు కరస్‌గుత్తి పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. పరిస్థితులు విషమంగా ఉండడంతో నారాయణఖేడ్ ఏరియా ఆసుపత్రికి 108లో తరలించారు.

రోడ్డు తవ్వడంతోనే ప్రమాదం

నాగల్‌గిద్ద నుండి కరస్‌గుత్తి వరకు రూ.20కోట్లతో రోడ్డు విస్తరణ పనులను గత ఏడాది ప్రారంభించారు. అనంతరం ఆ పనులు నిలిపివేశారు. దీంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉంది.

దౌర్జన్యం కేసులో నిందితుల రిమాండ్

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తుర్కవడ్‌గాం గ్రామంలో పొరుగింటి మహిళపై కర్రలు, రాళ్లతో దాడి చేసిన కేసులో ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ కోరేడే రాజు తెలిపారు. గత నెల 31న గ్రామానికి చెందిన బల్చుకూరి అంజన్న, బల్చుకూరి అశోక్, బల్చుకూరి గోపాల్ తమపై దౌర్జన్యం చేస్తూ దాడికి దిగినట్లు బల్చుకూరి శాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి సామగ్రి దగ్ధం

రూ.23వేల నగదు బుగ్గిపాలు


షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన ఇంటిలోని వస్తువులు

హుస్నాబాద్: పట్టణంలోని ముదిరాజ్ కాలనీకి చెందిన తిరుపతి ఇంటిలో మంగళవారం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు పక్క వార్డులో వారి బంధువుల ఇంటిలో జరిగిన ఓ కార్యక్రమానికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఇంటిలో షార్ట్‌సర్క్యూట్‌తో పొగలు వ్యాప్తింది పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. కాలనీ వాసులు గ్రహించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇంటిలోని వస్తువులు, బీరువాలోని విలువైన సామానులతోపాటుగా రూ.23వేల నగదు అగ్నికి ఆహుతయ్యాయి. అప్రమత్తమైన కాలనీవాసులు మంటల్లోనే ఉన్న గ్యాస్ సిలిండర్‌పై నీళ్లు చల్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ విషయంపై స్థానిక రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా, వారు పంచనామా నిర్వహించారు.

కబళించిన కరెంట్ వైర్లు


నర్సిములు మృతదేహం

- కుటుంబంలోని మగవారంతా ప్రమాదవశాత్తు మృత్యువాత
- నాడు భర్త, పెద్దకుమారుడి దుర్మరణం
- తాజాగా చిన్న కుమారుడి మృతి
- రూ. 4లక్షలు ఇచ్చేందుకు అంగీకరించిన విద్యుత్ అధికారులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఆ కుటుంబం పరిస్థితి వర్ణనాతీతం. 2006లో భర్తతోపాటు పెద్ద కుమారుడు ఒకే రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆ షాక్ నుంచి కోలుకుంటున్న కుటుంబానికి మరో పెద్ద షాక్ తగిలింది. పెద్ద దిక్కుగా ఉన్న చిన్న కుమారుడిని సైతం సోమవారం విద్యుత్ తీగలు కబళించాయి. దీంతో ఆ కుటుంబంలో ఉన్న ముగ్గురు మగాళ్లు ప్రమాదాల బారినపడి మృత్యువాత పడ్డారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన యువ రైతు కూరగాయల నర్సిములు(33) సోమవారం సాయంత్రం నిజాంపూర్ రోడ్డు వైపు బైక్‌పై వెళ్తుండగా తెగిపడిన 11కేవీ విద్యుత్ వైర్లతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. పోలీసులు మృతదేహాన్ని సదాశివపేటలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గదిలో సోమవారం రాత్రి భద్రపరిచారు. దీంతో విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు మంగళవారం ఉదయమే పెద్దఎత్తున ఆస్పత్రికి వెళ్లి అక్కడి నుంచి సదాశివపేటలోని విద్యుత్ సబ్ స్టేషన్కు చేరుకున్నారు. విద్యుత్ అధికారులు ఆస్పత్రికి వస్తామని చెప్పడంతో తిరిగి వెళ్లారు. విద్యుత్ ఏడీఈ ప్రేమ్ కుమార్, ఏఈ ప్రకాష్‌తో ఉప సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు మద్దికుంట శేఖర్, నరేష్ గౌడ్, వెంకటేశం, పెద్ద పోచన్న, విజయ్ కుమార్, నగేష్ మాజీ సర్పంచ్‌లు విష్ణువర్ధన్ రెడ్డి, కృష్ణలు చర్చలు జరిపారు. దీంతో అధికారులు రూ. 4లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు అంత్యక్రియలకు రూ. 10వేలు ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో పోలీసులు పంచనామా చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పాపం జనాబాయి

వెంకటాపూర్ గ్రామానికి చెందిన కూరగాయల జనాబాయికి ఇద్దరు కుమారులు, ఒక కూతరు, పిల్లాపాపలతో సంతోషంగా జీవిస్తున్న ఆ కుటుంబంలో 2006 సంవత్సరం విషాదం నింపింది. సంగారెడ్డిలో ట్రాక్టర్ మరమ్మతు చేయించుకొని తండ్రీకొడుకులు ఆ వాహనంపై వస్తుండగా, జాతీయ రహదారి పెద్దాపూర్ గ్రామం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తండ్రీకొడుకులిద్దరూ మృతి చెందారు. దీంతో జనాబాయి భర్తను, పెద్ద కొడుకును కోల్పోయింది. ప్రస్తుతం కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న తన చిన్న కుమారుడు సైతం మృతి చెందడంతో ఆమె రోదనలు మిన్నంటాయి. మృతుడు నర్సిములుకు భార్య జ్యోతితోపాటు ఇద్దరు కుమారులు, ఒక్క కూతురు ఉన్నారు. నర్సిములు మృతితో బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రసూలాబాద్‌లో చోరీ

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని ఐనాపూరు శివారు పల్లె రసూలాబాద్‌లో ఓ చిరు దుకాణంలో చోరీ జరిగిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కొమురవెల్లి నుంచి ఐనాపూరు వెళ్లేదారిలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం ఎదురుగా ఎండీ.ఇబ్రహీం దుకాణంలో తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. దుకాణం వెనుకాల రేకును కట్టర్‌తో కట్ చేసి లోనికి ప్రవేశించారు. ఆ చిరు దుకాణంలోని రూ.2800 నగదు, సిగరెట్‌ప్యాకెట్లు, కూల్‌డ్రింక్స్‌తోపాటు ఇతర చిల్లర వస్తువులను ఎత్తుకెళ్లారు. మొత్తం కలిసి సుమారు రూ.10 వేల విలువైన వస్తువులను దొంగిలించారు. కొమురవెల్లి ఎస్‌ఐ సతీష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్, నికోబార్ దీవుల్లో ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈశాన్య రాష్ట్రాలు, తమిళనాడు, కేరళల్లోని దక్షిణ తీర ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. ఉత్తర, వాయవ్య భారతం, తూర్పు రాష్ట్రాలు, ఢిల్లీలో దట్టమైన నుంచి అతి దట్టమైన పొగ మంచు ఆవరించి ఉంటుంది. వాయవ్య భారతంలో చలిగాలులు వేచే అవకాశం ఉంది.

సంగారెడ్డి వాతావరణం

గరిష్టం కనిష్టం
25.0°/12.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	17.7	08.4
కోల్‌కతా	24.8	15.0
బెంగళూరు	29.0	17.8
ముంబై	28.7	14.1
చెన్నై	30.6	22.4

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట
అనంతపురం	33.2/17.3	విజయవాడ	30.2/20.0
గుంటూరు	33.0/15.2	వరంగల్	30.1/16.0
కర్నూలు	32.5/18.7	ఆదిలాబాద్	30.1/07.4
మహబూబ్‌నగర్	32.3/18.0	ఏలూరు	29.8/20.9
కడప	32.2/18.0	రాజమండ్రి	29.8/20.9
ఒంగోలు	31.6/22.1	తాడేపల్లిగూడెం	29.8/20.9
నెల్లూరు	31.5/22.5	కాకినాడ	29.7/21.5
మెదక్	31.3/12.0	హైదరాబాద్	29.6/15.8
చిత్తూరు	31.2/18.4	రంగారెడ్డి	29.6/15.8
తిరుపతి	31.2/18.4	నల్లగొండ	29.4/15.0
ఖమ్మం	31.0/14.4	విశాఖపట్నం	29.0/21.4
నిజామాబాద్	30.9/14.8	శ్రీకాకుళం	27.0/17.5
కరీంనగర్	30.5/13.3	విజయనగరం	27.0/17.5

బుల్లితెర

W

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 గుడ్ మార్నింగ్
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.30 న్యూస్ ఫీచర్
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 న్యూస్ ఫీచర్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్


టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 పాండు
ఉ.09.30 కొడుకు
మ.12.00 అన్నయ్య
సా.06.00 నాయకుడు
రా.09.00 శ్రీరామ్



మూవీస్ నౌ
ఉ.08.55 థోర్
మ.01.35 ద మాస్క్
మ.03.15 డై అనదర్ డే
సా.05.30 ఫైనల్ డెస్టినేషన్ 3
రా.09.00 రష్ అవర్ 3




హెచ్‌బీవో
ఉ.06.00 మునిచ్
ఉ.08.47 ద అకౌంటెంట్
మ.01.47 టవర్ ఆఫ్ డెత్
సా.05.01 ఐరన్ మ్యాన్
రా.09.00 సూసైడ్ స్క్వాడ్



స్టార్ మూవీస్
ఉ.08.16 ద వోల్వరిన్
ఉ.10.40 జూటాపియా
మ.12.38 ప్రిడేటర్
సా.04.43 కుంగ్‌ఫు పాండా 3
రా.09.00 స్పైడర్-మ్యాన్



మా మూవీస్
ఉ.07.00 రామదండు
ఉ.09.00 ఎస్.పి.పరశురాం
మ.12.00 మొదటి సినిమా
సా.06.00 నువ్వు లేక నేను లేను
రా.09.00 మన్మథ



జీ సినిమా
ఉ.04.45 షాదీ సే పెహ్లే
ఉ.08.30 దిల్‌దార్: ద ఆర్య
ఉ.11.28 హసీనా మాన్ జాయేగీ
రా.09.00 బిజినెస్‌మ్యాన్ 2
రా.11.54 త్రిపుర

తిరుమల సమాచారం

తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాం.

సాయింత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:
ఉచిత గదులు –ఖాళీ లేవు
రూ.50 గదులు –05 ఖాళీ ఉన్నాం
రూ.100 గదులు–20 ఖాళీ ఉన్నాం
రూ.500 గదులు–ఖాళీ లేవు

సేవలు
సహస్ర దీపాలంకరణ–ఖాళీ లేవు
వసంతోత్సవం–ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం–ఖాళీ లేవు
బుధవారం ప్రత్యేక సేవ : సహస్రకలశాభిషేకం



కొమురవెల్లి ఆలయ సమాచారం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లిలోని మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ సాధరణంగా ఉంది. భక్తులు స్వామి వారిని ఆలయ ముఖ మండపం నుంచి అర్ధ మండపం ద్వారా దర్శించుకున్నారు.

నిత్య పూజలు:
ఆలయంలో తెల్లవారుజామున 4 నుంచి 4.30 వరకు స్వామి వారి మేలుకొలుపు (ఒగ్గ ప్రార్థన). 4.30 నుంచి 5 వరకు సుప్రభాతం. ఉ.5 నుంచి 6 వరకు స్వామివారికి తీర్థపు బిందె తెచ్చుట (రుద్రాభిషేకం). మ.12కు మహానివేదన (ద్వార బంధనం). ఉ.6 నుంచి రాత్రి 7 వరకు దైవ దర్శనం. రాత్రి 7.30 నిత్యాభిషేకం. రాత్రి 8.30 గంటలలకు ద్వార బంధనం.

ఆర్జిత సేవలు:
ఉ.6 నుంచి ఉ.10 వరకు అభిషేకాలు, ఉ.9 నుంచి సా.6 వరకు వాహన పూజలు, ఉ.10.30 నుంచి స్వామి వారి నిత్య కల్యాణం. రాత్రి 8 గంటలకు ఒగ్గు ప్రార్థన (పవళింపు సేవ)
ఆలయంలో బుధవారం గదుల సమాచారం:
రూ.300 గదులు 72ఖాళీగా ఉన్నాయి.
రూ.600 గదులు 26 ఖాళీగా ఉన్నాయి.
ఆలయ ఈఓ రామకృష్ణారావు ఫోన్: 94910 00652
గదుల విచారణ ఇన్‌చార్జి అధికారి
ఎం.పోచయ్య ఫోన్: 95537 83488





Padi-Panta

పశువులు పైలం

- పశు పోషణపై అప్రమత్తత అవసరం
- చలికాలంలో ప్రత్యేకంగా దృష్టి సారించాలి
- పశువుల పాకలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- వైద్యాధికారుల సూచనలు పాటించాలి
- టేక్మాల్ జూనియర్ వైద్యాధికారి సతీష్

టేక్మాల్(మెదక్): చలి విజృంభిస్తుండడంతో జీవులు అల్లాడిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోతుండడం.. విపరీతమైన చల్లటి గాలులతో పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాటి ప్రాణాలకే ప్రమాదమని టేక్మాల్ జూనియర్ పశువైద్యాధికారి సతీష్‌కుమార్ తెలిపారు. చలికాలంలో పశువులను కాపాడుకునేందుకు ఆయన అందించిన సలహాలు, సూచనలు మీకోసం..

వెచ్చటి నివాసం ఏర్పాటు చేయాలి

పశువులను విపరీతమైన చలి గాలుల నుంచి కాపాడుకునేందుకు వెచ్చటి నివాసం ఏర్పాటు చేయాలి. రాత్రిపూట దూడలను షెడ్లలోనే ఉంచాలి. పాకలకు ఇరువైపులా గోనెపట్టాలను వేలాడదీయాలి. పాకలో నేలపై రాత్రిపూట గడ్డి పేరిస్తే వెచ్చగా ఉంటుంది. పాకలో వెచ్చదనాన్ని కల్పించేందుకు, ఉష్ణోగ్రతను పెంచేందుకు హీటర్స్ పెడితే బాగుంటుంది.

పశువులకు మేత

పశువులకు వేసే మేతలోనూ తగుజాగ్రత్తలు తీసుకోవాలి. ఆవుదూడలకు శరీర బరువులో 10వ వంతు పాలు, గేదె దూడలకు 15వ వంతు పాలు తాగించాలి. రెండు మాసాల దూడలకు ప్రత్యేకంగా తయారుచేసిన కాపుస్టార్టర్‌ను ధాన్యంగా ఇవ్వాలి. దూడలకు మొదటి మూడు మాసాలు పాలు తాగించాలి. దూడపుట్టిన రెండు వారాల తర్వాత పశుగ్రాసాలు, దానాల్లో మాంసకృత్తులు ఎక్కువగాఉండి పీచు పదార్థాలు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. దానాతింటే దూడలు ఆరోగ్యంగా ఉండి శరీర బరువు త్వరగా పెరుగుతాయి. దూడలకు కనిజలవణాలు ఇవ్వడంతో ఆరోగ్యంగా ఉంటాయి.

ఆరోగ్య పరిరక్షణ అవసరం

పశువులు చలికాలంలో నిమోనియా వ్యాధికి గురై మృత్యువాత పడే అవకాశం ఉంది. తరచూ నట్టల నివారణ మందులు తాగించాలి. బొడ్డువాపు, విరేచనాలు, కడుపు ఉబ్బడం వంటి వ్యాధులకు గురైతే వెంటనే చికిత్స చేయించాలి. అంటు వ్యాధులు సోకకుండా ముందుజాగ్రత్తగా గొంతువాపు, జబ్బవాపు వ్యాధులు రాకుండా ఆరునెలల వయసులో ఆ వ్యాధుల నివారణ టీకాలు ఇప్పించాలి. సూక్ష్మజీవులు, గాలి, నీరు మలమూత్రాల ద్వారా ఒక దూడనుంచి మరొక దూడకు వ్యాధులు వ్యాపిస్తాయి కాబట్టి దూడల పాకలను ఎప్పుడు శుభ్రంగా ఉంచాలి. తాగడానికి నీటిని అందుబాటులో ఉంచాలి. నీటి తొట్లను, పరిసరాలను శుభ్రంగా ఉంచితే పశువులు ఆరోగ్యంగా ఉంటాయి.



పశువుల మంద (ఫైల్), సతీష్‌కుమార్
జూనియర్ పశువైద్యాధికారి (99495 53097)




చికెన్ (సుగుణ)	స్కిన్	స్కిన్‌లెస్
	138	158

భవిష్యం

మేషం: వ్యయ ప్రయాసలు. బంధువులతో మాటపట్టింపులు. దేవాలయాలు సందర్శిస్తారు. అనుకోని ఖర్చులు. వృత్తి, వ్యాపారాలలో ఇబ్బందులు.

వృషభం: కొత్త కార్యక్రమాలకు శ్రీకారం. శుభవార్తలు. మిత్రుల నుంచి ధనలాభం. విలువైన వస్తువులు సేకరిస్తారు. వ్యాపారాలలో లాభాలు. ఉద్యోగులకు పనిభారం తగ్గుతుంది.

మిథునం: ఆదాయానికి మించి ఖర్చులు చేస్తారు. పనుల్లో జాప్యం జరగవచ్చు. కష్టపడ్డా ఫలితం ఉండదు. కుటుంబ సభ్యులతో విభేదాలు రావచ్చు. వ్యాపార, ఉద్యోగాలు మందకొడిగా సాగే అవకాశం ఉంది.



కర్కాటకం: విద్యార్థులకు అనుకూల సమాచారం. విందువినోదాలు. కార్యసిద్ధి. పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలలో ఊహించని లాభాలు. ఉద్యోగులకు పదోన్నతులు.

సింహం: మిత్రులతో కలహాలు. కొత్త రుణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. పనుల్లో ఆటంకాలు. వ్యాపారాలు, ఉద్యోగాలు నిరాశ పరుస్తాయి.

కన్య: దూరపు బంధువుల కలయిక. విందు వినోదాలు. చిన్ననాటి సంఘటనలు గుర్తుకు వస్తాయి. శుభవార్తలు. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి.

తుల: సన్నిహితులతో వివాదాలుసర్దుబాటు కాగలవు. ఆర్థికాభివృద్ధి. పనుల్లో పురోగతి. శుభకార్యాలకు హాజరవుతారు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూలత.

వృశ్చికం: ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. వ్యయప్రయాసలు. కుటుంబసభ్యులతో వివాదాలు. వృత్తి, వ్యాపారాలు సాధారణంగా ఉంటాయి.

ధనుస్సు: మిత్రులతో మాటపట్టింపులు. శ్రమాధిక్యం. పనులు ముందుకు సాగవు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వృత్తి, వ్యాపారాలలో చికాకులు పెరుగుతాయి.


మకరం: ఇంటాబయటా అనుకూలం. కొత్త విషయాలు తెలుసుకుంటారు. పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగులు సమర్థత చాటుకుంటారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

కుంభం: వ్యవహారాలలో విజయం. ఆహ్వానాలు రాగలవు. ఆస్తి వివాదాల నుంచి విముక్తి. సంఘంలో గౌరవం. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొత్త అవకాశాలు.

మీనం: మిత్రులతో కలహాలు. దూర ప్రయాణాలు. కుటుంబంలో ఒత్తిడులు. ఆలయాల సందర్శన. వ్యాపారులకు ఒత్తిళ్లు. ఉద్యోగులు పనిభారంతో సతమతమవుతారు.

– సింహంభట్ల సుబ్బారావు

హలో సాక్షి..
సంగారెడ్డి టౌన్: 9985489901,
సంగారెడ్డి రూరల్ 7702108156
సంగారెడ్డి అర్బన్: 9573701997
సంగారెడ్డి జోన్: 8501925249
సదాశిపేట:9705347294
సదాశిపేట రూరల్: 9346469540
కొండాపూర్: 9989326068
హత్నూర: 9966910336
సంగారెడ్డి క్రైం 9493537021





సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ఫయాజ్‌నగర్ కాలనీలో కచ్చా మురుగు కాలువల వల్ల తీవ్ర దుర్వాసన వస్తోంది. పక్కా కాలువలు నిర్మించాలని ప్రజాప్రతినిధులు అధికారులను పలు మార్లు కోరినా ఏమాత్రం ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 8501925249

పరిశ్రమలకు చిరునామా

- సంగారెడ్డి శివారులో వివిధ కంపెనీల ఏర్పాటు
- రవాణా వ్యవస్థ ఉండడంతో ఆసక్తి చూపుతున్న యాజమాన్యాలు
- స్థానిక యువతకు లభిస్తున్న ఉపాధి



జులకల్ శివారులో బెంగుళూరు బైపాస్ రోడ్డు పక్కన ఏర్పాటైన పరిశ్రమలు

సంగారెడ్డి రూరల్: పరిశ్రమలకు నిలయంగా జిల్లా కేంద్రం రూపుదిద్దుకుంటోంది. వివిధ పరిశ్రమలు పూర్వ సంగారెడ్డి మండలంలో ఏర్పాటవుతున్నాయి. మండల పరిధిలోని జుల్‌కల్, ఇంద్రకరణ్ , ఎద్దుమైలారం, చెర్యాల, మామిడిపల్లి, ఫసల్‌వాడి , ఇస్మాయిల్ ఖాన్‌పేట, ఎర్థనూర్ తదితర గ్రామాల పరిధిలో నూతన పరిశ్రమలు ఏర్పడుతున్నాయి. పరిశ్రమలు తరలిరావడంతో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సంగారెడ్డి జిల్లా కేంద్రం సమీపంగా ఉండటంతో పాటు జాతీయ రహదారులైన 65వ నెంబర్‌తో పాటు ఇటీవల బెంగుళూర్ బైపాస్ రోడ్డు కూడా నాలుగు లైన్ల విస్తరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. తమ ఉత్పత్తులను ముం బాయి, హైదరాబాద్ తదితర నగరాలకు రవాణ చేసేందుకు సౌకర్యాలు మెండుగా ఉండటంతో పారిశ్రామిక వేత్తలు సంగారెడ్డి మండల శివారులోని గ్రామాల పరిధిలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ఎద్దుమైలారంలో ఓడీఎఫ్(ఆయుధ కార్మాగారం) ఏర్పాటైంది. ఆ పరిశ్రమలో సుమారు మూడు వేలకుపైగా కార్మికులు పని చేస్తున్నారు. పటాన్‌చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రమిక వాడగా అనుకొని ఉన్న గ్రామాలు ఇంద్రకరణ్, చెర్యాల శివారులో వివిధ రకాల వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలు అధికంగా ఏర్పడటంతో పారిశ్రామిక వాడగా తయారవుతుంది. ఫసల్ వాదిలో ఏర్పాటు అయిన గణపతి షూగర్ పరిశ్రమలో రైతులు పండించిన చెరుకును గానుగావించడంతో పాటు పలువురికి ఉపాధి లభిస్తోంది. ఇదే కాకుండా పోతిరెడ్డిపల్లి శివారులో గల పెప్సీ పరిశ్రమలో కూడా వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. బెంగుళూర్ బైపాస్ రోడ్డు జుల్‌కల్ గ్రామ శివారులో నుంచి వెళ్లుతుండటంతో ఆ రోడ్డుకు ఇరువైపులా నూతనంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంద్రకరణ్ శివారులో పరిశ్రమల స్థాపన కోసం జిల్లా పరిశ్రమల కేంద్రం ఇప్పటికే కొన్ని వందల ఎకరాల భూమిని కేటాయించింది. నూతనంగా పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి స్థలంతో పాటు విద్యుత్, నీటి సరఫరా తదితర సౌకర్యాలను కల్పిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం పారిశ్రామికవాడగా రూపొందుతోంది. అలాగే పరిశ్రమలు కూడా ఈ ప్రాంతానికి ఎక్కువగా వస్తుండటంతో ఇక్కడి భూముల ధరలు అమాంతంగా పెరిగాయి.

న్యూస్ బాక్స్

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



సంగారెడ్డి జోన్ : నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. మంగళవారం టీఆర్‌ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 2018 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సకాలంలో వర్షాలు సంవృద్ధిగా కురిసి జిల్లా రైతాంగంతో పాటు ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. టీఆర్‌ఎస్ నాయకులు శ్రీకాంత్, అన్వేష్, మోహన్‌సింగ్, వీరేశ్‌చారి, వాజీద్ , సంతోష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

కాలనీల్లో టీమాస్ బృందం పర్యటన



సంగారెడ్డి జోన్: ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తూ మురికి వాడల్లోని సమస్యలను పరిష్కరించాలని టీమాస్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు జయరాజు, పట్టణ చైర్మన్ మల్లయ్యలు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ ంలోని బాబా నగర్, ఎల్‌బీనగర్, భగత్‌సింగ్ నగర్, నేతాజినగర్‌ల్లో వారు పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీమాస్ నాయకులు మల్లేశ్వరీ, యాదవరెడ్డి, నర్సింలు, రాజు, యాదయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో..

కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

సంగారెడ్డి రూరల్ :దేశ వ్యాప్తంగా వివిధ పథకాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశ , ఏఎన్ఎం, సర్వ శిక్ష అభియాన్‌లలో పని చేసే వారందరిని కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సాయిలు డిమాండ్ చేశారు. మంగళవారం కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశావర్కర్లు 106 రోజుల పాటు సమ్మె చేస్తే నెలకు రూ.6 వేలు ఇస్తానని హామీ ఇచ్చిన అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. పనికి తగ్గ వేతనాలు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించడం లేదన్నారు. అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలు సమాజ సేవలో అంకిత భావంతో పని చేస్తున్నారన్నారు. ఆశ వర్కర్లకు నెలకు కనీస వేతనం రూ.18 వేలతో పాటు చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

టీజేఏసీ జిల్లా కన్వీనర్ బీరయ్యయాదవ్



మాట్లాడుతున్న బీరయ్యయాదవ్

కొండాపూర్(సంగారెడ్డి):రైతులకు టీజేఏసీ బృందం అండగా ఉంటుందని టీజేఏసీ జిల్లా కన్వీనర్ బీరయ్య యాదవ్ తెలిపారు.మంగళవారం మండల పరిధిలోని మాందాపూర్ గ్రామంలో టీజేఏసీ అధ్యయన యాత్రలో భాగంగా గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు.అనంతరం ఆయన గ్రామ రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూమి లేని దళితులు గ్రామంలో చాలా మంది ఉన్నారన్నారు. ఇప్పటివరకు ఒక్క దళితుడికి కూడా భూ పంపిణీ చేయకపోవడమే కాకుండా ప్రధాని మన్మోహన్‌సింగ్ హయాంలో సర్వే 22లో రాళ్లు, రప్పలు కలిగిన 200 ఎకరాలను 200 మంది రైతులకు పంపిణీ చేశారన్నారు.ప్రస్తుతం ఆన్‌లైన్‌లో భూమి 1బీలో రావడం లేదన్నారు. సర్వే 22లో గల భూమిని తమ వద్ద నుండి లాక్కొనేందుకు రెవెన్యూ అధికారులు, బ్రోకర్లు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.గ్రామంలో 90 శాతం మంది లక్షల్లో పెట్టుబడి పెట్టి పత్తిని సాగుచేస్తే చాలామంది రైతులు నష్టపోయారని, వారికి పరిహారం ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ రైతు కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా గోపాల్, ఉపాధ్యక్షులుగా శాంతమ్మ, జానయ్య, ప్రధాన కార్యదర్శిగా లాలయ్య, కార్యదర్శిగా సిద్ధయ్య, ప్రచార కార్చదర్శిగా రాములు, కోఆర్డినేటర్‌గా పద్మలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ తుల్జారెడ్డి, మండల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు నరేష్,అనిల్ పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

టెట్ నిర్వహించాలి



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఏడాదికి రెండుసార్లు టెట్ నిర్వ హిస్తామని చెప్పి ఒకేసారి జరపడం అన్యాయం. దీనివల్ల డీఎడ్, బీఎల్ అభ్యర్థులకు నష్టం జరుగుతోంది. టీఆర్టీ నిర్వహణకు సమయం ఉన్నందున ప్రభుత్వం వెంటనే టెట్ ప్రకటనను జారీ చేయాలి. ఫిబ్రవరి వరకు ప్రక్రియను పూర్తి చేసి,టీఆర్టీలో వారికీ అవకాశం కల్పించాలి.

–ఎండీ పయాజ్, పట్టభద్రుల సంఘం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు

సంగారెడ్డి | బుధవారం | జనవరి | 3 | 2018 సాక్షి

- నగర పంచాయతీలో ఒక్క కాగితం సరిగ్గాలేదు
- సీడీఎంఏ కార్యాలయ రీజినల్ డైరెక్టర్ మసూద్
- స్వచ్ఛ భారత్ పనులపై అసంతృప్తి

సమన్వయం లేదు

జోగిపేట(అందోల్): నేను ఇప్పటివరకు ఎన్నో మున్సిపాలిటీల్లో విచారణల కోసం వెళ్లానని, ఇలాంటి మున్సిపాలిటీలా ఎక్కడా లేదని, ఇక్కడ సమన్వయ లోపం.. అవసరమైన కాగితాలు అస్సలు దొరకవు.. చాలా పనులు అసంపూర్తిగా ఉన్నాయంటూ సీడీఎంఏ (కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) రీజినల్ డైరెక్టర్ షాహెద్ మసూద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం జోగిపేట–అందోల్ నగర పంచాయతీలో స్వచ్ఛ భారత్ భారత్‌లో భాగంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లు, బిల్లుల చెల్లింపునకు సంబంధించి వ్యత్యాసాలపై రాష్ట్ర ఉన్నత అధికారి ఆదేశాల మేరకు విచారణ కోసం వచ్చారు. సుమారు గంట సేపు నగర పంచాయతీ కమిషనర్, ఏఈ, ఇతర అధికారులు, నగర పంచాయతీ స్వచ్ఛ భారత్ ఇన్‌చార్జి సుజాత పాల్గొన్నారు. నగర పంచాయతీలో 2015 నుంచి చేపడుతున్న ఈ కార్యక్రమం వివరాలు పరిశీలించిన మసూద్ తీవ్ర అసంతృప్తి, అసహనాన్ని వ్యక్తం చేశారు. తర్వాత వైస్ చైర్మన్, కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నగర పంచాయతీలో 1785 మంది వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి అర్హులుగా గుర్తించారు. రెండేళ్లుగా నిర్మాణాలు చేపడుతున్నా ఇప్పటి వరకు 100 శాతం పూర్తి కాలేదు.


అధికారులతో సమావేశమైన రీజినల్ డైరెక్టర్

మరుగుదొడ్ల డబ్బులు ఇప్పించండి

నగర పంచాయతీలో కమిషనర్లుగా పనిచేసిన వారు ఇచ్చిన ఆదేశాల మేరకే నిర్మించుకున్న మరుగుదొడ్లకు ఏడాదిగా బిల్లులు చెల్లించడం లేదని వైస్ చైర్మన్ రాములు, కౌన్సిలర్ ప్రదీప్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సురేందర్ గౌడ్, అందోల్ ప్రజాప్రతినిధులు రవిశేఖర్‌రెడ్డి, రామకృష్ణలు రీజినల్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అందోల్‌లోని 6వ వార్డులో దళితులు 30 మంది వరకు స్వంత ఖర్చులతో నిర్మించుకున్నారన్నారు. వారికి బిల్లులు రాక అప్పుల పాలయ్యారని, వారికి బిల్లులు ఇప్పించాలని వైస్ చైర్మన్ కోరారు. కాంట్రాక్టర్లు నిర్మించిన మరుగుదొడ్లు అసంపూర్తిగా ఉన్నా బిల్లులను మాత్రం చెల్లించారని చెప్పారు. బిల్లులు చెల్లించాల్సిన వారికి సంబంధించి సీడీఎంఏకు వివరాలు రాసి పంపాలని రీజినల్ డైరెక్టర్ కమిషనర్‌ను ఆదేశించారు.

ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది కొరత

టీమాస్ ఫోరం నాయకులు

నారాయణఖేడ్: స్థానిక ఆస్పత్రి 30 పడకలకే పరిమితమైందని టీమాస్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఎ. మాణిక్యం అన్నారు. టీమాస్ ఫోరం ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆస్పత్రిలో మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని అన్నారు. ఫలితంగా రోగులు అవస్థల పాలవుతున్నట్లు చెప్పారు. డాక్టర్లు లేని కారణంగా ఆపరేషన్ థియేటర్‌ను వారంలో రెండు రోజులు మాత్రమే నిర్వహిస్తున్నారని అన్నారు. డెంగీ, స్వైన్‌ఫ్లూ, సర్జికల్, థైరాయిడ్, ప్రొఫైల్ వంటి పరీక్షలు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తోందన్నారు. కనీసం సిటీ స్కానింగ్ కూడా లేదని అన్నారు. ఆస్పత్రిలో వంద పడకలకు సరిపోయే మేర డాక్టర్లు, సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీమాస్‌ఫోరం నాయకులు చిరంజీవి, కాన్షీరాం, నర్సింహులు, అరుణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మెడికల్ కమిషన్ ఏర్పాటు సరికాదు

సంగారెడ్డి టౌన్: మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను రద్దు చేయడంతోపాటు నేషనల్ మెడికల్ కమిషన్‌లో డాక్టర్ల ప్రాతినిధ్యాన్ని తగ్గించి ఇతరులను సభ్యులుగా నియమించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మంజీర శాఖ కమిటీ ఉపాధ్యక్షుడు చక్రపాణి అన్నారు. ఈ మేరకు సంగారెడ్డి పట్టణంతోపాటు మండల పరిధిలోని ఔట్ పేషెంట్ క్లినిక్‌లు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఓపీ సేవలను నిలిపివేసి డాక్టర్లు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోతిరెడ్డిపల్లిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చక్రపాణి మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కమిషన్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అర్హత లేని వారిని పీజీ విద్యకు అనుమతించడం సరికాదన్నారు. ఎంబీబీఎస్ పాసైన తర్వాత వైద్య విద్యార్థులకు ఎగ్జిట్ పరీక్ష నిర్వహించడం సరికాదన్నారు. ఎన్ఎంసీలో ప్రతిపాదించిన అంశాల్లో అభ్యంతరకరమైన అంశాలను తొలగించాలన్నారు. గతంలో ప్రభుత్వానికి ఈ విషయమై పలుమార్లు వినతులు అందజేశామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులుగా డాక్టర్ జయనిర్మల, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్, కోశాధికారి స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు స్వల్ప అస్వస్థత

ఖేడ్ ఆస్పత్రిలో చికిత్స

నారాయణఖేడ్: స్థానిక ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మంగళవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆయనకు రక్త పరీక్షలతోపాటు, రక్తపోటును సైతం వైద్యుడు ప్రహ్లాద్‌నాయక్ పరీక్షించారు. అనంతరం వైద్యులు ఎమ్మెల్యేకు మందులు ఇచ్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. రోగులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని, సత్వర చికిత్సలు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ నజీబ్, ఎంపీటీసీ సభ్యుడు ముజమ్మిల్, ఏఎంసీ వైస్ చైర్మన్ బాసిత్, టీఆర్ఎస్ నాయకులు యూసుఫ్, గౌస్‌చిస్తి తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని పరీక్షిస్తున్న డాక్టర్

పటాన్‌చెరులో షార్ట్ ఫిల్మ్ షూటింగ్

పటాన్‌చెరు టౌన్: పట్టణ శివారులో మంగళవారం ఓ ప్రేమ కథ షార్ట్‌ఫిల్మ్ షూటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు దానికి సంబంధించిన వివరాలు తెలియజేశారు. ఎమ్కే ప్రొడక్షన్స్ నిర్మాణంలో నిన్నే ప్రేమించాను అనే చిత్రం షార్ట్ ఫిల్మ్ షూటింగ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ షార్ట్ ఫిల్మ్‌లో హీరోగా కార్తీక్, హీరోయిన్‌గా ఇందు, విలన్‌గా మన్నె విజయ్ కుమార్ నటిస్తున్నట్లు వారు తెలిపారు. షూటింగ్ మొదటి రోజు క్లైమాక్స్‌కు సంబంధించిన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించామని తెలిపారు.

మూడు కాళ్ల దూడ జననం

రాయికోడ్(అందోల్): ఓ ఆవు మూడు కాళ్ల లేగ దూడను ప్రసవించిన సంఘటన మండలంలో నికుసునూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలోని రైతు వెంకట్‌రెడ్డికి చెందిన ఆవుకు మంగళవారం దూడ జన్మించింది. కాసేపటికి రైతు దూడను గమనించగా మూడు కాళ్లే ఉండడంతో ఆశ్చర్యపోయాడు. వెనుక రెండు కాళ్లు సాధారణంగానే ఉన్నా ముందు భాగంలో ఒకే కాలు ఉండడంతో ఒకింత కలవరపడ్డాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు దాన్ని వింతగా చూశారు. పలువురు ఆ లేగదూడకు పూజలు సైతం నిర్వహించారు. ఆవు, లేగ దూడలు బాగానే ఉన్నాయని రైతు వెంకట్‌రెడ్డి తెలిపాడు.


మూడు కాళ్ల దూడ, ఆవుతో రైతు వెంకట్‌రెడ్డి

సంచార పశువైద్యంలో ఖేడ్, జహీరాబాద్ టాప్

నారాయణఖేడ్: సంచార పశువైద్యం అందించడంలో రాష్ట్రంలోనే నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాలు గుర్తింపు సాధించాయని 108 సంచార పశువైద్యశాలల సేవల జిల్లా సమన్వయకర్త సురేష్ కుమార్, మేనేజర్ జాన్ షాహెద్‌లు తెలిపారు. నారాయణఖేడ్‌కు మంగళవారం వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. డిసెంబర్‌కు సంబంధించి సంచార పశువైద్యశాలల ద్వారా అధికంగా సేవలు అందించిన నియోజకవర్గాలు ఆరు ఎంపికయ్యాయని అన్నారు. అందులో సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్‌లు ఉన్నాయని అన్నారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో ఐదు వాహనాల ద్వారా సంచార పశువైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. డిసెంబర్‌లో జిల్లాలోకెల్లా అత్యధికంగా జహీరాబాద్‌లో 1,650 పశువులకు, నారాయణఖేడ్‌లో 1,627పశువులకు చికిత్సలు అందించినట్లు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర పశువైద్యశాఖ అధికారులు ప్రకటించినట్లు తెలిపారు. నారాయణఖేడ్‌లో సంచార పశువైద్యశాల వైద్యురాలు డా.శివమంగల్, వెటర్నరీ సహాయకుడు శ్రీకాంత్, సిబ్బంది అమర్, ప్రవీణ్‌లను అభినందించారు. పశువైద్య సేవల్లో సిబ్బంది కృషి ఎంతగానో ఉందని ప్రశంసించారు.



నారాయణఖేడ్: సిబ్బందితో సురేష్‌కుమార్, మేనేజర్ జాన్‌షాహెద్

బస్సు సౌకర్యం కోసం చెయ్యి కోసుకున్న యువతి

సంగారెడ్డి రూరల్: బస్సు సౌకర్యం కోసం ఓ యువతి మంగళవారం చెయ్యి కోసుకొని నిరసన వ్యక్తం చేసింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కంది మదిర గ్రామం చిమ్నాపూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని అనేక సార్లు ఆర్టీసీ డిపోవారి దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. దీంతో సింధు అనే యువతి బస్సు సౌకర్యం కలిగించకపోవడాన్ని నిరసిస్తూ చెయ్యి కోసుకుంది. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విద్యార్థినికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.



పంచ్ పడితే పతకమే!



- ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో రాణిస్తున్న తెలుగుతేజం
- సూపర్ బాక్సింగ్ లీగ్‌లో ఉత్తమ ప్రతిభ
- దేశసేవ చేస్తూనే క్రీడల్లో రాణిస్తున్న జవాన్
- ఒలింపిక్స్ పతకమే లక్ష్యమంటున్న వెంకటేశ్వర్లు

ఎక్కడో మారుమూల తండాలో పుట్టిన ఆ యువకుడు అంతర్జాతీయ స్థాయి బాక్సర్‌గా ఎదిగాడు. దేశసేవ కోసం సైనికుడైనా.. తాను నేర్చుకున్న బాక్సింగ్‌ను వదల్లేదు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలం దొక్కలబావి తండాకు చెందిన సఫావత్ వెంకటేశ్వర్లు ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో మన రాష్ట్రానికి పతకాల పంట పండిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు.

- తిరుమలగిరి నుంచి అశోక్



సాధించిన పతకాలతో వెంకటేశ్వర్లు..

ఆర్మీలో పనిచేస్తూనే..


నల్లగొండలోని మార్కోని ఐటీఐ కళాశాలలో చదువుతున్న సమయంలోనే బాక్సింగ్ వైపు మళ్లాడు వెంకటేశ్వర్లు. అప్పట్లో వన్‌టౌన్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న జిలానీ.. వెంకటేశ్వర్లుకు అండగా నిలిచారు. చదువుకు అవసరమైన పుస్తకాలతోపాటు, బాక్సింగ్ కోచింగ్‌కు అన్ని విధాలా సాయం చేశారు. దీంతోపాటు మల్లేష్ మాస్టర్ వద్ద కోచింగ్‌తో మిషన్ ఆన్ రింగ్‌గా మారాడు. వివిధ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు గెలిచే స్థాయికి ఎదిగాడు. రెండుసార్లు ప్రొఫెషనల్ ఛాంపియన్‌షిప్‌లో ప్రపంచ చాంపియన్ అయిన అమీర్‌ఖాన్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నాడు వెంకటేశ్వర్లు. రక్షణ శాఖలో జవాన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు, సెలవుల్లో బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటూ వివిధ వేదికలపై రాణిస్తున్నాడు.

అంతర్జాతీయ స్థాయికి..

- ఇటీవల ఢిల్లీలో జరిగిన సూపర్ బాక్సింగ్ లీగ్‌లో 57.5 కేజీల కేటగిరీలో సిల్వర్ మెడల్ సాధించాడు. సినీనటులు సునీల్‌శెట్టి, రాణాల బాహుబలి బాక్సింగ్ టీమ్‌లో దక్షిణ భారతదేశం నుంచి ప్రాతినిథ్యం వహించిన ఏకైక ఆటగాడిగా గుర్తింపు పొందాడు.
- మూడుసార్లు ఆలిండియా నేషనల్ చాంపియన్ షిప్‌లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించాడు. 2013లో తమిళనాడు కాట్‌పాడ్‌లో సౌత్‌జోన్ చాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ పొందాడు.
- వెస్ట్‌బెంగాల్ దుర్గాపూర్‌లో జరిగిన ప్రెసిడెంట్ కప్‌లో ప్రతిభ చూపాడు.



ప్రొఫెషనల్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జనవరి 15 నుంచి 30 వరకు బ్యాంకాక్‌లో 52 కేజీల విభాగంలో జరిగే ట్రైనింగ్ కమ్ ఫైట్‌కు అర్హత సాధించాడు వెంకటేశ్వర్లు. ఈ పోటీల్లో దేశం తరపున కేవలం ఇద్దరికి మాత్రమే చోటు దక్కింది. వెంకటేశ్వర్లు ట్రైనింగ్ కమ్ ఫైట్‌లో విజయం సాధించాలని ఆశిద్దాం.



> ద్రాక్ష అధికంగా సాగయ్యే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ముఖ్యంగా ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో విస్తృతంగా పండించే వారు. అయితే కొన్నేళ్లుగా రైతులు ద్రాక్ష సాగుకు దూరంగా జరుగుతూ వస్తున్నారు.

> ఐదారేళ్ల క్రితం వరకు ఇక్కడి ద్రాక్షను విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. ఇప్పుడు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అందని ద్రాక్ష!

రాష్ట్రంలో గణనీయంగా తగ్గిపోయిన ద్రాక్ష సాగు.. సంక్రాంతి తర్వాత మార్కెట్‌లోకి మహారాష్ట్ర సరుకు

గజ్వేల్ నుంచి యెన్నెళ్లి సురేందర్:

తెలంగాణలో ద్రాక్ష సాగుకు ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాలే ఆధారం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా కొంత విస్తీర్ణం సాగయ్యేది. మొత్తంగా యేటా 50వేల ఎకరాలకుపైగా తోటలు సాగులోకి వచ్చేవి. ప్రత్యేకించి ఉమ్మడి మెదక్ జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం ద్రాక్ష సాగులో సింహభాగాన్ని ఆక్రమించేది. విదేశాలకు ఎగుమతి చేసే సీడ్‌లెస్ థామ్సన్, తాజ్‌గణేష్ రకాలు ఈ ప్రాంత రైతులు ప్రధానంగా సాగుచేసేవారు. విదేశాలకే కాకుండా కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కూడా ద్రాక్ష ఎగుమతయ్యేది. కానీ ఈ ఏడాది దిగుమతి చేసుకోవాల్సిందే.

మహారాష్ట్ర నుంచి 'ద్రాక్ష'..

మహారాష్ట్రలో జనవరి మొదటి వారం నుంచి తోటలు కోతకు వస్తుంటాయి. తెలంగాణ జిల్లాల్లో ఫిబ్రవరి చివరి వారంలో కోతకు వస్తాయి. ఒకవేళ ఇక్కడ అడపాదడపా థామ్సన్, తాజ్‌గణేష్ రకాలు సాగు చేసినా అవి గోళీల్లా గుండ్రంగా ఉంటాయి. కానీ మహారాష్ట్రలో సూపర్ సొనాక, మానిక్‌చమన్ లాంటి రకాలు చిటికన వేలు ఆకారంలో ఉండి మార్కెట్‌లో వినియోగదారుల్ని బాగా ఆకర్షిస్తున్నాయి. వీటి దెబ్బకు మన ద్రాక్ష తట్టుకోలేదు.

గణనీయంగా పడిపోయిన సాగు విస్తీర్ణం

2007, 2008 సంవత్సరాల్లో వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా కోట్లల్లో నష్టపోయిన రైతులు ద్రాక్ష సాగంటేనే జంకే పరిస్థితి నెలకొన్నది. తెలంగాణలో అప్పట్లో 50,000 ఎకరాలకుపైగా ద్రాక్ష తోటలు సాగులోకి వస్తే... ప్రస్తుతం ఉమ్మడి మెదక్ జిల్లా, రంగారెడ్డి జిల్లా కలుపుకొని వెయ్యి ఎకరాలు కూడా సాగులోకి రావడం లేదు. ద్రాక్షతోటల స్థానంలో కాస్త లాభసాటిగా ఉండే కూరగాయల సాగుపై దృష్టి సారించారు. సంక్రాంతి తర్వాత మహారాష్ట్ర సరుకు మార్కెట్‌లోకి వచ్చే అవకాశముంది. ఈ ఏడాది కిలో ధర రూ.60 వరకు పలకనుందని అంచనా.

> ఉదాహరణకు గజ్వేల్ నియోకవర్గంలో 2008లో **1500** ఎకరాల్లో ద్రాక్ష సాగులో ఉండగా అది 2009, 2010లో **150** ఎకరాలకు తగ్గిపోయింది. 2013–14లో **40** ఎకరాలకు పడిపోయింది. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి నెలకొన్నది. ఉమ్మడి మెదక్ జిల్లా మొత్తంగా చూస్తే సాగులో ఉన్నది వంద ఎకరాల్లోపే. ఇక్కడ తొమ్మిదేళ్లక్రితం మూడు వేల ఎకరాల్లో 'ద్రాక్ష' సాగైంది.

2006 వరకు ఓకే.. ఆ తర్వాతే..

ఎకరా ద్రాక్ష తోట సాగు చేయాలంటే పదేళ్ల క్రితం కూలీలు, ఎరువులు, ఫంగీసైడ్స్, ఇతర అవసరాలు కలుపుకొని రూ. రెండు లక్షల వరకు పెట్టుబడి అయ్యేది. ప్రస్తుతం ఇది రెట్టింపైంది. ఇంత భారీ పెట్టుబడి పెట్టినా 2006 వరకు రైతులు లాభాలే గడించారు. 2007 నుంచి ద్రాక్ష తోటల సాగుకు సంబంధించి సీను ఒక్కసారిగా మారిపోయింది. ద్రాక్షతోటలు సాధారణంగా జనవరి రెండో వారం నుంచి ఏప్రిల్ నెలలో కోతకు వస్తుంటాయి. ఈ క్రమంలో 2007, 2008 సంవత్సరాల్లో సరిగ్గా కోతల సమయాల్లోనే అకాల వర్షాలు కురిశాయి. 2008లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. మార్చి 23 నుంచి 31 వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ పరిణామం వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు మండలాల్లోనే కాకుండా రాష్ట్రంలో సాగవుతున్న ద్రాక్ష తోటలకు ఫంగస్ సోకి పళ్లన్నీ విషతుల్యమయ్యాయి. ఈ పరిస్థితుల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

మహారాష్ట్రలో ప్రభుత్వం అండ..

మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి ద్రాక్ష రైతులను ప్రోత్సహిస్తున్నది. కొత్తగా ద్రాక్ష సాగుకు సిద్ధమయ్యే రైతులకు బ్యాంక్ రుణం, ఫంగీసైడ్స్, ఫెస్టిసైడ్స్, ఆధునిక పరికరాలు, పందిరి అల్లడానికి వైరు, డ్రిప్ తదితర సౌకర్యాలను కల్పిస్తున్నది. ఒక వేళ రైతులు నష్టపోతే ఎకరాకు రూ. లక్ష వరకు పరిహారాన్ని అందిస్తున్నది. అంతేకాకుండా బ్యాంకుల్లో పంట రుణాలను రెన్యూవల్ చేస్తున్నది. వీటన్నింటికి తోడు రైతులకు మంచి మార్కెటింగ్ సౌకర్యాన్ని సైతం కల్పిస్తోంది.

ఆఖరి మజిలీకి సేవ

బంగళాలు, డబ్బు, నగలు ఎన్ని ఉన్నా.. తృప్తి లేని జీవితం వ్యర్థం. ఎంతసేపు సంపాదన పైనే ధ్యాస ఉన్నా.. ఈ సమాజంలో పదిమందికి సేవ చేసే భాగ్యం కొందరికే ఉంటుంది. ఎవరైనా మరణిస్తూ ఆ కుటుంబసభ్యులను తాకితే.. ఇంటికి వచ్చి స్నానం చేసే ఆచారం మన హిందూ సంప్రదాయంలో ఉంది. ఆచారాలు, కట్టుబాట్లు.. పాటించే ప్రస్తుత సమాజంలో వ్యక్తి భౌతికకాయాన్ని భద్రపరిచే శవపేటిక, అంతిమయాత్రకు వినియోగించే గరుడ వాహనంతో ప్రజలకు సేవ చేసే కోవలోనే ఇక్కడి 'భార్గవపురం సేవా సమితి' తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకుంటోంది. దాతల సహాయంతో ఉడతాభక్తిగా పదిమందికి తొడ్పడేలా.. సమాజహితం కోసం.. పలు రకాల సేవలను అందిస్తోంది..
- హుస్నాబాద్

- సమాజసేవలో భార్గవపురం
- పేదలకు ఉచిత గరుడ సాయం
- కడసారి చూపు కోసం శీతల శవపేటిక
- కనుమ రోజు ఉత్తమ రైతులకు సన్మానం
- యేటా స్వాతంత్ర్య సమరయోధులకు పురస్కారం


గరుడ వాహనాన్ని ప్రారంభిస్తున్న మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు

ప్రస్తుత మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావు సూచన మేరకు హుస్నాబాద్ పట్టణంలో 'భార్గవపురం సేవాసమితి' పేరిట ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ట్రస్ట్ పదిమందికి చేదోడు వాదోడుగా ఉండాలని అభిలషించిన విద్యాసాగర్‌రావు సలహాలు, సూచనలతో 2103, సెప్టెంబర్ 14న ఈ ట్రస్ట్‌ను నెలకొల్పారు. వేలాది మంది జనాభా ఉన్న హుస్నాబాద్ లాంటి పెద్ద పట్టణంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేసేందుకు ప్రత్యేక గరుడ వాహనం లేదని గ్రహించిన గవర్నర్ విద్యాసాగర్‌రావు.. గరుడ వాహనాన్ని ట్రస్ట్‌కు వితరణ చేశారు. ఈ గరుడ వాహనాన్ని విద్యాసాగర్‌రావు అదే రోజు ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు పేద, మధ్య తరగతి ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో అంతిమ సంస్కారాలకు సులువుగా గరుడ వాహనాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో మరణించిన దాదాపు 300 మృతదేహాలను తరలించింది. పోస్ట్‌మార్టం కేంద్రానికి, ఇక్కడి నుంచి వారి గృహాలకు శవాలను తరలించి తోడ్పడుతున్నారు. ఆఖరిమజిలీలో నలుగురు వ్యక్తులు అవసరం లేకుండానే పేద వారి ఇంట్లో మరణం సంభవిస్తే శవ దహనం, ఖననం కోసం స్మశానవాటికకు మృతదేహాన్ని చేర్చేందుకు ఈ గరుడవాహన సౌకర్యాన్ని కల్పిస్తూ ఈ ట్రస్ట్ తన సేవలను విస్తరిస్తోంది. నిరుపేదలకు గరుడ వాహనం సౌకర్యాన్ని ఉచితంగా అందిస్తూ మానవత్వాన్ని చాటుతున్నారు.


శీతల శవపేటికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

కడసారిగా చూసే భాగ్యం...

ఉద్యోగరీత్యా, బతుకుదెరువు కోసం దూర ప్రాంతాల్లో జీవిస్తున్న వారు, తమ ఆప్తులు ఎవరైనా చనిపోతే, ఆ వ్యక్తి వచ్చేంత వరకు మృతదేహాన్ని భద్రపరిచే పరిస్థితులు ఉండేవి కావు. ఎవరైనా కుటుంసభ్యులు చనిపోతే దూర ప్రాంతం, విదేశాల్లో ఉంటున్న వారు వచ్చేవరకు కడసారిగా చూసేందుకు పరిస్థితులు అనుకూలించక, భాధాతప్త హృదయంతో తల్లడిల్లిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల నుంచి గట్టెక్కించేందుకు ఈ భార్గవపురం సేవాసమితి తన వంతు సేవలు అందిస్తోంది. దూరప్రాంతం నుంచి వచ్చేంత వరకు చివరిచూపు చూసే వీలు కల్పించేందుకు శీతల శవపేటికను అందుబాటులో ఉంచారు. ధనవంతులైతే ఇతర పట్టణాల నుంచి శీతల శవపేటక సౌకర్యం పొందేవారు. ఒకానొక సందర్భంలో ఎన్ని డబ్బులు వెచ్చించినా ఈ శీతల శవపేటిక లభించక ఎంతో మంది కుటుంబసభ్యులు కడసారి చూపు చూసే భాగ్యం జారవిడుచుకున్న సందర్భాలు ఉండేవి. కానీ పేదప్రజల చెంతకే ఆ సౌకర్యం కల్పిస్తున్నారు. హుస్నాబాద్ పట్టణానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు సంధ్యావళి తన భర్త జ్ఞాపకార్థం ఈ శీతల శవపేటికను భార్గవపురం సేవాసమితికి వితరణ చేశారు. అప్పటినుంచి దూర ప్రాంతాల్లో ఉన్నవారెవరికైనా ఆఖరి మజిలీలో ఆప్తులను కడసారి చూసేందుకు శీతల శవపేటిక నిర్వాహణ కోసం తక్కువ రుసుముతో అందుబాటులో ఉంచి.. ట్రస్ట్ ఎంతగానో దోహదపడుతోంది.

రైతులకు ఉత్తమ అవార్డులు..

భార్గవపురం సేవాసమితి సామాజికసేవలో భాగంగా దేశానికి వెన్నుముక అయిన రైతన్నను శ్రమజీవిగా గుర్తించి వారిని మరింత ప్రోత్సహించే కార్యక్రమాలను చేపడుతోంది. వ్యవసాయంలో ఆదర్శంగా నిలుస్తూ, సాగులో మెలకువలు, నూతన పద్ధతులు పాటిస్తూ, అధిక దిగుబడి సాధించే రైతులకు ప్రతి యేటా కనుమ పండుగ సందర్భంగా ఉత్తమ అవార్డులతో పాటు సన్మానిస్తున్నారు. వ్యవసాయంలో నూతన ఒరవడిని సృష్టించి ఇతరులకు ఆదర్శంగా నిలిచే మహిళా రైతులను గుర్తించి ప్రతి యేటా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ రైతులుగా ప్రకటించి, ఉత్తమ పురస్కారాలను అందిస్తున్నారు. విద్య, ఉద్యోగ, క్రీడారంగంలో ప్రతిభ చాటుతున్న విద్యార్థులు, యువకులకు సన్మానం కార్యక్రమాలను నిర్వహిస్తూ.. వారి పట్టుదల, కృషిని సమాజానికి తెలియపరుస్తూ.. యువతకు మంచి సందేశాన్ని చేరవేయడంలో ట్రస్ట్ తమ పాత్రను పోషిస్తోంది. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు, సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడమే కాకుండా.. మహానుభావుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించే వారి కృషిని సమాజానికి తెలిసేలా ఈ ట్రస్ట్ విశిష్ట సేవలను అందిస్తోంది.

నాకు ఎదురైన సమస్య మరెవరికీ రాకూడదు..



నేను ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నా. నాకున్న ఇద్దరు కుమారుల్లో ఒకరు డాక్టర్ మురళీకృష్ణ, మరొకరు సంతోష్ (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్) విదేశాల్లో ఉంటున్నాడు. నా భర్త చంద్రమోహన్ గుండెపోటుతో మరణించాడు. విదేశాల్లో ఉన్న నా కుమారుడు తండ్రి కడసారి చూపునకు నోచుకోవాలని కోరాడు. దాంతో అప్పటివరకు మృతదేహాన్ని భద్రపర్చేందుకు ఇక్కడ శవపేటిక అందుబాటులో లేదు. దీని కోసం చాలా తిరిగాం. చివరకు బెజ్జంకి నుంచి శవపేటికను తెప్పించాం. ఎంత డబ్బు ఉంటే ఏం లాభం.. శవపేటిక కోసం అన్వేషించాం. సమయానికి శవపేటిక లభించడంతో నా కుమారుడు, తండ్రి చూపును చూసే భాగ్యం కలిగింది. మేము ఎదుర్కొన్న బాధ మరో కుటుంబానికి కలుగకూడదని నా భర్త జ్ఞాపకార్థం శవపేటికను వితరణ చేశాను.
– సంధ్యావళి, శవపేటిక దాత, హుస్నాబాద్

త్వరలో కర్మకాండ నిలయం..



హుస్నాబాద్ పట్టణంలో చాలామంది అద్దెకు ఉంటున్నారు. దురదృష్టవశాత్తు ఆ కుటుంబంలో మరణం సంభవిస్తే.. సొంత ఇంటి యాజమాని మృతుల కుటుంబాలను బయటకు పంపిన సందర్భాలు పట్టణంలో చోటుచేసుకున్నాయి. వర్షాకాలంలో కుటుంబ పెద్దలు మరణిస్తే తలదాచుకోవడానికి, కర్మకాండలు నిర్వహించుకోవడానికి నీలువ నీడ లేదు. కర్మకాండ నిలయం నిర్మాణం కోసం నగర పంచాయతీ పాలకవర్గం నివేశన స్థలం కేటాయించింది. దాతల సహాయంతో త్వరలోనే కర్మకాండ నిలయం నిర్మాణ పనులు చేపట్టి పేదప్రజలకు కర్మకాండ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు అందుబాటులోకి తెస్తాం.
– చిట్టి గోపాల్‌రెడ్డి, భార్గవపురం సేవాసమితి అధ్యక్షుడు, హుస్నాబాద్

అభాగ్యులకు సేవలు అందిస్తున్నాం..



మా ట్రస్ట్ ద్వారా ఎంతోమంది పేదలకు సేవలు అందిస్తున్నాం. గరుడవాహనం, శవాన్ని భద్రపరిచే ఫ్రీజర్ సౌకర్యం అందుబాటులో ఉంచాం. నిర్వాహణ ఖర్చుల కోసం పేద, మధ్యతరగతి ప్రజల నుంచి అతి తక్కువ రుసుముతో గరుడ వాహనం, ఫ్రీజర్ సదుపాయాన్ని కల్పిస్తున్నాం. కడు నిరుపేదలకు గరుడవాహన సౌకర్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. దాతల సహకారంతో అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ.. మా ట్రస్ట్ సేవలను విస్తరిస్తున్నాం.
– దొడ్డి శ్రీనివాస్, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, హుస్నాబాద్


స్వాతంత్ర్య సమరయోధులను సత్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు


ఉత్తమ రైతులను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు

హత్నూర మండలం తుర్కలఖాన్‌పూర్‌లో గణవేశ్‌లో విద్యార్థులు


విద్యార్థికి షూస్ తొడిగిస్తున్న మంత్రి హరీశ్‌రావు (ఫైల్)


- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత
- ఇప్పటికే మధ్యాహ్న భోజనం సరఫరా
- ప్రస్తుతం 'షూ' పంపిణీలో నిమగ్నం
- గతేడాది ఆగస్టు 3న లాంఛనంగా ప్రారంభం
- 509 పాఠశాలల్లో 40 వేలకుపైగా విద్యార్థులకు అందజేత
- జిల్లాలోని 15 మండలాల్లో అమలు

అక్షయపాత్ర అమోఘం


సత్యగౌరీ చంద్రదాసు ప్రభు, అక్షయపాత్ర రాష్ట్ర చైర్మన్

హత్నూర(సంగారెడ్డి): కార్పొరేట్ విద్యాసంస్థలు యూనిఫాం, టై, బెల్టు, షూతో ఆకర్షనీయంగా ప్రచారాన్ని చేసుకుంటూ.. తమ సంస్థలను లాభాలబాట పట్టిస్తున్నాయి. ప్రభుత్వ రంగంలోని పాఠశాలలో కనీసం మౌలిక సదుపాయాలు లేకపోయినా.. నిరుపేదలు, దిగువ మధ్య తరగతి కుటుంబాలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపిస్తున్నాయి. సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ చిన్న చిన్న మౌలిక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తే ఆత్మన్యూన్నతా భావం నుంచి విద్యార్థులు బయటికి వచ్చి మెరుగైన ఫలితాలు సాధిస్తారని అనేక సందర్భాల్లోనూ రుజువైంది. పాఠశాలలో ఒకేరకమైన యూనిఫాం వల్ల తారతమ్యం లేకుండా చదువుపై దృష్టి కేంద్రీకరించడానికి దోహదం చేస్తుంది. చిన్నారులకు కనీసం పాదరక్షలు కూడా లేకుండా విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు చేయూతనందించడానికి 'హరే రామ హరే కృష్ణ అక్షయపాత్ర' స్వచ్ఛంద సంస్థ స్ఫూర్తినిస్తూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న జిల్లాలోని 15 మండలాల్లోని చిన్నారులకు షూస్ పంపిణీకి ఈ ఏడాది ఆగష్టు 3న మంత్రి హరీశ్‌రావు సంగారెడ్డిలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 509 పాఠశాలల పరిధిలో 65,295 మంది విద్యార్థులకు వివిధ యాజమాన్యాల కింద అభ్యసిస్తున్నారు. ఇప్పటివరకు 40,759 మంది విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. 9,10వ తరగతి విద్యార్థుల్లో కొంతమందికి షూస్‌లో సైజుల్లో తేడాలతో పంపిణీకి కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో ఇప్పటికే డ్రాపవుట్ సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోంది. క్రమం తప్పకుండా విద్యార్థులు పాఠశాలలకు రావడంవల్ల మెరుగైన ఫలితాలు సాధించడం వల్ల ప్రభుత్వ పాఠశాలలపట్ల తల్లిదండ్రుల ఆలోచనా దృక్పథంలోనూ మార్పులు వస్తున్నాయి. ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ప్రోత్సహించిన విధంగానే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మౌలిక సదుపాయాల్లో భాగంగా యూనిఫామ్స్‌ను అందిస్తున్నా.. షూస్ లేకపోవడంతో విద్యార్థులు కొంత ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. హరే రామ హరే కృష్ణ అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థ స్వయంగా ముందుకొచ్చి అమెరికాలోని ట్యాంగ్ అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో జిల్లాలోని విద్యార్థులకు షూస్ పంపిణీకి స్వీకారం చుట్టింది. దీంతో 80 శాతం పాఠశాలల్లోని విద్యార్థులందరికీ షూస్‌ను పంపిణీ చేయడంతో యూనిఫాం, షూస్‌తో పాఠశాలలకు వచ్చి ప్రార్థనలో పాల్గొనడంవల్ల కార్పొరేట్ విద్యాసంస్థలకు తీసిపోమన్న ఆత్మవిశ్వాసం బలపడుతోంది.

జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేసిన పాఠశాలల వివరాలు

మండలం	పాఠశాలల సంఖ్య
సంగారెడ్డి	23
కంది	28
కొండాపూర్	48
సదాశివపేట	26
మునిపల్లి	18
రాయికోడ్	42
పటాన్‌చెరు	44
అమీన్‌పూర్	20
రామచంద్రాపురం	32
జిన్నారం	41
గుమ్మడిదల	22
హత్నూర	63
పుల్‌కల్	50
అందోల్	44
వట్‌పల్లి	08

మొత్తం 509 పాఠశాలల పరిధిలో 40,759 మంది విద్యార్థులకు షూలను పంపిణీ చేశారు.

ఆత్మవిశ్వాసం పెరుగుతోంది..



చదువుకు పేదరికం అడ్డుకాకుండా ఉండాలన్నదే ఒక లక్ష్యం.. నిరుపేద విద్యార్థులు కనీసం పాదరక్షలు లేకుండా పాఠశాలకు రావడం గమనించాం. యూఎస్‌లోని స్వచ్ఛంద సంస్థతో అవగాహన కుదుర్చుకుని లక్ష మంది పాఠశాలల విద్యార్థులకు ఒకే రకమైన షూస్ పంపిణీ చేసి, వాళ్లలో ఆత్మస్థయిరాన్ని పెంపొందించి, న్యూన్నతా భావాన్ని తొలగించాలన్న లక్ష్యంతో 'హరే రామ హరే కృష్ణ అక్షయపాత్ర' పని చేస్తోంది.
– సత్యగౌరీ చంద్రదాసు ప్రభు, 'అక్షయపాత్ర' రాష్ట్ర చైర్మన్

సేవలు అభినందనీయం..



మధ్యాహ్నం భోజనంలో బలవర్ధకమైన ఆహారాన్ని అందజేస్తున్న 'అక్షయపాత్ర' స్వచ్ఛంద సంస్థ నిరుపేద విద్యార్థులకు షూస్ పంపిణీ చేయడం అభినందనీయం. మరికొన్ని సంస్థలు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఇలాంటి చేయూతను అందిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తాం. సుశిక్షితులైన ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే వీటిని బలోపేతం చేయవచ్చు.
– వెంకటేశ్వర్లు, ఎంఈఓ

సంతోషంగా ఉంది..



కనీసం చెప్పులు లేకుండా పాఠశాలలకు వెళ్తున్న మాలాంటి పేద విద్యార్థులకు అక్షయపాత్ర షూస్‌ను అందించడం సంతోషంగా ఉంది. క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి జీవితంలో స్థిరపడాలనే లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాం. స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహంతో చిన్న చిన్న అవసరాలను తీర్చడంవల్ల మాలో బేద భావం లేకుండా పోయింది.
– బాబా, పదో తరగతి విద్యార్థి, హత్నూర

రోజూ షూస్‌తో వస్తా..



మా స్నేహితులు కొంత మంది మంచి మంచి చెప్పులు.. షూస్‌తో పాఠశాలలకు వస్తే కనీసం నాకు చెప్పులు కూడా ఉండేవి కావు. అలాంటిది అక్షయపాత్ర వారు షూస్ పంపిణీ చేయడం వల్ల నా కోరిక తీరింది.
– మహేశ్, నాలుగో తరగతి విద్యార్థి, హత్నూర

ఎస్టీఓ ఆఫీసుకు తాళం

- 16 నెలలుగా అద్దె ఇవ్వలేదని ఆవేదన
- అద్దె పెంచాలని యజమాని డిమాండ్
- మరో ప్రైవేటు భవనానికి అద్దె ఎక్కువ.. తనకు తక్కువ ఇవ్వడం పట్ల నిరసన



ఎస్టీఓ ఆఫీసుకు తాళం వేస్తున్న భవన యజమాని ఎక్బాల్ అలీ జాఫర్



ఆఫీసుకు భవన యజమాని తాళం వేయడంతో ఆఫీసు కింది అంతస్తులోని భవనం గేటు వద్ద వేచి ఉన్న కార్యాలయ సిబ్బంది

నర్సాపూర్: నర్సాపూర్‌లోని ఎస్టీఓ కార్యాలయానికి భవన యజమాని ఎక్బాల్ అలీ జాఫర్ మంగళవారం ఉదయం తాళం వేశారు. అద్దె బకాయిలు ఇవ్వాలని, అద్దె పెంచాలన్న డిమాండ్‌తో ఆయన తాళం వేశారు. కాగా కార్యాలయ సిబ్బంది వచ్చేసరికి ఆఫీసుకు వారు వేసిన తాళంతోపాటు మరో తాళం ఉండడంతో ఆఫీసు సీనియర్ అసిస్టెంట్ కొండల్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ చంద్రయ్య, అటెండర్ బేగ్, డాటా ఎంట్రీ ఆపరేటర్ సమత సుమారు అరగంట సేపు ఆఫీసు బయటే వేచి ఉన్నారు. కాగా ఎస్టీఓ నర్సింహాచారి వచ్చి ఇంటి యజమానికి నచ్చజెప్పడంతో అతను తాళం తీయగా ఎస్టీఓతోపాటు సిబ్బంది కార్యాలయంలోకి వెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. నర్సాపూర్‌లోని ఎస్టీఓ కార్యాలయం తన ఇంట్లో కొనసాగుతుందని, 16 నెలలుగా అధికారులు అద్దె ఇవ్వలేదని, ఇంటి యజమాని ఎక్బాల్ అలీ జాఫర్ చెప్పారు. కార్యాలయం ఏర్పాటు సమయంలో చదరపు ఫీటుకు మూడు రూపాయల వంతున నెలకు మూడు వేల రూపాయల అద్దె ఇస్తామని చెప్పారని, 16 నెలలుగా అద్దె చెల్లించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాగా పట్టణంలో కొనసాగుతున్న మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల సైతం అద్దె భవనంలో కొనసాగుతుందని, మైనారిటీ శాఖ అధికారులు అద్దెను చదరపు ఫీటుకు ఆరు రూపాయలుగా చెల్లిస్తున్నారని ఆయన పేర్కొంటూ తనకు అద్దెను ఎందుకు తక్కువ చెల్లిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మైనారిటీ గురుకుల పాఠశాల, ఎస్టీఓ ఆఫీసులు రెండు ప్రభుత్వానివే అయినపుడు తనకు ఎందుకు అద్దె తక్కువ చెల్లిస్తారని ఆయన ప్రశ్నిస్తూ.. తనకు అద్దె పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా తనకు అద్దె ఇవ్వకపోతే నోటీసులు పంపినా సంబంధిత అధికారులు స్పందించలేదని, అద్దె చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. కాగా తాను ఆఫీసుకు తాళం వేయగా.. ఎస్టీఓ నర్సింహాచారి వచ్చి జనవరి నెలాఖరు వరకు అద్దె పూర్తిగా చెల్లించడంతో పాటు అద్దె పెంచేందుకు హైదరాబాద్‌లోని ట్రెజరీ డైరెక్టర్ వద్దకు తనను తీసుకుపోతానని హామీ ఇచ్చినందున తాళం తీసినట్లు ఎక్బాల్ అలీ జాఫర్ చెప్పారు. అద్దె పెంచాలని, 16 నెలల అద్దె చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎస్టీఓ వివరణ..

ఆఫీసు భవనం అద్దె 16 నెలలుగా ఇవ్వని మాట వాస్తవమేనని ఎస్టీఓ నర్సింహాచారి చెప్పారు. కాగా ఇటీవల మూడు నెలల అద్దె వచ్చిందని ఫ్రీజింగ్ ఉండడంతో చెక్కు క్లియర్ చేయలేకపోయామన్నారు. చెక్కు వచ్చిన విషయం యజమాని ఎక్బాల్ అలీ జాఫర్‌కు చెప్పానన్నారు. కాగా తాను అద్దెను నిర్ణయించలేనన్నారు. యజమాని అద్దె పెంచాలని డిమాండ్ చేస్తున్నందున తమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతానన్నారు.

స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తు చేయండి

మెదక్‌జోన్: బీసీ విద్యార్థులకు సంబంధించి 2017–2018 సంవత్సరానికి గాను 9,10వ తరగతుల విద్యార్థుల తరపున స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తులు చేయాలని బీసీ కార్పొరేషన్ జిల్లా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇందుకు సంబంధించి దరఖాస్తు ఫారాలను జనవరి 12వ తేదీలోగా అందించాలన్నారు. ముందుగా దరఖాస్తులు చేసిన వారికి మాత్రమే ముందుగా విడుదల అవుతాయని ఆయన చెప్పారు. ఇందుకు ఆధార్ కార్డు, రేషన్, కుల, ఆదాయ, విద్యార్థి బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలను జతచేసి తన కార్యాలయంలో అందించాలని కోరారు.

మధ్యాహ్న భోజన బియ్యం నేరుగా పాఠశాలలకే..

రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్

పాపన్నపేట(మెదక్): మధ్యాహ్న భోజన బియ్యం నేరుగా పాఠశాలలకే సరఫరా అవుతాయని మెదక్ జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పటి నుంచి రేషన్ బియ్యం నేరుగా పాఠశాలలకే తీసుకెళ్లాలనే ఆదేశాలు ఉన్నట్లు చెప్పారు. అయితే ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి వచ్చే మధ్యాహ్న భోజన బియ్యం స్కూల్ వేళల్లో పాఠశాలలకు రాకపోవడంతో, రేషన్ డీలర్ల వద్ద బియ్యం వేసి వెళ్తున్నారని చెప్పారు. పాఠశాల బియ్యం తక్కువ రావడం గాని, బియ్యం మార్పిడిలో గానీ రేషన్ డీలర్లకు సంబంధం లేదన్నారు.

ఉపాధ్యాయులు లేక పాఠశాలకు తాళం



తాళం వేసి ఉన్న పాఠశాల.. ఆరు బయటే నిలుచున్న విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చండూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని గుజిరి తండాలో ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు ఎవరూ లేకపోవడంతో ఆగ్రహించిన స్థానిక సర్పంచ్ భర్త విద్యార్థులను ఇంటికి పంపించి పాఠశాలకు తాళం వేశారు. సోమవారం జరిగిన ఈ ఘటనలో సర్పంచ్ భర్త రాజు మాట్లాడుతూ.. గుజిరి తండాలోని పాఠశాల కేవలం విద్యావలంటీర్‌తో మాత్రమే నడిచేదనీ, 32 విద్యార్థులకు ఒకే విద్యావలంటీర్ ఎలా సరిపోతుందన్నారు. ఆమె కూడా ప్రస్తుతం టీఆర్టీ కోచింగ్‌కు వెళ్లడంతో నెలరోజులుగా పాఠశాలకు ఏ ఉపాధ్యాయుడు వస్తున్నారో..? అర్థం కావడం లేదన్నారు. పాఠశాల విద్యార్థులు ప్రార్థన చేయడమే మానేశారని, ఉపాధ్యాయులు సరిగ్గా రాకపోవడంతో విద్యార్థులు క్రమక్రమంగా పాఠశాలకు రావడం మానేస్తున్నారని, ఉపాధ్యాయులు తమ హక్కుల కోసం పోరాడుతున్నారే తప్ప.. విద్యార్థుల పరిస్థితి గాలికి వదిలేయడం ఎంతవరకు సమంజసమని ఆయన అన్నారు.

‘జీఎంఆర్’ నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు

- రహదారికిరువైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలి
- 8వ తేదీలోగా జీఎంఆర్ సంస్థ స్పందించాలి
- లేకుంటే టీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు
- హెచ్చరించిన టీఆర్‌ఎస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ నాయకులు

తూప్రాన్: జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ రహదారి–44కి ఇరువైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని టీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బొంది రాఘవేంద్రగౌడ్ ఆరోపించారు. తూప్రాన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రహదారిపై నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇందుకు రహదారిని ఏర్పాటు చేసిన జీఎంఆర్ సంస్థ నిర్లక్ష్య వైఖరే ప్రధాన కారణమన్నారు. ఇదిలా ఉంటే తూప్రాన్ డివిజన్ పరిధిలోని నాగులపల్లి చౌరస్తా వద్ద రోడ్డు ప్రమాదాల బారినపడి అనేకమంది మృత్యువాత పడుతున్న నేపథ్యంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కేంద్రంతో చర్చించి రహదారిపై వంతెన నిర్మాణం కోసం రూ.33 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. కానీ జీఎంఆర్ సంస్థ నిధులు మంజూరు అయిన పనులు ప్రారంభించకపోవడంపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జీఎంఆర్ సంస్థ నిర్వాహకులు ఈ నెల 8వ తేదీలోగా స్పందించకుంటే టీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చారించారు. సమావేశంలో నాచారం దేవస్థానం డైరెక్టర్ మామిడి వెంకటేశ్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, దేవత రమేశ్‌గుప్తా, సతీష్‌చారి, బుడ్డ అంజి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు నర్సాపూర్ విద్యార్థి ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థితో పాఠశాల హెచ్‌ఎం, పీఈటీ

నర్సాపూర్: మండలంలోని బ్రాహ్మణపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి రగ్బి పోటీలకు ఎంపిక ఆయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తుగౌండ చెప్పారు. గత నెల 16, 17 తేదీల్లో జరిగిన ఎంపిక కోసం నిర్వహించిన పోటీల్లో అరుణ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ఆయన చెప్పారు. కాగా జనవరి నెలలో హైదరాబాద్‌లో జాతీయ స్థాయి పోటీలు జరుగనున్నాయని ఆయన చెప్పారు. కాగా జాతీయ పోటీలకు ఎంపికై యిన అరుణ్‌ను హెడ్మాష్టరు సత్తుగౌండ, పీఈటీ శేఖర్ అభినందించారు.

కాళ్లకల్ దత్తాత్రేయ ఆలయంలో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామంలో ఆనంద గిరి మహరాజ్ భక్త బృందం ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ డాక్టర్ యశ్వంత్‌రావు మాట్లాడుతూ.. ఆనందగిరి మహరాజ్ ఆశ్రమాన్ని సందర్శించి ఆయన నామస్మరణ చేస్తే సకల సమస్యలు దూరమవుతాయని, జీవితంలో ప్రశాంతత చేకూరుతుందన్నారు. ప్రతి పౌర్ణమి రోజున ఈ అన్నదాన కార్యక్రమాన్ని భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడు భిక్షపతి సహకారంతో కార్యాక్రమాన్ని ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమాన్ని యశ్వంత్‌రావు ప్రారంభించారు. అంతకుముందు పౌర్ణమి సందర్భంగా భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వీరబోయిన గోపాల్, పురం గిరిధర్, కనిగిరి కృష్ణ, శ్యాం, ప్రభాకర్‌గుప్తా, నాగేష్, సుదర్శన్, సాగర్ తదితరులు పాల్గొన్నారు..

వంజరి సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఉమ్మడి జిల్లా వంజరి సంఘం అధ్యక్షుడు వెంకటేశం



మాట్లాడుతున్న వెంకటేశం

రామాయంపేట(మెదక్): వంజరి సంఘం సభ్యులను ఎస్టీ జాబితాలో చేర్చడంతోపాటు సంఘం సంక్షేమం కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని వంజరి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశం కోరారు. ఆయన సంఘం జిల్లా ప్రతినిధి నవాత్ మల్లేశంతో కలిసి మంగళవారం రామాయంపేటలో విలేకరులతో మాట్లాడుతూ.. వంజరి సంఘం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని కోరారు. గతంలో ప్రభుత్వ ఆదరణ కరువై వంజరులు తీవ్ర ఇబ్బందులపాలయ్యారని ఆయన పేర్కొన్నారు. వంజరి సంఘం సభ్యుల సమస్యల విషయమై గతంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సానుకూలంగా స్పందించారని వెంకటేశం పేర్కొన్నారు. బుధవారం సంఘం క్యాలెండర్‌ను రామాయంపేటలో ఆవిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు సాంగని సుధాకర్, ప్రభాకర్, హరికిషన్ పాల్గొన్నారు.

తీరని వెతలు

- బాలారిష్టాలు దాటని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
- నిధులున్నా పూర్తికాని పనులు
- వసతిగృహం లేక విద్యార్థుల తిప్పలు
- కాలేజీకి వెళ్లేందుకు రోజూ 6 కి.మీలు నడవాల్సిందే


కాలేజీ నుంచి నడిచి వెళ్తున్న విద్యార్థులు


ల్యాబ్ టేబుళ్లు ఇలా వేశారు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌కు పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేస్తూ 2015–16లో భవనాల నిర్మాణానికి ఆర్‌ఐడీఎఫ్–11 నిధుల కింద రూ. 8కోట్ల నిధులు మంజూరు చేసింది. సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల మూడేళ్లుగా కళాశాల భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 2017–18 విద్యా సంవత్సరానికి స్థానిక ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అనుమతులు తీసుకువచ్చారు. ఇప్పుడు ఈఈఈ, సివిల్ బ్రాంచిలకు అనుమతులు రావడంతో కౌన్సెలింగ్ ద్వారా 120 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. 2017 జులై 18న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రి హరీష్‌రావు కళాశాలను ప్రారంభించారు..

విద్యార్థులకు తప్పని సమస్యలు..

పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులను సమస్యలు వెంటాడుతున్నాయి. భవన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం వల్ల విద్యా బోధనకు ఆటంకాలు ఎదురవుతున్నాయని లెక్చరర్లు అభిప్రాయపడుతున్నారు. పూర్తి స్థాయిలో భవనాన్ని అప్పగించకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ ఇబ్బందిగానే మారింది. కళాశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. కళాశాల ప్రహరీ నిర్మించేందుకు ప్రభుత్వం రూ.36లక్షలు మంజూరు చేసినా నేటి వరకు పనులు ప్రారంభించడం లేదు. ప్రహరీ లేక రాత్రి వేళల్లో అసాంఘీక శక్తులకు కళాశాల ఆవరణ అడ్డాగా మారుతోంది. మొదటి అంతస్తు గదుల పనులు పూర్తి కాకపోవడంతో ల్యాబ్‌లో వేయాల్సిన టేబుళ్లు కళాశాల ద్వారం వద్దనే పడేశారు.

వసతి గృహం లేక.. బస్సు సౌకర్యం కరువై..

కళాశాలకు వసతిగృహం లేకపోవడం వల్ల ఇతర జిల్లాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ వసతిగృహాల్లో ఉండాలంటే ఒకరికి నెలకు రూ. 3వేల చొప్పున ఏడాదికి రూ. 30వేల ఖర్చు అవుతోంది. కొంత మంది విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లలో ఉండలేక పెద్దపెల్లి, వరంగల్, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల నుంచి బస్సు ప్రయాణం చేస్తున్నారు. విద్యార్థులు నిత్యం 6 కి.మీల దూరం నడిస్తే తప్ప చదువుకోలేని పరిస్థితి ఉంది. చదువుల కోసం విద్యార్థులు నిత్యం పాదయాత్ర చేయలేక రోడ్డున పోయే వాహనదారులను లిఫ్ట్ అడిగి కాలేజీకి చేరుకుంటున్నారు. బాలికలు మాత్రం నిత్యం 6 కి.మీల దూరం కాళ్లకు పని చెబుతేనే కళాశాలకు చేరుకుంటారు. బస్సు సౌకర్యం కల్పిస్తామని మాట ఇచ్చిన నాయకులు ఇప్పటికీ కల్పించకపోవడంతో విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా మంత్రి స్పందించి కళాశాలకు బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

భవనం అప్పగిస్తే చర్యలు తీసుకుంటాం



కళాశాల ప్రారంభించి ఆరు నెలలు గడిచినా మాకు ఇప్పటి వరకు భవనం పనులు పూర్తి చేసి అప్పగించలేదు. మేం కళాశాలకు తాళం వేసుకొని వెళితే పనులు చేసేవారు వచ్చి దాన్ని తీస్తున్నారు. సీసీ కెమెరాలు అమర్చాల్సి ఉంది. భవనం పూర్తి స్థాయిలో పనులు చేసి మాకు అప్పగిస్తే భద్రత ఏర్పాట్లు, పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలు తీసుకోవచ్చు.

– కృష్ణ, ప్రిన్సిపాల్

దళితులపై దాడి చేసినవారిని అరెస్ట్ చేయాలి

కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నర్సింలు


మాట్లాడుతున్న గాలెంక నర్సింలు

గజ్వేల్‌రూరల్: దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాలెంక నర్సింలు డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులైన కొండపాక మాజీ ఉప సర్పంచ్ శ్రీను, వెలికట్ట గ్రామానికి చెందిన సంపత్‌లను డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి దూషించడమేగాకుండా తన అనుచరులతో దాడి చేయించడం విచారకరమన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ శివకుమార్, మండల అధ్యక్షుడు సత్తయ్య, కన్వీనర్ భరత్, నాయకులు యాదగిరి, పోచయ్య, దుర్గి రాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని శిక్షించాలి

చేర్యాల(సిద్దిపేట): కొండపాక మండల పరిధిలోని వెలికట్ట గ్రామంలో దళిత యువకులు సంపత్‌కుమార్, శ్రీనివాస్‌లపై దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని తెలంగాణ మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బుట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం చేర్యాలతో ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులుగా ఉన్నవారే దళితులపై దాడికి పాల్పడడం సరికాదన్నారు. దళితులపై దాడికి పాల్పడిన, కారణమైన ప్రజా ప్రతినిధులను వెంటనే పదవుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమలాపురం కిష్టయ్య, ఐలయ్య, కిషన్, కనకయ్య, శ్రీనివాస్, నర్సింహ్మ పాల్గొన్నారు.

నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లు సరికాదు

ఐఎంఏ సిద్దిపేట అసోసియేషన్


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న డాక్టర్ల బృందం

సిద్దిపేటటౌన్(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం జాతీయ మెడికల్ కమిషన్ బిల్లు ప్రవేశపెట్టడం సరికాదని సిద్దిపేట ఐఎంఏ అసోసియేషన్ సభ్యులు అన్నారు. మంగళవారం సిద్దిపేటలో నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లును వ్యతిరేకిస్తూ అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఐఎంఏను రద్దు చేయడం వల్ల వైద్యులే కాకుండా, ప్రజలు సైతం ఇబ్బందులు పడతారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రాంచందర్‌రావు, చంద్రారెడ్డి, స్వామి, రాంమోహన్, రవికాంత్, తిరుమల్‌రెడ్డి, ఫణిందర్‌రెడ్డి, గణేష్, సతీష్, గాయత్రి, రమాదేవి, భాస్కర్‌రావు, శివరామాచారి, వీవీరావు తదితరులు పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం

- మతిస్థిమితం లేని అనాథ మహిళను చేరదీసిన జెడ్పీటీసీ సభ్యురాలు
- కొత్త బట్టలు ఇచ్చి ప్రతీ రోజూ భోజనం


లచ్చక్కకు భోజనం అందిస్తున్న ఏల్పుల గౌతమి, మహేష్

దుబ్బాక టౌన్: తల్లిదండ్రులకు తిండి పెట్టని ఈ రోజుల్లో ఇంకా మానవత్వం బతికే ఉందని నిరూపించారు దుబ్బాక జెడ్పీటీసీ సభ్యురాలు ఏల్పుల గౌతమి. వివరాల్లోకి వెళ్తే.. కొన్నేళ్లుగా మతిస్థిమితంగా లేని తెలంగాణ లచ్చక్కగా అందరూ పిలిచే మహిళ దుబ్బాక పట్టణంలో ఉంటోంది. లచ్చక్క తెలంగాణ ఉద్యమంలో ఎక్కడ ఆందోళనలు జరిగినా ముందుండేది. పలుసార్లు పోలీసుల లాఠీచార్జిలో దెబ్బలు సైతం తిన్నది. నా అన్న వారు లేని లచ్చక్క రోడ్లపై తిరుగుతూ అడుక్కునేది. తిండి సరిగ్గా లేక అవస్థలు పడుతుండేది. ఈ క్రమంలో చలికి గజగజ వణుకుతూ లచ్చక్క పడుతున్న అవస్థలను చూసి దుబ్బాక జెడ్పీటీసీ సభ్యురాలు దంపతులు ఏల్పుల గౌతమి, మహేష్ చలించారు. వెంటనే లచ్చక్కకు స్వెట్టర్, చీరలు, కప్పుకోవడానికి దుప్పటి, ఇతర సామగ్రిని కొని అందించారు. అంతేగాకుండా ప్రతి నిత్యం లచ్చక్కకు కడుపునిండా భోజనం పెట్టాలని నిర్ణయించుకొని వెంటనే అమలు చేస్తున్నారు. నాలుగు రోజులుగా లచ్చక్కకు తమ ఇంట్లో తయారు జేసిన భోజనం తీసుకు వెళుతూ కడుపునిండా పెడుతున్నారు. లచ్చక్కను చేరదీసిన జెడ్పీటీసీ సభ్యురాలు దంపతులను పలువురు అభినందించారు. లచ్చక్క సైతం తిన్న రేవు తలవాలన్నట్టుగా కనిపించిన వారికల్లా బట్టలు చూపిస్తూ, రోజూ బువ్వ పెడుతుండు మహేషన్న.. చల్లగా ఉండాలంటూ దీవనలు అందిస్తోంది.

అయుత ధర్మదీక్ష పోస్టర్ ఆవిష్కరణ


మోడల్ స్కూల్ ఎదుట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

హుస్నాబాద్: సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న గజ్వేల్‌లో నిర్వహించే అయుత ధర్మదీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ, తహసీల్దార్, మండల పరిషత్, మోడల్ స్కూల్‌తోపాటు ఇతర కార్యాలయాల్లో పోస్టర్లను రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎస్‌ఈయూ రాష్ట్ర చీఫ్ కో ఆర్డినేటర్ లెక్కల వీరేశం మాట్లాడుతూ ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానం రద్దు కోసం రెండేళ్లుగా ఈ సంఘం ఉద్యమిస్తోందని అన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి పాత విధానాన్ని సాధించేందుకు అయుత ధర్మదీక్ష చేస్తున్నామని వీరేశం తెలిపారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని, దీన్ని సాధించుకునేందుకు ఉద్యోగులు గజ్వేల్‌కు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు బి. రాజు, వెల్పుల స్వామి, మహేష్, పున్నంచందర్, విష్ణు, నక్క శ్రీనివాస్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి

సమ్మె నోటీస్ ఇచ్చిన ఆశ వర్కర్లు


సమ్మె నోటీసు ఇస్తున్న ఆశ వర్కర్లు

దుబ్బాక: దేశవ్యాప్తంగా పని చేస్తున్న అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా, ఎన్‌హెచ్‌ఎం, సర్వ శిక్ష అభియాన్, ఐకేపీ, ఈజీఎస్ లాంటి ప్రభుత్వ స్కీంలలో పని చేసే వారందరినీ కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గొడ్డుబర్ల భాస్కర్ డిమాండ్ చేశారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్ పీహెచ్‌సీ పరిధిలో పని చేస్తున్న ఆశ వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం సీహెచ్‌ఓ మరియకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్లతో వెట్టి చాకిరీ చేయించుకోవడానికి అలవాటుపడ్డాయన్నారు. వెట్టి విముక్తి కోసం స్కీం వర్కర్లు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనాల చట్టం ప్రకారం ప్రతీ ఉద్యోగికి రూ. 18 వేల వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ స్కీం వర్కర్లు ఈ నెల 17న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు భారతి, లక్ష్మి, మంజుల, శారద, లత, శోభ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దళితుల విజయయాత్రపై దాడి పిరికిపంద చర్య

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

గజ్వేల్: మహారాష్ట్రలోని బీమ్‌కోరేగావ్‌లో దళితుల విజయయాత్రపై దాడి చేయడం పిరికిపంద చర్యగా డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి. శంకర్ అభివర్ణించారు. ఈ దాడిని ప్రజాస్వామికవాదులు ఖండించాలని కోరారు. ఈ సందర్భంగా మంగళవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళితులపై పథకం ప్రకారం దాడి చేసి ఒకరి మృతికి కారకులైన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన 20లక్షల దళిత బహుజనులు విజయయాత్రను నిర్వహించి మహర్ సైనిక అమరవీరులను స్మరించుకున్నారన్నారు. ఆనవాయితీగా జరిగే ఈ కార్యక్రమంపై దుండగులు దాడి చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, పాలక మండలి నియామకంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అణిచివేసే దిశగా కమిషన్ పనిచేయాలని కోరారు.



వెండితెర



ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి:
రుక్మిణి 70ఎం.ఎం(సంగారెడ్డి)
11.15, 2.15, 6.15, 9.15
టైగర్ జిందాహై
నటరాజ్ 70.ఎం.ఎం
11.00,2.00,6.00,9.00
హలో: సితార
ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి:
జ్యోతి 70ఎం.ఎం.
(సదాశివపేట) 11.15, 2.15, 6.15, 9.15

ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు



సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని శాస్త్రి రోడ్డులో నిత్యం వాహనదారులు, పాదచారులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రోజులుగా నిత్యం ద్విచక్ర వాహనాలను రోడ్లపై అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. తోపుడు బండ్ల వ్యాపారులు కూడ నడిరోడ్డుపై నిలపడంతో నిత్యం ట్రాపిక్ ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించాలి.

ప్రార్థన దినోత్సవం పోస్టర్ విడుదల



సంగారెడ్డి రూరల్ :సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 5న తెలంగాణ ప్రార్థన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు బిషప్ ఎంఎస్ పాల్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి శివారులోని రాక్‌చర్చిలో నియోజకవర్గ పాసర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాస్టర్లు పాలెం రాజు, కుమార్, అమృత్‌రాజ్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో సర్కార్ విఫలం

టీమాస్ ఫోరం జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు యాదగిరి

కొండాపూర్(సంగారెడ్డి):తెలంగాణ రాష్ట్రం ఏర్పడి మూడున్నరేళ్లు పూర్తి అయినా గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని టీ మాస్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు యాదగిరి అన్నారు.మంగళవారం టీ మాస్ ఫోరం ఆధ్వర్యంలో ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు అనంగతసాగర్ గ్రామంలో సర్వే నిర్వహించారు. యాదగిరి మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. ఒకవైపు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా సీఎం రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ మారుస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.టీఆర్ఎస్ ఎన్నికల్లో ప్రకటించిన దళితులకు మూడెకరాల భూమి, డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ కేజీ టూ పీజీ, ఉచిత నిర్బంధ విద్య, రైతులకు రుణమాఫీ, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఇంటికో ఉద్యోగం తదితర పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.గ్రామాల్లో పారిశుద్ధ్యం ఎక్కడి వేసిన గొంగడి అన్న చందంగా మారిందన్నారు. కార్యక్రమంలో టీ మాస్ మండల కన్వీనర్ రాంచెందర్, అధ్యక్షుడు అసిఫ్ అలీ, టీ మాస్ నాయకులు రాజయ్య, బాబురావు, ప్రవీణ్, వెంకయ్య, అమృతమ్మ, పాపమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న సభ్యులు

గుండె పోటుతో ఒకరి మృతి

కొండాపూర్(సంగారెడ్డి): గుండె పోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ బాలాస్వామి కథనం ప్రకారం మల్కాపూర్‌కి చెందిన కొల్లోజు లింగాచారి (43) ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో పనిచేస్తూ అదే కాలనీలో నివాసం ఉంటున్నారు. భార్య మంగాదేవి తన తల్లిదండ్రులను చూసేందుకు యూసుఫ్‌గూడకు వెళ్లింది. తన భార్యతో 31 రాత్రి ఫోన్‌లో మాట్లాడారు. ఒకటో తేదిన ఎన్నీసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో కంగారుపడి కాలనీ వాసులకు తెలిపింది. వారు కిటీకీలోంచి చూసే సరికి బెడ్ మీద లింగాచారి విగతజీవుడై ఉన్నట్లు తెలిపారు. నిద్రిస్తున్న సమయంలో గుండెపోటు రావటంతో లింగాచారి అక్కడికక్కడే మృతి చెంది ఉంటారని ఎస్ఐ వివరించారు. మృతుడి భార్య మంగాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలస్వామి తెలిపారు.

న్యూస్ బాక్స్

ఘనంగా పడిపూజ



కొండాపూర్ (సంగారెడ్డి): హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి మహా పడిపూజ గొల్లపల్లి గ్రామంలోని గీతా ఆలయంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం గురు స్వామి దండు మోహన్ పర్యవేక్షణలో గుండా శేఖర్ ఆధ్వర్యంలో స్వామి వారికి వివిధ పూజా ద్రవ్యాలు, ఫలా పుష్పలతో అభిషేకాలు నిర్వహించారు. శంకర్‌పల్లికి చెందిన శబరి భక్తబృందం ఆలపించిన భక్తిగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీనివాస్‌చారి, రాములుగౌడ్, రవికుమార్, కన్నె స్వాములు భరత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్‌గౌడ్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన మాలధారణ స్వాములు, సర్పంచ్ స్వరూప బాలాగౌడ్ ,ఎంపీటీసీ సభ్యుడు డేవిడ్, టీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



హత్నూర(సంగారెడ్డి): ప్రజలకు చేసిన సేవలు చిరకాలం ఉంటాయని పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఎంఎల్ఓ నజీర్‌బాబా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పోస్టుమెన్‌గా పని చేసిన నజీర్ పదవీ విరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంఎల్ఓ మాట్లాడుతూ నజీర్ సేవలు మరువలేమన్నారు. ప్రతి ఉద్యోగి చేసిన సేవలు మాత్రం ప్రజలు మర్చిపోరని ఆయన పేర్కొన్నారు. అనంతరం పోస్టాఫీస్ అదికారులు, సిబ్బంది నజీర్‌ను ఘనంగా సన్మానించారు. ఎస్ఓఎం వెంకట్‌రెడ్డి, పోస్టల్ సిబ్బంది లక్ష్మీనారాయణ, రాజేందర్, బసువప్ప, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలను కలసిన సర్పంచ్



హత్నూర(సంగారెడ్డి) :జిల్లా కలెక్టర్ మాణిక్క రాజ్ కణ్ణన్ ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు జిల్లా ఉన్నతాధికారులను సర్పంచ్ జయశ్రీ శివశంకర్‌రావు మంగళవారం కలిసి కొత్త సంవత్సరం సందర్భంగా మొక్కలను అందజేశారు. డీపీఓ వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్ వాసం వెంకటే శ్వర్లును కలసి మొక్కలను అందజేసినట్లు సర్పంచ్ జయశ్రీ శివశంకర్‌రావు తెలిపారు.

ఎస్ఐకి సన్మానం



హత్నూర(సంగారెడ్డి):నూతన సంవత్సరం సందర్భంగా ఎస్ఐ రాజేష్‌ను మంగళవారం మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఇబ్రహిం, కృష్ణ, శ్యామ్, ఫయాజ్ సంగారెడ్డి, రాజు , హరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా న్యూఇయర్ వేడుకలు



సదాశివపేట రూరల్(సంగారెడ్డి):మండల పరిధిలోని మద్దికుంట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పాటుగా న్యూ గవర్నమెంట్ ప్రాథమిక పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు

క్యాలెండర్ల ఆవిష్కరణ

కొండాపూర్(సంగారెడ్డి):మండల పరిధిలోని మల్కాపూర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎంపీపీ విఠల్ పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఇన్‌చార్జి ఎంఈఓ భీంసింగ్, ప్రధానోపాధ్యాయులు పెంటారెడ్డి, విజయ్‌కుమార్, పండరినాయక్, యాదగిరి, పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభు, సంగయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతకుమార్, దామోదర్, విజయ్‌కుమార్, భీమయ్య, దొండిరావు, ఆనంద్‌కుమార్, ఉమేష్, గణేష్, అరవింద్ పాల్గొన్నారు.తొగర్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ఎంఈఓ భీంసింగ్ టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఇంటర్వ్యూ

అంశం: చలికాలం.. వ్యాధులు



డాక్టర్ సంగమేశ్వర్
అర్బన్ పీహెచ్‌సీ

సంగారెడ్డి టౌన్ :

ప్రశ్న: పెరుగుతున్న చలికి ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలపగలరు?

జవాబు: పిల్లలు, 50 ఏళ్ల పైబడిన వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.ఎండ వచ్చే వరకు ఉండి బయటకు వెళ్లితే మంచిది.

ప్రశ్న: చలికాలంలో ఎలాంటి దుస్తులు ధరించాలి?

జవాబు:చలితీవ్రత పెరుగుతున్నందున ప్రజలు ఉన్ని దుస్తులు ధరించాలి. చలి నుండి కాపాడుకోవడం చాలా ముఖ్యం.

ప్రశ్న:చలికాలంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

జవాబు: ఎప్పటికప్పుడు వండిన వేడి ఆహారాన్ని తీసుకోవడం మంచింది. ఆహారం పట్ల అశ్రద్ధ మంచింది కాదు. ఒక రోజు ముందు వండిన ఆహారాన్ని తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. శుద్ధి చేసిన నీటిని మాత్రమే తాగాలి. అలాగే వడబోసిన నీరు తాగితే ఆరోగ్యానికి మంచిది.

ప్రశ్న: జలుబు, దగ్గు వస్తే ఎలాంటి వైద్యం తీసుకోవా లి?

జవాబు:వృద్ధులు, చిన్నారులకు దగ్గు, జలుబు వస్తే సొంతంగా వైద్యం చేసుకొని వ్యాధి తీవ్రమయ్యే వరకు ఉండొద్దు. డాక్టర్‌ను సంప్రదించి సరైన వైద్య సహాయం పొందాలి.

ప్రశ్న: నిల్వ ఉంచిన నీటిని సేవించవచ్చా?

జవాబు: ఎక్కువ కాలం పాటు నిల్వ ఉంచిన నీటిని సేవించరాదు. ఏ రోజు కారోజు స్వచ్ఛమెన నీటిని సేవించాలి. బాటిళ్లతో ఎక్కువ సమయం నీటిని నిల్వ ఉంచరాదు. ప్లాస్టిక్ బాటిళ్లను ఆరు నెలలకు పైగా వాడరాదు. నాణ్యత గల బాటిళ్లలోని నీటిని మాత్రమే సేవించాలి. ముఖ్యంగా విద్యార్థులు మంచినీరు తాగకుండా ఉండరాదు. పాఠశాల ఉపాధ్యాయులు సైతం విద్యార్థులు మంచినీళ్లు కావాలని కోరితే నీళ్లు సేవించేందుకు అనుమతి ఇవ్వాలి. వాటర్ బాటిళ్లల్లో ఫంగస్ లేకుండా శుభ్రం చేసి వాటిని ఉపయోగించాలి.

ఖండన బిందువు భూమి నుంచి ఎంత ఎత్తులో ఉంది?




యార్లగడ్డ వనరాజు
స్కూల్ అసిస్టెంట్,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సరూప త్రిభుజాలు

సమస్యలు-సమాధానాలు

1. 4 మీటర్లు, 6 మీటర్ల ఎత్తున్న రెండు స్తంభాలు 25 మీటర్ల దూరంలో నిటారుగా ఉన్నాయి. మొదటి స్తంభం కొనను రెండో స్తంభం పాదంతో, రెండో స్తంభం కొనను మొదటి స్తంభం పాదంతో కలిపే రేఖల ఖండన బిందువు భూమి నుంచి ఎంత ఎత్తులో ఉంది?



జ. రెండు స్తంభాల ఎత్తులు AB = 4 మీ, CD = 6 మీ. అనుకోండి. భూమి నుంచి ఖండన బిందువు ఎత్తు PQ= z మీ. అనుకుంటే

ΔPQB, ΔCDBల్లో $\angle B = \angle B$ (ఉమ్మడి కోణం)

$\angle BQP = \angle BDC = 90^\circ$

కో.కో. నియమం ప్రకారం

ΔPQB ~ ΔCDB అవుతుంది.

అప్పుడు

$\frac{BQ}{BD} = \frac{PQ}{CD} = \frac{z}{6}$ —— (1) ఇదేవిధంగా

ΔPQD~ΔABD

అని చూపొచ్చు. అప్పుడు

$\frac{QD}{BD} = \frac{PQ}{AB} = \frac{z}{4}$ —— (2)


1, 2 లను కలిపితే $\frac{BQ}{BD} + \frac{QD}{BD} = \frac{z}{6} + \frac{z}{4}$

$\Rightarrow \frac{BQ+QD}{BD} = z\left(\frac{1}{6}+\frac{1}{4}\right)$

$\Rightarrow \frac{BD}{BD} = z\left(\frac{2+3}{12}\right) \Rightarrow 1 = z\left(\frac{5}{12}\right)$

$\Rightarrow z = \frac{12}{5} \times 1 = 2.4$ మీ.


■ **గమనిక:** ఈ సమస్యను పోలి ఉన్న సమస్య.. AB, CD, PQలు BDకి గీసిన లంబాలు AB=x, CD= y, PQ=z అయితే $\frac{1}{x}+\frac{1}{y}=\frac{1}{z}$ అని చూపండి అనే సమస్యతో పోలి ఉంటుంది.




2. ΔABCలో DE||BC, $\frac{AD}{DB} = \frac{3}{4}$, AC=15 సెం.మీ., అయితే AE విలువ ఎంత?

3. ΔABCలో DE||BC, AD= 4x–3, AE=8x–7, BD= 3x–1, CE= 5x–3 అయితే x విలువ కనుగొనండి.

4. కింది పటంలో AB||CD||EF, AB = 7.5 సెం.మీ. DC = y సెం.మీ., EF = 4.5 సెం.మీ., BC = x సెం.మీ. అయితే x, y విలువలు కనుగొనండి.



5. కింది పటంలో A, B, Cలు వరుసగా OP, OQ, ORలపై బిందువులు. AB||PQ, AC||PR అయితే BC||QR అని చూపండి.



పైథాగరస్ సిద్ధాంతం (బౌధాయన సిద్ధాంతం)


'లంబకోణ త్రిభుజంలో కర్ణం మీద వర్గం మిగిలిన రెండు భుజాల వర్గాల మొత్తానికి సమానం.'

విపర్యయంగా 'ఒక త్రిభుజంలో ఒక భుజం మీది వర్గం మిగిలిన రెండు భుజాల వర్గాల మొత్తానికి సమానమైతే అది లంబకోణ త్రిభుజం.'

లంబకోణ త్రిభుజం ΔABCలో

∠B =90⁰ అయితే..


$(AC)^2 = (AB)^2+(BC)^2$



మాదిరి ప్రశ్నలు

1. 5 మీటర్లు, 12 మీటర్ల ఎత్తున్న రెండు స్తంభాలు నిటారుగా ఒక చదునైన నేలపై ఉన్నాయి. భూమిపై ఆ రెండు స్తంభాల అడుగు భాగాల మధ్య దూరం 12 మీటర్లు అయితే ఆ రెండు స్తంభాల పై భాగాల మధ్య దూరం ఎంత?

జ.



AB, CD రెండు స్తంభాలు అనుకుంటే..

దత్తాంశం ప్రకారం AB = 5 మీ., CD = 12 మీ.

నేలపై స్తంభాల మధ్య దూరం CD = 24 మీ.

పైభాగంలో రెండు స్తంభాల మధ్య దూరం AC = x మీ. అనుకుంటే..

పటం నుంచి AE = 24 మీ.,

CE = CD–DE =12 – 5 = 7 మీ.


లంబకోణ త్రిభుజం ΔAECలో పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం

$x^2 = 24^2 + 7^2 \Rightarrow x^2 = 24^2 + 7^2$

$\Rightarrow x^2 = 625 \Rightarrow x = 25$

∴ పైభాగంలో రెండు స్తంభాల మధ్య దూరం = 25 మీ.

2. లంబకోణ త్రిభుజం ABCలో లంబకోణ శీర్షం C వద్ద ఉంది. P, Qలు వరుసగా AC, BCలపై ఉన్నాయనుకోండి. అయితే AQ²+BP²= AB²+PQ² అని చూపండి.





జ. లంబకోణ త్రిభుజాలు ΔACQ, ΔPCB ల నుంచి

$(AQ)^2=(AC)^2 + (QC)^2$,

$(BP)^2 = (BC)^2 + (CP)^2$


$\Rightarrow (AQ)^2 + (BP)^2 = [(AC)^2+(QC)^2] + [(BC)^2+ (CP)^2] =$

$[(AC)^2+(BC)^2] + [(QC)^2+(CP)^2]$

$= AB^2 + PQ^2$

(∵ లంబకోణ త్రిభుజం ABC, PQC ల నుంచి $AB^2= AC^2+BC^2$, $PQ^2= PC^2+ QC^2$)

3.



పై రాంబస్‌లోని రెండు కర్ణాలు వరుసగా 24 సెం.మీ., 10 సెం.మీ. అయితే దాని భుజం పొడవు కనుక్కోండి.

జ. రాంబస్‌లో కర్ణాల వర్గాల మొత్తం.. భుజాల వర్గాల మొత్తానికి సమానం. అంటే..

$(AC)^2+(BD)^2 =$

$(AB)^2+(BC)^2+ (CD)^2 +(DA)^2$

రాంబస్‌లో AB= BC= CD=DA కాబట్టి

$(AC)^2+(BD)^2=$

$(AB)^2+(AB)^2+(AB)^2+(AB)^2 = 4AB^2$

$\Rightarrow (24)^2+(10)^2= 4(AB)^2$


$\Rightarrow 576+100 = 4(AB)^2$

$\Rightarrow 676 = 4(AB)^2 \Rightarrow 169 = (AB)^2$

∴ AB = 13 సెం.మీ.

4. 5 సెం.మీ., 12 సెం.మీ., 13 సెం.మీ. భుజాల పొడవులుగా ఉన్న త్రిభుజం ABCలో 13 సెం.మీ. పొడవు ఉన్న భుజానికి దాని ఎదుటి శీర్షం నుంచి గీచిన లంబం పొడవు కనుక్కోండి.

జ. 5, 12, 13 సెం.మీ. భుజాల పొడవులుగా గల త్రిభుజం లంబకోణ త్రిభుజం అవుతుంది. (∵$13^2 = 5^2 +12^2$)



AB =13 సెం.మీ., BC = 5 సెం.మీ., AC=12 సెం.మీ. అయినట్లు ABC ఒక లంబకోణ త్రిభుజం అనుకోండి.

13 సెం.మీ. పొడవున్న భుజానికి



గీసిన లంబం CD = p సెం.మీ. అనుకోండి.

ΔABC వైశాల్యం$=\frac{1}{2}$ భూమి × ఎత్తు

$=\frac{1}{2}\times BC\times AC = \frac{1}{2}\times 5\times 12 = 30cm^2$

ΔABC వైశాల్యం$=\frac{1}{2}$ భూమి×ఎత్తు

$=\frac{1}{2}\times AB\times CD = \frac{1}{2}\times 13\times p$


$\Rightarrow \frac{1}{2}\times 13\times p = 30 \quad \Rightarrow p = \frac{60}{13}$

= 4.6 సెం.మీ. (సుమారుగా)

5. కింది పటం నుంచి


i) pc= ab,

ii) $\frac{1}{p^2} = \frac{1}{a^2} + \frac{1}{b^2}$ అని చూపండి.



6. ఒక సమబాహు త్రిభుజంలో భుజాల వర్గాల మొత్తానికి 3 రెట్లు, ఆ త్రిభుజం మధ్య గతాల వర్గాల మొత్తానికి 4 రెట్లకు సమానమని చూపండి.

7. లంబకోణ త్రిభుజం ΔABCలో $\angle B = 90^\circ$ AD, CEలు మధ్యగత రేఖలు AC= 5 సెం.మీ., $AD = \frac{3\sqrt{5}}{2}$ అయితే CE విలువ కనుక్కోండి.



8. (a–1) సెం.మీ. 2√a సెం.మీ. (a+1) సెం.మీ. భుజాలుగా ఉన్న త్రిభుజం లంబకోణ త్రిభుజం అవుతుందా?

9. 5 మీ, 12 మీ, 13 మీ. భుజాలుగా గల త్రిభుజం లంబకోణ త్రిభుజం అవుతుందా? కారణాలు చెప్పండి.

Affixation is the process of adding..



R. Srinivasa Rao
Senior Faculty, Hyderabad



టీఎస్‌పీఎస్సీ
టీఆర్‌టీ
ఎస్‌జీటీ/ఎస్ఏ - ఇంగ్లిష్
ప్రత్యేకం

AFFIXATION

An affix is used to alter the meaning or form of a word. It can be either a Prefix or a Suffix.


Definition: Affixation is the process of adding a morpheme - or affix - to a word to create either a different form of that word or a new word with a different meaning.

The two primary kinds of 'Affixation' are prefixation, the addition of a prefix, and suffixation, the addition of a suffix, while clusters of affixes can be used to form complex words.

Prefixes: A prefix is a letter or group of letters attached to the beginning of a word that partly indicates its meaning.

Prefix	*Meaning*	*Examples*
A	Not	Amoral, Apolitical, Atypical
Anti	Against, Opposite of	Antiseptic, Anti-American, Antinuclear, Anti climax, Antiaircraft, Antibody
Bi	Two	Bicycle, Bisect, Bilingual
Co	With, Together	Copilot, Co-worker, Coexist, Co-author
De	Down, Off	Devalue, Deactivate, Degrade, Delink
Dis	Opposite of	Ddisappear, Disagreeable, Disbar, Disagree, Dislike, Disobey
En	Put into, Cover with	Enclose, Entangle, Enslave, Encase
Ex	Former	Ex-president, Ex-serviceman
Hyper	Over, More, Beyond	Hyperactive, Hypersensitive, Hypercritical
Il, Im, In, Ir	Not, Without	Illegal, Illogical, Immoral, Immeasurable, Inconsiderate, Incurable, Irresponsible
Omni	All, Every	Omnivorous, Omniscient, Omnipotent, Omnipresent
Post	After	Postmortem, Posterior, Postscript
Tri	Three	Tricycle, Triangle, Triathlon
Over	Too much, Across	Over-confident, Over-populated
Un	Opposite	Unhappy, Unfair, Untrue
Vice	Next in rank	Vice-president, Vice-principal, Vice-chancellor, Vice-admiral

Note: The difference between prefixes and suffixes is that while prefixes do not change word class (noun to verb or adjective to noun) etc. suffixes mostly change the word class.



Previous and Model Questions

1. Identify the correct suffix for the words given below: ***(AP TET - 2015)***

Word	*Suffix*
(a) Doubt	(i) ness
(b) High	(ii) ful
	(iii) ment

1) (a)-(ii), (b)-(iii)
2) (a)-(iii), (b)-(ii)
3) (a)-(ii), (b)-(i)
4) (a)-(iii), (b)-(iii)

A: (3) Doubtful, Highness.

EXERCISE - I

1. Identify the correct suffixes for the words given below:

Word	*Suffix*
(a) Remark	(i) ise
(b) Discover	(ii) let
(c) Book	(iii) ify
(d) Popular	(iv) able
(e) Pure	(v) y

1) (a) - (ii), (b) - (iii), (c) - (iv), (d) - (i), (e) - (v)
2) (a) - (iv), (b) - (i), (c) - (ii), (d) - (iii), (e) - (v)
3) (a) - (iv), (b) - (v), (c) - (ii), (d) - (i), (e) - (iii)
4) (a) - (iv), (b) - (i), (c) - (v), (d) - (iii), (e) - (ii)

A: (3)

EXERCISE - II

1. Identify the correct suffixes for the words given below.

Word	*Suffix*
(a) Virtue	(i) ize
(b) Love	(ii) ive
(c) Terror	(iii) able
(d) Abuse	(iv) ful
(e) Thank	(v) ous

1) (a) - (v), (b) - (iii), (c) - (iv), (d) - (i), (e) - (ii)
2) (a) - (v), (b) - (iii), (c) - (i), (d) - (ii), (e) - (iv)
3) (a) - (iii), (b) - (iv), (c) - (i), (d) - (ii), (e) - (v)
4) (a) - (iii), (b) - (v), (c) - (i), (d) - (iv), (e) - (ii)

A: (2)

Suffixes: A suffix is a letter or group of letters added at the end of a word to make a new word.

1. The following adjectives get converted into nouns by adding certain suffixes which change the word class of the basic word.

Adjective	*Suffix*	*Noun*
Free	-dom	Freedom
Wise	-dom	Wisdom
Important	-ance	Importance
Permanent	-ence	Permanence
False	-hood	Falsehood
Active, Civil, Human, Real	-ity	Activity, Civility, Humanity, Reality
Dark, Happy, Mad	-ness	Darkness, Happiness, Madness
Hard	-ship	Hardship
Long, Strong	-th	Length, Strength

2. Here are some examples of a verb getting converted into a noun.

Verb	*Suffix*	*- Noun*
Leak	-age	Leakage
Shrink	-age	Shrinkage
Waste	-age	Wastage
Arrive, Refuse	-al	Arrival, Refusal
Accept, Appear	-ance	Acceptance, Appearance
Assist, Inhabit	-ant	Assistant, Inhabitant
Build, Meet, Teach	-ing	Building, Meeting, Teaching

3. Here are a few examples of a noun forming a new word which is also a noun.

Noun	*Suffix*	*Noun*
King	-dom	Kingdom
History	-ian	Historian
Hero	-ism	Heroism
Drama, Motor	-ist	Dramatist, Motorist

4.

Adjective	*Suffix*	*Verb*
Cheap, Deep, Sharp	-en	Cheapen, Deepen, Sharpen
Just, Pure	-ify	Justify, Purify

5.

Noun	*Suffix*	*Verb*
Length	-en	Lengthen
Strength	-en	Strengthen
Class	-ify	Classify
Apology	-ise	Apologise

6.

Noun	*Suffix*	*Adjective*
Comfort	-able	Comfortable
Culture	-al	Cultural
Element	-ary	Elementary
Point	-end	Pointed
Gold	-en	Golden
Beauty	-ful	Beautiful
Help	-ful	Helpful
Sense	-ible	Sensible

7.

Verb	*Suffix*	*Adjective*
Read	-able	Readable
Resist	-ant	Resistant
Digest	-ible	Digestible
Prohibit	-ive	Prohibitive


8.

Adjective	*Suffix*	*Adverb*
Happy	-ly	Happily
Foolish	-ly	Foolishly
Melodious	-ly	Melodiously
Great	-ly	Greatly
Artistic	-ly	Artistically

అంకెలు కలపండి రంగులు వేయండి



పక్కన కింద ఇచ్చిన బొమ్మల పేర్ల మొదటి అక్షరాలను వాటి పైన ఉన్న ఖాళీ గళ్లలో రాయండి. పక్కనే ఉన్న కొంగ పేరు ఇంగ్లీషులో వస్తుంది. కనుక్కోండి. →




కనుక్కోండి

గుర్తించండి


కింద మధ్యలో ఉన్న రంగుల బొమ్మ అసలైన నీడ ఏదో గుర్తించండి. ↓





పైన ఉన్న A కింద ఉన్న Z దగ్గరకు వెళ్లాలి. దారి చూపండి.


కింద ఇచ్చిన గుడ్డులోనుంచి వస్తున్న బాతు బొమ్మను పక్కన ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి.



జవాబులు: కనుక్కోండి: Flamingo గుర్తించండి: F

నాన్నా చెప్పవా

సౌర మండలానికి అవతల అన్నీ పెద్ద గ్రహాలే ఉంటాయా?




మన సౌరమండలంలో సూర్యుని చుట్టూ నిర్దిష్ట కక్ష్యలలో పరిభ్రమిస్తూ 8గ్రహాలు, 166కు పైగా ఉపగ్రహాలు, కొన్ని మరుగుజ్జు గ్రహాలు, కొన్ని వేల కోట్ల సంఖ్యలో ఆస్టరాయిడ్లు, తోక చుక్కలు, ఉల్కలు వంటి ఖగోళ నిర్మాణాలు, ఇంకా అపారమైన నక్షత్ర ధూళి ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. మన సౌరమండలానికి వెలుపల కూడా ఇతర నక్షత్రాల వద్ద ఇలాంటి ఖగోళ నిర్మాణాలు ఉండి ఉండవచ్చునని అంచనా వేసిన శాస్త్రజ్ఞులు, ఆ దిశగా, అంటే అలాంటి వాటి ఉనికిని కనుగొనే దిశగా తమ ప్రయత్నాలను ఏనాడో మొదలుపెట్టారు.

1995లో తొలిసారిగా సౌరమండలానికి వెలుపల వేరే నక్షత్రం చుట్టూ తిరిగే ఒక గ్రహాన్ని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. దీనికి '51 Pegasi B' అని పేరు పెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా వేరే నక్షత్రాల చుట్టూ పరిభ్రమించే అలాంటి 200కు పైగా గ్రహాలను శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. అయితే ఇటీవల కనుగొన్న ఒక గ్రహాన్ని తప్పించి మిగతా వాటినన్నింటినీ పరోక్ష పద్ధతిలోనే కనుగొనడం జరిగింది. ఒక నక్షత్రం చుట్టూ పరిభ్రమించే ఒక గ్రహం దాని పరిభ్రమణంలో భాగంగా అప్పుడప్పుడూ ఆ నక్షత్రానికి అడ్డుగా వచ్చి, దాని కాంతిని కొంచెం మందగింప జేస్తుంది. సరిగ్గా దీనిని, ఇలాంటి మరి కొన్ని కారణాలను ఆధారంగా చేసుకునే శాస్త్రజ్ఞులు ఇతర నక్షత్రాలకు సంబంధించిన గ్రహాలను కనుగొంటున్నారు.

ఇప్పటి వరకు శాస్త్రజ్ఞులు కనుగొన్న ఇతర నక్షత్రాల గ్రహాలన్నీ మన గురుగ్రహం, లేదా అంతకన్నా ఎంతో పెద్దగా ఉండడం విశేషం. ఇటీవల శాస్త్రజ్ఞులు ప్రత్యక్ష పద్ధతిలో (ఫొటోల ద్వారా) కనుగొన్న ఓ గ్రహం మన గురుగ్రహం అంత పెద్దగా ఉండటమే గాక, దీనికి 8 రెట్లు ఎక్కువ ద్రవ్యరాశితో వుంది.

ఏ నక్షత్రానికి చెందిన గ్రహాలైనా, మన సౌరమండలానికి చాలా దూరంగా (కొన్ని వేల కోట్ల మైళ్ళు) ఉండే కారణంగా కేవలం భారీ సైజులోను,, అధిక ద్రవ్యరాశితోను వుండే గ్రహాలు మాత్రమే మన కంటపడుతున్నాయని, మన సాంకేతిక విజ్ఞానం మరింత అభివృద్ధి చెందినప్పుడు సుదూర ప్రాంతాలలో ఉండే చిన్న చిన్న గ్రహాలను కూడా కనిపెట్టడానికి వీలవుతుందని శాస్త్రజ్ఞులు అంటున్నారు.

కింద ఉన్న రెండు బొమ్మల మధ్య 10 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.





మోతీమాత జాతరకు పోటెత్తిన గిరిజనం


మోతీమాత ఆలయం క్యూలో వేచి ఉన్న భక్తులు


జాతరకు ఎడ్ల బండిలో కుటుంబంతో తరలి వచ్చిన గిరిజనులు

- రాష్ట్రంతోపాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి తరలివచ్చిన భక్తులు
- దర్శించుకున్న ఎమ్మెల్యే గీతారెడ్డి, ఎమ్మెల్సీలు ఫరీదుద్దీన్, రాములు నాయక్

జహీరాబాద్: మినీ మేడారంగా పేరు గాంచిన మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలోని మోతీ మాత ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం జాతర ఉత్సవాల్లో పాల్గొనేందుకు గిరిజనులు రాష్ట్రంలోని నలు మూలల నుంచే కాకుండా పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల నుంచి సైతం భారీగా తరలి వచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 23వ జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తమ ఆరాధ్య దైవమైన మోతీ మాతను గిరిజనులు భక్తి శ్రద్ధలతో తరలి వచ్చి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మేకలు, కోళ్లను నైవేద్యంగా సమర్పించుకున్నారు. అనంతరం క్యూలో నిల్చుని మాతను దర్శించుకున్నారు. జాతర ఉత్సవాలకు ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాలన్నీ జన సందడిగా మారాయి. భక్తులు ఆలయ పరిసరాల్లోని పొలాల్లో వంటలు చేసుకున్నారు. ఇంటిల్లిపాదితో తరలి వచ్చి ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు తమ తమ బంధువులను సైతం జాతరకు ఆహ్వానించి భోజనాలను ఏర్పాటు చేశారు. జహీరాబాద్ ప్రాంతంలోని తండాల నుంచి కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి సైతం గిరిజనులు లారీలు, ఆటోలు, ట్రాక్టర్లలో తరలి వచ్చారు. రోగులకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచారు. ప్రత్యేక వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగలక్ష్మి సందర్శించారు. భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలకు ఆలయానికి అర కిలోమీటర్ దూరంలో నిలిపి వేశారు. ఆలయం వరకు బైపాస్ రోడ్డును ఏర్పాటు చేసి ఆయా తండాలకు వెళ్లే రోడ్డు వాహనాలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు.

దర్శించుకున్న ప్రముఖులు

జాతర ఉత్సవాలకు పలువురు ప్రముఖులు తరలి వచ్చి మోతీ మాతను దర్శించుకున్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యే జె.గీతారెడ్డి, కర్ణాటకలోని చించోళి ఎమ్మెల్యే ఉమేష్‌జాదవ్, ఎమ్మెల్సీలు ఎం.డి.ఫరీదుద్దీన్, రాములు నాయక్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డి.లక్ష్మారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ పి.రామకృష్ణారెడ్డి, ఎంపీపీ చిరంజీవి ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు కిషన్‌రావు పవార్, టీఆర్‌ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కె.మాణిక్‌రావు, ఆర్డీఓ అబ్దుల్ హమీద్, తహసీల్దార్ రాధాబాయి, ఎంపీడీఓ రాములు, డీఎస్పీ నల్లమల రవి, సీఐ నాగరాజ్, గిరిజన గురువు గోవింద్‌నాయక్‌లు జాతర ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోతీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఉత్సవాల్లో పాల్గొన్న ఫరీదుద్దీన్, జైపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు


జాతరలో భక్తుల సందడి

పుష్ప సోయగం




సంగారెడ్డి పట్టణంలోని కాలనీల్లో కనిపించిన రంగు రంగుల పుష్పాలు







సంగారెడ్డిలోని పలు కాలనీల్లో ఇంటి ముందు, పెరట్లో వివిధ వర్ణాల పూల చెట్లను పెంచుతున్నారు. కొంత మంది అలంకరణ కోసం పెంచితే మరి కొందరు హాబీ కోసం పెంచుతున్నారు. సంగారెడ్డి శివారు కాలనీల్లో కనిపించిన పుష్పాలను 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



‘పంచాయతీ’లకు మోక్షమెన్నడో?



ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి వెనుక భాగంలో పునాది గోడ బీటలు వారింది. దీంతో భవనానికి ప్రమాదం పొంచి ఉంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9948499244

న్యూస్ బాక్స్

మంత్రిని కలిసిన గౌని శివకుమార్



మంత్రి హరీశ్‌తో శివకుమార్ తదితరులు

జహీరాబాద్ టౌన్: మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గౌని శివకుమార్ తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా శివకుమార్ మంత్రి నివాసగృహంలో పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి శివకుమార్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ బీబీపాటిల్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ గౌని శివకుమార్ చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్. కిరణ్, టీఆర్ఎస్ నాయకులు షేక్ ఫరీద్, ఓంకార్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

జహీరాబాద్ టౌన్: ప్రజా సమస్యలపై టీమాస్ ఫోరం ఆధ్వర్యంలో పోరాటాలను చేస్తామని జిల్లా నాయకుడు మార్కుబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ పేర్కొన్నారు. పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వీధిలో పలు రకాల సమస్యలు నెలకొన్నాయన్నారు. టీమాస్ ఫోరం ఆధ్వర్యంలో ప్రతీ వార్డులో పర్యటించి సమస్యలను తెలుసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ, కేవీపీఎస్, ఎరుకల, బేడ బుడగ జంగం తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మామిడ్గి పాఠశాలలో గణిత ప్రదర్శన

న్యాల్‌కల్(జహీరాబాద్):మండల పరిధిలోని మామిడ్గి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులు గణిత ప్రదర్శన నిర్వహించారు. గణితం (లెక్కలు) ఎంతో కష్టమని భావించే విద్యార్థులకు వీటిని సులువుగా ఎలా నేర్చుకోవచ్చనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం బ్రహ్మయ్యతో పాటు ఉపాధ్యాయులు వెంకటేశం, విజయకుమారి, సుధారాణి తదితరులు విద్యార్థుల చేత సులువు విధానంలో లెక్కలు చేయించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి చార్టులను తయారు చేసి కూడికలు, తీసివేత, గుణకారం, భాగహారం ఎలా చేయాలని విషయాలను తరగతి గదిలో ప్రదర్శించారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో...



తుమ్మన్‌పల్లిలో ప్రారంభానికి నోచుకోని పంచాయతీ భవనం



కక్కర్‌వాడలో పంచాయతీ భవనానికి కేటాయించిన స్థలం

- పక్కా భవనాలు పూర్తయినా ప్రారంభం కాని వైనం
- చెట్ల కింద, ఆరుబయటే సమావేశాలు
- పట్టించుకోని అధికారులు
- ప్రజలకు తప్పని ఇక్కట్లు

దేశానికి పట్టు కొమ్మల్లాంటి గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పంచాయతీల భవనాల నిర్మాణానికి లక్షలాది రూపాయలు మంజూరు చేసింది. అందులో కొన్నింటి భవన నిర్మాణ పనులూ పూర్తయ్యాయి. మరికొన్నింటి పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. అయితే అధికారుల నిర్లక్ష్యమో, పాలకుల అలసత్వమో తెలియదు కాని పూర్తయిన పంచాయతీ భవనాలు ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థకు చేరుతున్నాయి. ఝరాసంగం మండలంలోని కొన్ని గ్రామాల్లో పంచాయతీలు లేక అరుగులపై, చెట్ల కింద గ్రామ సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, గ్రామస్థాయి అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే..

ఝరాసంగం రూరల్(జహీరాబాద్): మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో 17 గ్రామాల్లో పంచాయతీ భవనాలు ఉన్నాయి. మండలంలోని 11 గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణానికి మొత్తం రూ.1.43 కోట్లు మంజూరయ్యాయి. ఐదున్నర సంవత్సరాల క్రితం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నుంచి ఈ నిధులు మంజూరయ్యాయి. ఒక్కో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.13 లక్షల చొప్పున విడుదలయ్యాయి. మేదపల్లి, ఝరాసంగం, బొరేగావ్, బీడకన్న, గుంతమర్పల్లి, దేవరంపల్లి, తుమ్మన్‌పల్లి, బోపన్‌పల్లి, సిద్దాపూర్, పోట్‌పల్లి, జీర్లపల్లి, చీలేపల్లి, ఏడాకులపల్లి గ్రామాల్లో పంచాయతీ భవనాలు నిర్మించారు. వీటిలో తుమ్మన్‌పల్లి, పోట్‌పల్లి, సిద్దాపూర్, బీడకన్న గ్రామాల్లో ప్రారంభోత్సవానికి పాత భవనాల్లో సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. పూర్తి అయిన ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థకు చేరుతున్నాయి. చీలమామిడిలో గత ఆరు సంవత్సరాల నుంచి పనులు జరగకుండా మధ్యలోనే నిలిచిపోయాయి.

నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు: మండలంలోని మాచునూర్, కక్కర్‌వాడ, కొల్లూర్ గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మంజూరై నాలుగేళ్లు గడిచినా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. నిధులు సరిపోవనే సాకుతో సదరు గుత్తేదారులు పనులు ప్రారంభించడం లేదు. నిర్మాణం పనులు పూర్తిఅయిన వాటిని ప్రారంభించాలని సంబంధిత గ్రామ సర్పంచ్‌లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. కుప్పానగర్, బర్దీపూర్, కక్కర్‌వాడ, కొల్లూర్, నర్సాపూర్ గ్రామాల్లో ఆరు బయట చెట్ల కింద సమావేశాలు నిర్వహిస్తున్నారు.

పనులు ప్రారంభించాలి



గ్రామంలో పంచాయతీ భవనం లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణం కోసం హనుమాన్ మందిరం పక్కన స్థలాన్ని కేటాయించారు. సభలు, సమావేశాలు జరుపుకునేందుకు ఇబ్బందిగా మారింది. పనులు వెంటనే ప్రారంభించాలి. – జగన్, కక్కర్‌వాడ

జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



పంచాయతీ భవనాల ప్రారంభోత్సవ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రారంభించేలా చూస్తాం. మంజూరు అయిన గ్రామాలు, భవనాలు నిర్మించేలా గుత్తేదారుకు తెలియజేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. లేని పక్షంలో సదరు గుత్తేదారు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – అనంతరాం, పీఆర్ ఏఈ,

మోతీమాత ఆలయ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

జహీరాబాద్: మోతీమాత ఆలయ అభివృద్ధికి రూ.5లక్షల నిధులను మంజూరు చేయించనున్నట్లు ఎమ్మెల్సీ ఎం.డి. ఫరీదుద్దీన్ అన్నారు. మంగళవారం సాయంత్రం మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో గల మోతీమాత ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం కూడా మంత్రి హరీశ్‌రావు రూ.20లక్షల నిధులను మంజూరు చేయడంతో ఆలయ ప్రాంగణానికి ప్రహరీ ని నిర్మించినట్టు తెలిపారు. తాజాగా రూ.5లక్షల నిధులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సుముఖతను వ్యక్తం చేసిందన్నారు. అంతే కాకుండా ఆలయానికి సమీపంలో ఉన్న పర్వతాపూర్ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సైతం మంజూరు చేయించనున్నట్లు చెప్పారు. మోతీమాత ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పర్చేందుకు పాటుపడుతానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాములు నాయక్, కర్ణాటక ఎమ్మెల్యే ఉమేష్‌జాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ కిషన్‌రావు పవార్, వైస్ చైర్మన్ ఉమ్లా నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ డి.లక్ష్మారెడ్డి, ఆత్మ చైర్మన్ పి.రామకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ డి.లక్ష్మారెడ్డి, టీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కె.మాణిక్‌రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, ఆర్టీఏ అబ్దుల్ హమీద్, ఓపీసీ నల్లమల రవి, ఇప్పపల్లి పీఏసీఎస్ చైర్మన్ సంజీవరెడ్డి, టీఆర్ఎస్ నాయకులు వైజ్యనాథ్, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు ఎం.సుభాష్‌రెడ్డి, గిరిజన సంఘం నాయకులు అర్జున్, చందర్, గోపాల్, తులసీరాంరాథోడ్, లింబాజీ, దేవీదాస్, నారాయణ, జైపాల్ పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

వేతనాలు వెంటనే ఇప్పించాలి



ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే విద్యా వలంటీర్లకు గత రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సరైన సమయంలో వేతనాలు అందించాలి. వేతనాలు అందక విధులకు హాజరయ్యేందుకు రాకపోకల ఖర్చుల కోసం అవస్థలు పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకుని వేతనాలు అందే విధంగా చూడాల్సిన అవసరం ఉంది. –ఎం.రాజేష్, ఝరాసంగం



వెండితెర



హలో: మోహన్
11.30, 2.30, 6.30, 9.30
ఎంసీప: మహేశ్వరీ
(11.30, 2.30, 6.30; 9.30)
టైగర్ జిందాబాద్: సినిమాక్స్
11.30, 2.30, 6.30, 9.30.
ఇది నీ నా మన ప్రేమకథ:
అనురాగ్ (11.30, 2.30, 6.30, 9.30)

క్యాలెండర్ ఆవిష్కరణ

కోహీర్(జహీరాబాద్): పీఆర్‌టీయూ టీఎస్ కోహీర్ మండల శాఖ 2018 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రూపొందించింది. ఈ మేరకు మండలంలోని దిగ్వాల్ ప్రభుత్వోన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో సంఘం నాయకులు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ అధ్యక్షులు భోజరాజు, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షులు సురేందర్, హెచ్‌ఎం సీరాజోద్దీన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే వీడియో ఆల్బమ్ ప్రదర్శన

ఝరాసంగం రూరల్(జహీరాబాద్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో సావిత్రిబాయి పూలే జీవిత విశేషలపై విడియో ఆల్బమ్‌ను ఆవిష్కరించి ప్రదర్శించారు. మంగళవారం ఝరాసంగం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో తహసీల్దార్ రత్నం, ఎంపీడీఓ ఎల్లయ్య, కళాకారుడు, ఉపాధ్యాయుడు రాంచెందర్ బీంవంశీల చేతుల మీదుగా ఆవిష్కరించారు. సావిత్రిబాయి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రొజెక్టర్ ద్వారా తెరపై వీడియో ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో బీసీ సేన తాలుకా అధ్యక్షుడు నారయణ, బీసీ నాయకులు దత్తు, బస్వరాజ్, రాంచెందర్‌బింవంశీ,ఎర్రంవేణు,శంకర్ బాబులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేను విజయవంతం చేయాలి

కోహీర్(జహీరాబాద్): అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ సర్వేను విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు కోరారు. మండలంలోని దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాధులను తొలిదశలో గుర్తించడం ద్వారా పూర్తిగా నయం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఏఎన్‌ఎంలకు, ఆశావర్కర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాస్, శోభారాణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కోహీర్(జహీరాబాద్): కోహీర్–పోతిరెడ్డిపల్లి రోడ్డు పక్కన విద్యుత్ హైటెన్షన్ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ స్తంభం ఓ పక్కకు ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు మరో పక్కకు ఒరిగిపోయాయి. స్తంభంపై నుంచి కాసారంతో సహా జారి విద్యుత్ తీగలు ప్రస్తుతం మనిషికి అందే ఎత్తులో వేలాడుతున్నాయి. రోడ్డుకు కేవలం 25 గజాల దూరంలో ఉన్నా అధికారులకు చీమ కుట్టినట్టయినా లేదు. ప్రమాదం జరగక ముందే స్తంభాలను సరిచేయాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

జహీరాబాద్‌లో బంద్ పాటించిన వైద్యులు

- పట్టణంలో నిలిచిపోయిన వైద్యసేవలు

జహీరాబాద్ టౌన్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ)కు వ్యతిరేకంగా మంగళవారం జహీరాబాద్ పట్టణంలో వైద్యులు బంద్ పాటించారు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు నిలిచిపోయి రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ మేరకు స్థానిక వైద్యులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐఎంఏ హాల్‌లో సమావేశమై తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గతంలో ఉన్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను రద్దు చేసి దాని స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్ సంస్థను ప్రవేశపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ఎన్‌ఎంసీ సంస్థ వల్ల ప్రజా వైద్యానికి, వైద్య విద్యకు నష్టం కల్గిస్తుందన్నారు. ఇప్పటి వరకు ఉన్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో మెజార్టీ సభ్యులంతా వైద్యవృత్తిలో కొనసాగేవారు ఉన్నారన్నారు. కొత్తగా తీసుకుకొచ్చిన నేషనల్ మెడికల్ కమిషన్‌లో సభ్యులను నామినేటెడ్ పద్దతిలో నియమించబడుతారన్నారు. వైద్య వృత్తికి సంబంధంలేని వాళ్లను సభ్యులుగా నియమించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఎన్‌ఎంసీ బిల్లును ప్రజలు కూడా వ్యతిరేకించాలని కోరారు.కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు అజయ్‌కుమార్ సరాడ, కుల్‌కర్ణి,శివబాబు, నవల్‌కిషోర్ సరాడ, వీరేశం, చంద్రయ్య, వీవీ రెడ్డి, శంకర్ లాల్‌లు ఉన్నారు.



ఐఎంఏ హాల్ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

మోతీమాత ఆలయ అభివృద్ధికి కృషి చేశా

జహీరాబాద్: రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మోతీమాత ఆలయాభివృద్ధికి తగినవిధంగా నిధులను మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే జె.గీతారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ ఆలయం దిన దినాభివృద్ధి చెందుతోందన్నారు. మరింత అభివృద్ధిలోకి వచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మంకాల్ సుభాష్, ఆత్మ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కోహీర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రామలింగారెడ్డి, జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింహులు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు నాగిశెట్టి రాథోడ్, నాయకులు నర్సింహారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జె.గీతారెడ్డి

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

జహీరాబాద్: జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి వై.నరోత్తం విమర్శించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరోత్తం మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజీ ఎక్కడికక్కడే పేరుకు పోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా సమస్యలపై తమ పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మసూద్ హుసేన్, కృష్ణయ్య, యూసుఫ్, శ్రీకాంత్, షరీఫ్, వీర్‌శెట్టి, ప్రకాష్, వేణుగోపాల్, గాళ్ రెడ్డి, విజయకుమార్, భానుచందర్, హసన్, అమ్జద్‌ఖాన్, కవిరాజ్, మాజీద్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్ టౌన్: రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ రాజు పేర్కొన్నారు. పట్టణంలోని పలు మహిళా స్వయం సహక సంఘాలకు రూ. 10 లక్షల రుణ పత్రాలను మంగళవారం బ్యాంక్ వద్ద పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట రుణాలతో పాటు అన్నిరకాల రుణాలను మంజూరు చేస్తున్నామని ఆయన చెప్పారు. మహిళలు ఆర్థికంగా బలపడాలని గ్రూపులకు రుణాలను మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి రాములు, ఎఫ్‌ఎల్‌సీ రాజిరెడ్డి మహిళలు పాల్గొన్నారు.

Zone Guide

7న శ్రీశైల క్షేత్రానికి మహాపాదయాత్ర

ఝరాసంగం(జహీరాబాద్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లాలోని వెలసిన జ్యోతిర్లింగ స్వరూపుడైన శ్రీ భ్రమరాంబిక మల్లిఖార్జున శ్రీశైలమహాక్షేత్రానికి ఝరాసంగం నుంచి భక్తులు 17వ పాదయాత్రగా తరలి వెళ్తున్నట్లు నిర్వాహకులు ఆగమయ్య పటేల్, శీనుపాటిల్, సంజీవ్‌సింగ్ ఠాకూర్, ఉమేష్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆయన మాట్లాడుతూ పాదయాత్ర ఈ నెల 7వ తేదీన ఝరాసంగం నుంచి బయలు దేరనున్నట్లు పేర్కొన్నారు. పాదయాత్ర సుమారు 320 కిలోమీటర్ల వరకు ఉంటుందన్నారు. పాదయాత్ర వెళ్ళే భక్తులు ఫోన్ నెంబర్లు. 9908445101, 9866123906, 9989306031లకు సంప్రదించాలని కోరారు.

చాకలి పోరు గర్జనకు తరలి రావాలి

ఝరాసంగం(జహీరాబాద్): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో ఈ నెల 7న నిర్వహించే చాకలి పోరు గర్జన మహాసభకు అధిక సంఖ్య లో తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని జిల్లా వెనకబడిన అభివృద్ధి శాఖ రజక సంఘం సభ్యుడు సీహెచ్ దత్తు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఎస్సీ సాధన సమితి ఆధ్వర్యంలో ఈ మహాసభను నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో రజకులు భారీగా తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఝరాసంగం(జహీరాబాద్): భారతీయ తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా పేరొందిన సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు పూలే జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలను స్వేరోస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని విజ్ఞాన్‌జ్యోతి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లా అధ్యక్షుడు రత్నం చేతుల మీదుగా విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను బహుమతులుగా అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంటు నాగన్న, ఇర్ఫాన్, ఉపాధ్యాయులు రమేష్, సుజాత, హేమలత, జ్యోతి, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

సిద్ధారెడ్డి
అంశం: భూ రికార్డుల సర్వే
వీఆర్‌ఓ, మిర్జాపూర్(బి)



న్యాల్‌కల్(జహీరాబాద్):

ప్రశ్న: మిర్జాపూర్(బి) గ్రామం పరిధిలో ఎన్ని ఎకరాల భూమి ఉంది?
వీఆర్‌ఓ: మిర్జాపూర్(బి) గ్రామ పరిధిలో 841.04 ఎకరాల భూమి ఉంది.
ప్రశ్న: అందులో ప్రభుత్వ భూమి ఎంత? పట్టాభూమి ఎంత?
వీఆర్‌ఓ: ప్రభుత్వ భూమి 55.24 ఎకరాలు కాగా, పట్టా భూమి 786 ఎకరాల విస్తీర్ణంలో ఉంది.
ప్రశ్న: గ్రామపరిధిలో సాగుభూమి విస్తీర్ణం ఎంత?
వీఆర్‌ఓ: గ్రామపరిధిలో 750 ఎకరాల వరకు సాగులో ఉంది.
ప్రశ్న: వ్యవసాయానికి యోగ్యత లేని భూమి ఎంత?
వీఆర్‌ఓ: వ్యవసాయానికి యోగ్యత లేని భూమి 55 ఎకరాలు.
ప్రశ్న: గ్రామంలో ఎన్ని సర్వే నంబర్లు ఉన్నాయి?
వీఆర్‌ఓ: గ్రామపరిధిలో 97 సర్వేనంబర్లు ఉన్నాయి.
ప్రశ్న: గ్రామంలో ఎంత మంది రైతులు ఉన్నారు?
వీఆర్‌ఓ: మొత్తం 310మంది రైతులు ఉన్నారు.
ప్రశ్న: భూప్రక్షాళన కార్యక్రమం ఎలా కొనసాగుతోంది? అందులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?
వీఆర్‌ఓ: భూప్రక్షాళన కార్యక్రమం దాదాపు 96శాతం పూర్తయ్యింది. కార్యక్రమంలో 35 దరఖాస్తులు వచ్చాయి. రెండు మినహా మిగతా వాటిని పరిష్కరించాం.
ప్రశ్న: గ్రామ పరిధిలో చెరువులు, కుంటలు ఏమైనా ఉన్నాయా? అటవీ భూములు ఉన్నాయా?
వీఆర్‌ఓ: చెరువులు, కుంటలు, అటవీ భూములు లేవు.



మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో..



రాయికోడ్(అందోల్): ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఎన్ని చట్టాలు చేసినా ఫలితం లేకుండా పోతోంది. ఫలితంగా విద్యార్థులు అసౌకర్యాలతో సహవాసం చేయాల్సి వస్తోంది. మండల కేంద్రంలోని పాఠశాల విద్యార్థులు మూత్రశాలలు లేక నిరుపయోగంగా ఉన్న బస్టాండ్ ఆవరణను ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి కనీసవసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్: 84650 19333

న్యూస్ బాక్స్

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి ఈటల



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి

జోగిపేట(అందోల్): రాష్ట్ర ఎంపీటీసీ ఫోరం రూపొందించిన 2018వ సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యాయులు కాదిరాబాద్ రమేశ్‌తో పాటు రాష్ట్ర సంఘం నాయకులు కూడా పాల్గొన్నారు. ఎంపీటీసీలకు నిధుల కేటాయింపునకు సంబంధించిన విషయాలను రాష్ట్ర, జిల్లా నాయకులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీటీసీ ఫోరం సంఘం నాయకులకు మంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు.

సబ్సిడీ ట్రాక్టర్ల కోసం 46 దరఖాస్తులు

రాయికోడ్(అందోల్): మండలానికి మంజూరైన సబ్సిడీ ట్రాక్టర్ల కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ తెలిపారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం పలువురు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల నుంచి 46 మంది రైతులు సబ్సిడీ ట్రాక్టర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. మండలానికి 6 ట్రాక్టర్లు మంజూరు అయ్యాయన్నారు. రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. త్వరలో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి సబ్సిడీ ట్రాక్టర్లను పంపిణీ చేస్తారన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

మునిపల్లి(అందోల్): విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని బుదేరా ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని బుదేరా పోలీస్ స్టేషన్‌లో పీఆర్టీయూ నాయకులు ఏర్పాటు చేసిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. 2018 నూతన సంవత్సరానికి సంబంధించిన పీఆర్టీయూ నాయకులు ఏర్పాటు చేసిన క్యాలెండర్‌ను బుదేరా ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య, మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, మండల కార్యవర్గ సభ్యులు రాజు, చంద్రయ్య, మహేందర్, సంగమేశ్వర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఖాదిరాబాద్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు

- ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక తరగతులు
- వటపల్లిలో విద్యార్థుల లక్ష్యం 10 జీపీఏ
- వంద శాతం కోసం ఉపాధ్యాయుల కృషి
- వెనుకబడినవారిపై ప్రత్యేక శ్రద్ధ

'పది'కి కసరత్తు

వటపల్లి(అందోల్): విద్యార్థి దశలో అత్యంత కీలకమైనది పదో తరగతి. ఉన్నత విద్యకు ఇది పునాది లాంటిది. వార్షిక పరీక్షలకు ఇక మిగిలింది 65 రోజులే. ఈ సమయంలో కాలయాపన లేకుండా ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాల వారీగా విభజించుకొని చదవాలి. ఇప్పటికే విద్యాశాఖ శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించింది. విద్యార్థులు పదిపై పట్టు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని నిర్ణయించింది. పది జీపీఏ లక్ష్యంగా విద్యార్థులు, వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పాఠశాలల్లోనే కాకుండా ఇంట్లో కూడా చదవాల్సిన పాఠ్యాంశాలను ఉపాధ్యాయులు ముందస్తుగానే వివరిస్తున్నారు. టీవీ, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, పోషకాహారం తీసుకొని సరైన వేళల్లో నిద్రపోవాలని సూచిస్తున్నారు. ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రగతిని వివరిస్తున్నారు.ఈ పాటికే సిలబస్ పూర్తిచేసిన ఉపాధ్యాయులు ప్రస్తుతం పునశ్చరణ తరగతులు కొనసాగిస్తున్నారు. గత అనుభవాలను పరిగణలోకి తీసుకొని మొదటి నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.ముఖ్యంగా చదువులో వెనుకబడిన వారిపై దృష్టి కేంద్రీకరించారు. విద్యార్థుల హాజరు శాతం, ఉత్తీర్ణతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో ఈ విద్యా సంవత్సరం మొదటి నుంచి ఉపాధ్యాయులు బడికి రాని విద్యార్థుల ఇంటికి వెళ్లి ఆరా తీశారు. బడికి పంపించాలని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలను వ్యవసాయ పనులకు పంపిస్తున్న విషయాన్ని గుర్తించి ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి బడికి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. వటపల్లి మండల పరిధిలో ఒక మోడల్ పాఠశాలతో పాటు, 5 ఉన్నత పాఠశాలల నుంచి 309 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారు. మార్చి 15 నుంచి 28వ తేదీ వరకు వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. ఇప్పటి నుంచే ప్రీ ఫైనల్ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

సందేహాల నివృత్తి

శతశాతం ఉత్తీర్ణత సాధించాలని వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఈ మేరకు అన్ని ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు



అన్ని సబ్జెక్టుల్లో ఎక్కువ మార్కులు రావాలంటే ఇప్పటి నుంచే సిద్ధం కావాలి.ప్రధాన సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించి సాధన చేస్తున్నాం.ప్రస్తుతం ప్రత్యేక తరగతులతోపాటు పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి మా ప్రశ్నలకు నివృత్తి చేస్తున్నారు.

– ప్రణీత,ఖాదిరాబాద్ ఉన్నత పాఠశాల

వందశాతం కోసం ప్రణాళిక



ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పదోతరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాం. అన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ తరచూ పర్యవేక్షిస్తున్నాం. గత ఏడాది ఫలితాల ఆధారంగా ఈ పాటికే పకడ్బందీ చర్యలు చేపట్టాం.

– బి.కృష్ణ, ఇన్‌చార్జి మండల విద్యాధికారి

మైదానాన్ని పట్టించుకోరా?

- అధికారుల తీరుపై సీపీఐ నాయకుల ఆగ్రహం
- గ్రౌండ్‌లో గుంతల పరిశీలన



జోగిపేట మైదానంలో నీటి గుంతను పరిశీలిస్తున్న నాయకులు

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో పైప్‌లైన్ లీకేజీతో గుంతలు ఏర్పడి ఆ నీరంతా మైదానంలో ప్రవహించి బురదమయంగా మారినా అధికారులు పట్టించుకోవడంలేదని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి నర్సింలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆ గుంతలను ఆయన స్వయంగా పరిశీలించారు. మైదానంలో ఇటీవల మిషన్ భగీరథ పనుల నిమిత్తం తవ్విన గుంతలను పూర్తి స్థాయిలో నింపివేయకుండా, లీకేజీలను సరిచేయకుండా వదిలిపెట్టారన్నారు. మట్టిని కూడా మైదానంలో అలాగే వదిలివేసారని, దీని వల్ల క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులకు ఎదురవుతున్నాయన్నారు. మైదానంలో 30 శాతానికి పైగా పనికి రాకుండా పోయిందని, బురద, మట్టి కుప్పలతో ఆటలు ఆడుకునేందుకువీలులేకుండా ఉందన్నారు. సంబంధిత స్పోర్ట్స్ అథారిటీ వారు వచ్చి మైదానంలో లీకేజీలను తొలగించేలా నగర పంచాయతీ అధికారులపై వత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు. వివిధ మండలాలకు చెందిన అధ్యక్షులు యాదయ్య, కృష్ణ, నాయకులు విజయ్‌కుమార్, అర్జున్‌లతో పాటు పలువురు ఆయన వెంట ఉన్నారు.

లోకల్ వాయిస్

బైపాస్‌పై లైట్లు ఏర్పాటు చేయండి



జోగిపేట(అందోల్): అందోలు బైపాస్ నుంచి గౌని వరకు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయిబాన్‌పేట గ్రామానికి చెందిన వారు వెళ్లాలంటే ఈ రోడ్డు గుండానే వెళ్లాల్సి ఉంటుంది. రాత్రి పూట అందోలు వద్దనే బస్సు దిగి నడిచిపోయేవారు కూడా చాలా మంది ఉంటారు. రాత్రి పూట వెళ్లాలంటే మహిళలు భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీ వారు వెంటనే బైపాస్‌రోడ్డులో స్తంభాలను ఏర్పాటు చేసి లైట్లు ఏర్పాటు చేయాలి.

– పవన్, అందోల్



వెండితెర



ఎంసీఏ
వెంకటేశ్వర 70 ఎంఎం
11.15, 2.15, 6.15, 9.15

కన్‌సాన్‌పల్లి రెడ్డి సంఘం కార్యవర్గం



శ్రీనివాస్‌రెడ్డి



గజేందర్‌రెడ్డి

జోగిపేట(అందోల్): అందోలు మండలం కన్‌సాన్‌పల్లి గ్రామ రెడ్డిసంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీ.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రుక్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.గజేందర్‌రెడ్డి, కోశాధికారిగా ఎన్. వెంకట్‌రాంరెడ్డి, గౌరవ సభ్యులుగా ఏ.ప్రదీప్‌రెడ్డి, ఎస్.నర్సింహారెడ్డి, ఎన్.మదన్‌రెడ్డి, హెచ్. వెంకట్‌రెడ్డి, ఎన్.శంకర్‌రెడ్డి, ఎస్.ప్రకాశ్‌రెడ్డిలు ఎన్నికైన వారిలో ఉన్నారు. ప్రభుత్వం రెడ్డిలకు కూడా సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

పాఠశాలలో సంబరాలు




అంతారంలో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్

మునిపల్లి(అందోల్): పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నూతన సంవత్సర సంబరాల కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం మండలంలోని అంతారం, మల్లిఖార్జునపల్లి, చీలపల్లి, తాటిపల్లి, పెద్దలోడి, ఖమ్మంపల్లి పాఠశాలలో 2018 సంవత్సరం సందర్భంగా సంబరాలు నిర్వహించారు. సంబరాల కార్యక్రమంలో భాగంగా కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. అంతారం సర్పంచ్ సిద్దన్న పాటిల్, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, బాల్‌రాజ్, యాదగిరి, ఖమ్రోద్దీన్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థికి సన్మానం

వట్‌పల్లి(అందోల్): మండలంలోని పోతుల బోగుడా మోడల్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదవుతున్న డి.కిశోర్‌గౌడ్ బీరంగూడలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో కరాటే విభాగంలో ద్వితీయస్థానంలో నిలిచి సిల్వర్ మోడల్ సాధించారు. సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థిని మంగళవారం టీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఇదే స్ఫూర్తితో మరిన్ని పథకాలు సాధించాలని పలువురు ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరాంరెడ్డి, నాయకులు హన్మంత్‌రెడ్డి, వంశీ, మోహన్, ఆబేద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయినా పేరు మార్చరా?



జోగిపేట(అందోల్): జోగిపేట నగర పంచాయతీ కమిషనర్ దేవేందర్ బదిలీ అయి సుమారు మూడు మాసాలు దాటినా ఇంకా సమాచార హక్కు చట్టం సమాచారంలో గోడకు రాసిన ఎగువ స్థాయి అధికారి పేరును ఇంతవరకు మార్చలేదు. నగర పంచాయతీకి ప్రస్తుతం కమిషనర్‌గా అంబాదాస్ రాజేశ్వర్ కొనసాగుతున్నారు. నగర పంచాయతీకి సీడీఎంఏ కార్యాలయం నుంచి ఉన్నత స్థాయి అధికారులు పలు సార్లు వచ్చిన గమనించకపోవడం శోచనీయం. బదిలీ అయిన కమిషనర్ పేరును మార్చకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

డాక్టరు లేకుండానే పశువైద్యశిబిరమా?

- అసంతృప్తి వ్యక్తం చేసిన రైతులు



అన్నాసాగర్ గ్రామంలో పశువైద్య శిబిరం

జోగిపేట(అందోల్): అందోలు మండలం అన్నాసాగర్ గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబంధిత శాఖకు చెందిన డాక్టరు లేకున్నా కింది స్థాయి సిబ్బందితో శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని పశువులకు టీకాలు వేశారు. జోగిపేట ఆస్పత్రిలో పనిచేస్తున్న కిందిస్థాయి సిబ్బంది రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులు పశువులు, మేకలు, గొర్రెలకు సంబంధించి వచ్చే వ్యాధుల విషయాన్ని డాక్టరు దృష్టికి తీసుకువచ్చి రోగ నివారణ చర్యలు అడుగుదామని రైతులు రాగా డాక్టర్ లేకపోవడంతో వారు నిరుత్సాహంతో వెనుదిరిగారు. ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో శిబిరాలను ఏర్పాటు చేసి రైతులను చైతన్య పరిచి పశువులకు రోగాలు రాకుండా వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చే కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహించడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. రైతులు అసంతృప్తికి గురయ్యారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రమైన వట్‌పల్లిలోని ఉన్నత పాఠశాల ఆవరణలో 2018 సంవత్సరానికి సంబందించిన పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు.ఈ అవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల ఇన్‌చార్జి ఎంఈఓ బి.కృష్ణ, మండల వ్యవసాయ అధికారి మహేష్ చౌహాన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ గజ్వేల్లో నిర్వహిస్తున్న ఆయుత ధర్మ దీక్షకు పూర్తిగా మద్దతు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ ప్రధానకార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్‌గౌడ్, బి.సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు దిగంబర్‌రావు, రంజ్యానాయక్,లక్ష్మణ్, సిద్దేశ్వర్, స్వప్న, శ్రీదేవి, అనిత, రజిత, నాగ్‌సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

పత్తి కర్రను తొలగించుకోవాలి



రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న ఏఓ

రాయికోడ్(అందోల్): పత్తితీత పూర్తి చేసిన రైతులు సత్వరం పొలాల్లోంచి పత్తి కర్రను తొలగించాలని మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ రైతులకు సూచించారు. మండల కేంద్రం రాయికోడ్‌లోని తన కార్యాలయంలో మంగళవారం పలువురు రైతులకు సబ్సిడీ ధరపై టార్పాలిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి కర్ర తీయడంలో నిర్లక్ష్యం వహిస్తే వచ్చే ఖరీఫ్‌లో సాగుచేసే పత్తిపంటకు గులాబి పురుగు బెడద ఎక్కువయ్యే అవకాశం ఉందన్నారు. పత్తి కర్రను తొలగించే క్రమంలో కాటన్ షెడర్ యంత్రాన్ని వినియోగిస్తే పత్తి కర్ర ముక్కలుగా మారి పొలానికి ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. వచ్చే సీజన్‌లో పత్తిని సాగు చేసే రైతులు విధిగా పొలం చుట్టూ నాన్‌బీటీ పత్తిని సాగు చేసి బీటీ పత్తి పంటను రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు శంకర్, యాదగిరి, స్వాతి, రైతులు తదితరులు ఉన్నారు.

Zone Guide

నేడు సేద్యానికి నీటి విడుదల

పుల్‌కల్(అందోల్): సింగూర్ వరద కాల్వల ద్వారా నీటిని విడుదల చేసేందుకు ఎమ్మెల్యే బాబూమోహన్ బుధవారం సింగూర్‌కు రానున్నట్లు ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ బాలగణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సింగూర్ ఎడమ కాల్వల ద్వారా చెరువు, కుంటలను నింపేందుకు గాను నీటిని విడుదల చేయనున్నట్టు తెలిపారు.

నూతన సంవత్సర వేడుకల్లో ఎంఈఓ



కేక్ కట్ చేస్తున్న ఎంఈఓ కృష్ణ

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రమైన వట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో మండల ఇన్‌చార్జి ఎంఈఓ బి.కృష్ణ హాజరై కేకును కట్‌చేసి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరు సమయాన్ని వృథా చేయకుండా 10జీపిఏ సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశం, మూర్తి, మహేష్, సిద్ధయ్య, నవీన, పద్మాకర్, మహేందర్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



దశరథ్
అంశం: విద్యాభివృద్ధిపై
ఇన్‌చార్జి ఎంఈఓ, మునిపల్లి



మునిపల్లి(అందోల్):

ప్రశ్న: మండలంలో ప్రాథమిక పాఠశాలలు ఎన్ని ఉన్నాయి?
ఎంఈఓ: మొత్తం 31 ప్రాథమిక పాఠశాలలున్నాయి.
ప్రశ్న: ప్రాథమికోన్నత పాఠశాలలు ఎన్ని ఉన్నాయి?
ఎంఈఓ: మొత్తం 8 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి.
ప్రశ్న: జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలు ఎన్ని ఉన్నాయి?
ఎంఈఓ: 12 కేజీవీబీ, ఒక మోడల్ స్కూల్ ఉన్నాయి.
ప్రశ్న:అన్నీ పాఠశాలల్లోమొత్తం ఎంతమంది విద్యార్థులున్నారు?
ఎంఈఓ:మండలంలో మొత్తం 4,230 మంది విద్యార్థులున్నారు.
ప్రశ్న: బడిబాటలో ఎంత మందిని బడిలో చేర్పించారు?
ఎంఈఓ:సుమారు 700 మంది విద్యార్థులను బడిలో చేర్పించాం
ప్రశ్న: చేర్పించినవారికి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారా?
ఎంఈఓ: పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశాం. మరికొంత మందికి కొన్ని సబ్జెక్టులు రావాల్సి ఉంది.
ప్రశ్న: విద్యాభివృద్ధికి ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?
ఎంఈఓ: ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బోధిస్తున్నారు.
ప్రశ్న: చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏమైనా తీసుకుంటున్నారా?
ఎంఈఓ: చదువులో వెనుకబడిన విద్యార్థులతో రాయించడం, చదివించడం లాంటివి చేయిస్తున్నాం.
ప్రశ్న: ఉపాధ్యాయులు సమయ పాలన ఎలా ఉంది?
ఎంఈఓ: సమయ పాలన పాటించాలని ఉపాధ్యాయులకు సూచించాం. ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం.
ప్రశ్న: మండలంలో ఉపాధ్యాయులు లేని పాఠశాలలు ఎన్ని?
ఎంఈఓ: మక్తక్యాసారం, కల్లపల్లి బేల్లూర్ తెలుగు మీడియం, పెద్దచల్మెడ, ఖమ్మంపల్లి ఉర్దూమీడియం పాఠశాలలు.
ప్రశ్న: విద్యావలంటీర్లను ఎంతమందిని తీసుకున్నారు?
ఎంఈఓ: 22 మంది వలంటీర్లను నియమించాం. కల్లపల్లి బేలూర్ ప్రైమరీ పాఠశాలలో వలంటీర్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను కోరాం.



'చెత్త'పాలవుతున్న రిక్షాలు



నారాయణఖేడ్: మండలంలోని తడ్కల్ గ్రామ పంచాయతీకి స్వచ్ఛ భారత్ పథకం కింద చెత్త సేకరణకు ప్రభుత్వం అందించిన రిక్షాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 90101 44464

తీరనున్న 'మధ్యాహ్న' తిప్పలు

- పాఠశాలలో వంట గదుల నిర్మాణానికి నిధుల మంజూరు
- మండలంలో 17 పాఠశాలల్లో కొనసాగుతున్న నిర్మాణాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న నిర్వాహకులు

మనూరు(నారాయణఖేడ్): మనూరు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వంట గదులు లేక మధ్యాహ్న భోజన కార్మికులు పడుతన్న ఇబ్బందులు ఇక తొలగనున్నాయి. మనూరు మండలంలోని 9, నాగల్‌గిద్ద మండలంలో 8 పాఠశాలల్లో ప్రభుతం వంట గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఒక్కో గది నిర్మాణానికి రూ.1.25 లక్షలు విడుదలయ్యాయి. మనూరు మండలంలోని డోవూర్, దోసపల్లి, మనూరు, ఉసిరికెపల్లి, ఎల్గోయి, బాదల్‌గాం, బెల్లాపూర్, మాయికోడ్, మనూరు ఉన్నత పాఠశాలల్లో వంటగదుల నిర్మాణాలు మంజూరయ్యాయి. నాగల్‌గిద్ద మండలంలో గోప్యానాయక్‌తండా, కారముంగి, మావినెల్లి, నాగల్‌గిద్ద, రేఖ్యనాయక్‌తండా, సక్రునాయక్ తండా, శామ తండా, శామ్యనాక్ తండాలో వంట గదుల నిర్మాణాలకు ప్రభుత్వ నిధులు మంజూరు చేసింది. దీంతో మధ్యాహ్న భోజన నిర్వహాకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మనూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న వంట గది

ఇన్నాళ్లు ఆరుబయట వంటతో అవస్థలు..

ఇన్నాళ్లు వంటగదులు లేక పాఠశాల ఆవరణలో నిర్వాహకులు వంట చేశేవారు. వంట వస్తువులు, సామగ్రిని పాఠశాలల కార్యాలయంలో లేక తరగతి గదుల్లో ఉంచాల్సిన పరిస్థితులు ఉండేవి. వంట గదుల నిర్మాణంతో ఇక ఆ సమస్య తీరనుంది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి గదులు అందుబాటులోకి రానున్నాయి.

మా తిప్పలు తప్పతాయి..



మనూరు ప్రాథమిక పాఠశాలలో వంట గదిలేక వంట ఇన్నాళ్లు తీవ్ర ఇబందులు పడ్డాం. ఉన్న గదిలో చీకటి మధ్య వంట వండుతున్నాం. వంట గది నిర్మాణం పూర్తయితే ఇక ఆ సమస్య తీరుతుంది. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయ్యాల్సిన అవసరం ఉంది.

–శర్ణమ్మ,మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

వచ్చే విద్యాసంవత్సరానికి వినియోగంలోకి..



మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లో నిర్మిస్తున్న వంట గదుల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయిస్తాం. వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తీసుకువస్తాం. గదుల నిర్మాణంతో మధ్యాహ్న భోజన కార్మికుల ఇబ్బందులు తీరుతాయి.

–నాగారం శ్రీనివాస్,ఎంఈఓ,మనూరు

న్యూస్ బాక్స్

వైద్య సిబ్బందికి శిక్షణ



శిక్షణ ఇస్తున్న వైద్యులు

నారాయణఖేడ్: నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) సర్వే శిక్షణను నారాయణఖేడ్ మండల పరిషత్తు సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. నిజాంపేట్ పీహెచ్‌సీ పరిధిలోని ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో డా.అభిలాష్, సుశీల్‌కుమార్, సీహెచ్‌ఓ వజ్రం, భాస్కర్, పరశురాం పాల్గొన్నారు.

గ్రామజ్యోతి కమిటీలకు శిక్షణ

కల్హేర్(నారాయణఖేడ్): గ్రామజ్యోతి కమిటీ సభ్యులు క్రియశీలకంగా పనిచేయాలని కల్హేర్ ఎంపీడీఓ ఉమాదేవి సూచించారు. సోమవారం కల్హేర్ మండల పరిషత్ కార్యాలయంలో బీబీపేట పంచాయతీ పరిధిలోని కమిటీ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లడుతూ..2017–18 సంవత్సరంలో చేపట్టే అభివద్ధి పనుల ప్రణాళిక రుపోందించాలని గ్రామజ్యోతీ కమిటీ సభ్యులకు సూచించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందెలా చూడాలని కోరారు. సాక్షర భారత్ మండల కోఆర్డినేటర్ దేవయ్య కమిటీ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోషమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు భానుబాయి, సీనియర్ అసిస్టెంట్ ఆనందం, ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో..

మరుగుదొడ్ల నిర్మాణాలపై గ్రామ సభలు



భీంరాలో గ్రామసభ నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని భీంరా, గాజుల్‌పాడ్, చౌకన్‌పల్లిలో మంగళవారం సర్పంచ్‌ల అధ్యక్షతన పంచాయతీ సెక్రటరీల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ..ఇంటింటికి తిరిగి మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన కల్పించాలని నిర్ణయించామన్నారు. ఈ నెల 26వ తేదీ లోపు నిర్మాణాను పూర్తి చేస్తామన్నారు. అందరు ఇంటి పన్ను సకాలంలో చెల్లించి అధికారులకు సహకరించాలని కోరారు. 14వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మురికి కాల్వల నిర్మాణ పనులు పూర్తిచేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో భీంరా సర్పంచ్ పుండ్లిక్‌రావు, గాజుల్‌పాడ్ సర్పంచ్ విఠాబాయి సురెందర్‌రావు, చౌకన్‌పల్లి సర్పంచ్ జగదేవి రాజు పటేల్, సితాబాయి, కోటె బసప్ప, పంతులునాయక్, గణపతి, శరణప్ప, శ్రీదేవి పంచాయతీ సెక్రటరీలు మధుకర్, విజయలక్ష్మి, జైరాం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేడు దామర్‌గిద్దా, చాప్టా(కే), తడ్కల్‌లో..

మండలంలోని దామర్‌గిద్దా, చాప్టా(కే), తడ్కల్‌లో బుధవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రత్నమాల తెలిపారు.

ఎస్‌ఎంసీ సభ్యులతో ఎంఈఓ సమావేశం



మాట్లాడుతున్న ఎంఈఓ శంకర్

కల్హేర్(నారాయణఖేడ్): ఎస్‌ఎంసీ సభ్యులు క్రియా శీలకంగా పనిచేసి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని కల్హేర్ ఎంఈఓ శంకర్ సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లడుతూ.. పాఠశాలల నిర్వహణ, మద్యాహ్న భోజనం పథకం అమలు తదితర అంశాలపై ఎస్‌ఎంసీ సభ్యులు దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మెన్లు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

తాగునీటి వసతి కల్పించాలి



నారాయణఖేడ్: నారాయణఖేడ్ బస్టాండ్‌లో తాగునీరు, మూత్రశాలల వసతి ఏర్పాటు చేయాలి. బస్టాండ్‌లోకి అన్ని బస్సులు రావడం ఎంతగానో సౌకర్యవంతంగా ఉంది. కానీ తాగునీరు, మూత్రశాలలు లేక ఇబ్బంది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్‌లో అన్ని రకాల సదుపాయాలు కల్పించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

– రాములు, ఐటీఐ విద్యార్థి



మన నారాయణఖేడ్
సాక్షి సంగారెడ్డి
బుధవారం । జనవరి । 3 । 2018

వెండితెర



నారాయణఖేడ్:
షెట్కార్ సువర్ణ: ఖాకీ
11.30, 2.30,6.15, 9.15,
వెంకటేశ్వర : కేరాఫ్ సూర్య
11.30, 2.30,6.15, 9.15,
జోగిపేట :
వెంకటేశ్వర 70 ఎంఎం:
ఖాకీ
11.15, 2.15, 6.15, 9.15

న్యూస్ బాక్స్

సమతుల్య ఆహారంతో ఆరోగ్యం

కల్హేర్(నారాయణఖేడ్): ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కల్హేర్ పీహెచ్‌సీ డాక్టర్ మనోహర్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో సర్పంచ్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ..పీచు పదార్థాలు అధికంగా ఉండే సమతుల్య ఆహారం తీసకోవాలని సూచించారు. గుండెపోటు, రక్తపోటు, పక్షవాతం, క్యాన్సర్, తదితర వ్యాధులు వ్యాపించాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నారాయణ, సూపర్‌వైజర్ మేరి, ఫార్మసిస్టు ఎండి.జబ్బార్, సర్పంచ్‌లు ఈశ్వర్, దీప్లనాయక్, వకీలు జానీ, టీఆర్‌ఎస్ నాయకులు పెరుమాండ్ల బాలయ్య, ఏఎన్‌ఎంలు బాలమణి, శాంత, ఇందుబాయి, రేణుక, లలిత పాల్గొన్నారు.

సిర్గాపూర్‌లో...

పౌష్టికరమైన ఆహారం తీసుకుంటే వ్యాధులు దూరమవుతాయని సిర్గాపూర్ పీహెచ్‌సీ డాక్టర్ అనిల్‌రెడ్డి సూచించారు. మంగళవారం సిర్గాపూర్ పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ షాహెద్, హెల్త్‌అసిస్టెంట్ రాంచెందర్ పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్మూలించాలి

కంగ్టి(నారాయణఖేడ్): గ్రామాల్లో బెల్టు షాపులు రద్దు చేయాలని తెలంగాణ కల్లు గీత కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం కంగ్టిలోని రాంమందిరంలో నిర్వహించిన సంఘం మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కల్లుగీత కార్మికులకు, గౌడ కులస్తులకు ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జేట్‌లో ఐదువేల కోట్లు కేటాయించాలన్నారు. మండలంలోని జై భవాని గౌడ సంఘానికి రూ. 30 లక్షలు సబ్సీడీ రుణం ప్రభుత్వం మంజూరు చేసి ఏడాది దాటినా, బ్యాంకర్ల నిర్లక్ష్యంతో ఇంకను అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లేషంగౌడ్, చంద్రకాంత్‌గౌడ్, గణేష్‌గౌడ్, నర్సింహాగౌడ్, అనీల్‌గౌడ్, ఉమాకాంత్‌గౌడ్, అంజాగౌడ్, భూమాగౌడ్, సాయాగౌడ్, మారుతిగౌడ్, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో..
'న్యూ ఇయర్'..

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం రామయ్య, విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులు ఒకరికి ఒకరు నూతన సంవత్సర శుభాకాంక్షాలు తెలుపుకొన్నారు.

పేదల అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: పేదల అభివృద్ధే లక్ష్యంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని నిజాంపేట్‌లో 80 డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నడన్నారు. గత ప్రభుత్వాలు కేవలం వారి కార్యకర్తలు, పైరవీకారులకే ఇళ్ల బిల్లులు ఇచ్చే వారని ఆరోపించారు. పేదలు ఇళ్లు నిర్మించుకొని కార్యాలయాల చుట్టూ బిల్లులకోసం తిరిగే దుస్థితి ఉండేదన్నారు. కానీ టీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వసతులతో ఇళ్లు నిర్మించి పేదలతో గృహప్రవేశం చేయిస్తుందన్నారు. సమావేశంలో సర్పంచ్ సాయిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ బాసిత్, రవీందర్‌నాయక్, వెంకటేశం సేట్, జగన్ పాల్గొన్నారు.



డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..



కంగ్టి: కల్యాణ లక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని నాగుర్ (బీ)కి చెందిన మేత్రి పంచుబాయి కూతురుకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కును ఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి మంగళవారం అందించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ అధ్యక్షుడు దిలీప్‌కుమార్, రాజు పటేల్, కాశీనాథ్ పాల్గొన్నారు.

బస్టాండ్ బాగుంది సారు

డీఎస్పీతో ప్రయాణికులు



ప్రయాణికులతో మాట్లాడుతున్న డీఎస్పీ యాదగిరి రాజు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ బస్టాండ్‌లో బస్సుల రాకపై డీఎస్పీ యాదగిరి రాజు, సీఐ వెంకటేశ్వర్లు మంగళవారం ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లోకి బస్సులు రావడం ఉపయోగకరంగా ఉందా, లేక రాజీవ్‌చౌక్‌లో బస్సులు నిలపడం వల్ల ప్రయోజనం ఉందా అని ప్రయాణికులను అడగి తెలుసుకున్నారు. ప్రయాణికులు స్పందిస్తూ బస్టాండ్‌లోకి బస్సులు రావడంతో ఉపయోగకరంగా ఉందన్నారు. చౌరస్తాల్లో కూర్చొనేందుకు స్థలం ఉండదని, హోటళ్లు, దుకాణాల ముందు కూర్చోవాల్సి వచ్చేదన్నారు. బస్టాండ్‌లోకి బస్సులు వస్తే బస్సు వచ్చే వరకు వేచి ఉండవచ్చని, ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉందన్నారు. బస్టాండ్‌లో తాగునీరు, మరుగుదొడ్ల వసతి ఏర్పాటు చేయాలని కోరారు. రెండు రోజుల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ అధికారులు హామీ ఇచ్చారని డిఎస్పీ ప్రయాణికులకు చెప్పారు. కొందరు ప్రయాణికులు బస్సుల రాకపోకల వివరాలను మైక్ ద్వారా అనౌన్స్‌మెంట్ చేయాలని కోరారు. బస్టాండ్‌కు బస్సులు రావడంపై కళాశాలల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎస్పీ వెంట ఎస్‌ఐ నరేందర్, ఆర్టీసీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

Zone Guide

నేడు బస్టాండ్‌లో శ్రమదానం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ బస్టాండ్ ఆవరణలో ఈనెల 3న ఉదయం 9.30 గంటలకు పోలీస్ సిబ్బంది, ఆటో, జీపుడ్రైవర్లు, ఆర్టీసీ కార్మికులతో కలిసి శ్రమదానం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. కార్యక్రమాన్ని డీఎస్పీ యాదగిరిరాజు ప్రారంభించనున్నట్లు చెప్పారు. బస్టాండ్‌లో నెలకొన్న పిచ్చిమొక్కలు, చెత్తా, చెదారం తొలగించనున్నట్లు చెప్పారు.

నేడు పశువులకు గాలికుంటు టీకాలు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని దామర్‌గిద్దా, బాన్సువాడ గ్రామాల్లో గోపాలమిత్ర రాజెందర్ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు ప్రభత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న గాలికుంటు టీకాలు వేయనున్నట్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ముస్తాక్‌అలీ తెలిపారు. ప్రతీ ఆరు నెలలకోమారు పశువులకు గాలికుంటు టీకాలు వేయించుకోవాలని సూచించారు.

రేపు ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

కల్హేర్(నారాయణఖేడ్): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించేందుకు ఈ నెల 4న కల్హేర్ మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమాదేవి మంగళవారం తెలిపారు. కల్హేర్ ఎస్‌బీఐ పరిధిలోని పలు గ్రామాలకు అభ్యర్థులు హజరు కావాలని సూచించారు.

నేడు సావిత్రిబాయి పూలే జయంతి

నారాయణఖేడ్: సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఈనెల 3న నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు స్వేరోస్ బాధ్యులు మల్గొండ, లక్ష్మణ్, పండరి తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు ఈ వేడుకలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఇంటర్వ్యూ



నర్సింగ్‌రావు
అంశం : మరుగుదొడ్ల నిర్మాణం
పంచాయతీ కార్యదర్శి, నర్సాపూర్



నారాయణఖేడ్:

ప్రశ్న: గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం ఎలా సాగుతుంది?
జవాబు: నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. వందశాతం నిర్మాణాలే లక్ష్యంగా పనులు చేస్తున్నాం. ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
ప్రశ్న: ప్రస్తుతం ఏఏ దశల్లో ఉన్నాయి?
జవాబు: నర్సాపూర్ గ్రామానికి 218 మరుగుదొడ్లు మంజూరు కాగా 100 పూర్తయ్యాయి. మరో 60 లెంటల్ లెవల్‌లో ఉన్నాయి.
ప్రశ్న: ఇంకా ఎన్ని రోజుల్లో నిర్మాణాలు పూర్తవుతాయి?
జవాబు: మరో 15 రోజుల్లో వందశాతం పూర్తిచేస్తాం.
ప్రశ్న: ఇంకుడు గుంతలు నిర్మించారా?
జవాబు: గ్రామంలో 70 ఇంకుడు గుంతలను నిర్మించాం.
ప్రశ్న: వీధిదీపాలు ఏర్పాటు చేశారా?
జవాబు: రూర్బన్ పథకం క్రింద గ్రామంలో 80 ఎల్‌ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేశాం. అవసరం ఉంటే మరిన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
ప్రశ్న: ఇంటిపన్నుల వసూలు ఎలా ఉంది?
జవాబు: గత ఏడాది వందశాతం ఇంటిపన్నులు వసూలు చేశాం. ఈ ఏడాదికూడా వందశాతం వసూళ్లు చేపడతాం. గ్రామస్తులందరూ వందశాతం పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకారం అందించాలి.

హలో సాక్షి..

పటాన్‌చెరు :	9550408956
పటాన్‌చెరుటౌన్:	7207725678
జిన్నారం:	9966540811
రామచంద్రాపురం:	9348222999

సాక్షి
మన పటాన్‌చెరు
సంగారెడ్డి
బుధవారం I జనవరి I 3 I 2018



పరచుకున్న పచ్చదనం

- కాలనీల్లో విరివిగా మొక్కల పెంపకం
- ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు


శ్రీరాంనగర్ కాలనీలో రోడ్డుకు ఇరువైపుల చెట్లు


బ్లాక్ ఆఫీస్‌లో..

పటాన్‌చెరు టౌన్:ఇంటి ఆవరణలో పచ్చటి లాన్లు, గార్డెన్లు, కాలనీల్లోని రోడ్లకు ఇరువైపుల మొక్కల పెంపకం ద్వారా ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్థాయి. ఇళ్లల్లో స్థలం లేనివారు బాల్కానీ టెర్రస్ వంటి ప్రదేశాల్లో కుండీల్లో మొక్కలు పెంచుకుంటారు. మరికొందరు ముందుగా మొక్కలను పెంచేందుకు కోసం స్థలం కేటాయించి ఇంటి నిర్మాణం ప్రారంభిస్తారు. పర్యావరణానికి అత్యంత ప్రియమైనది పచ్చదనమే .కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన వాతావరణం కోసం పలు కాలనీల్లో రోడ్లకు ఇరువైపుల మొక్కల పెంపకంతో అహ్లాదాన్ని ఇవ్వడమే కాకుండా ఒత్తిడి తగ్గి ఆరోగ్యాన్ని పెంపొందిచుకోవచ్చు.

పచ్చదనానికి కేరాఫ్‌గా..

పట్టణంలోని శాంతినగర్ కాలనీ, శ్రీరాం నగర్ కాలనీ, బ్యాక్ ఆఫీసులో, ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో, కంజర్ల, ఐనోల్, భానూర్,బీడీఎల్ గ్రామంలో రహదారి పై రోడ్డుకు ఇరువైపుల ఎటు చూసిన పచ్చదనమే వెల్లివిరుస్తోంది.ప్రస్తుతం పలు కాలనీల్లో స్థానికులు మొక్కల పెంపకంపై దృష్టి పెట్టారు.కాలుష్యాన్ని తగ్గించేందుకు పర్యావరణాన్ని రక్షించేందుకు తమ కాలనీల్లో మొక్కలు నాటుతున్నారు.

సేదతీరుతున్న జనం

నిత్యం తమ పనుల్లో బీజీగా ఉండేవాళ్లు సాయంకాలం కాలనీల్లో పెంచిన చెట్లకింద నుంచి నడుస్తూ సేదతీరుతున్నారు.రోడ్లకు ఇరువైపుల ఇంటి చుట్టూ,డివైడర్లలో నాటిన మొక్కలు ప్రకృతి ప్రియులను ఆకట్టుకుంటున్నాయి.కాలుష్య పట్టణంను కూల్ సిటీగా మార్చేందుకు తమ వంతు కృషి చేస్తున్నారు పలు కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు మొక్కల పెంపకం పై పలువురు స్వచ్ఛందంగా కాలనీ వాసులకు అవగాహనలు కల్పిస్తున్నారు.అలాగే స్థానిక బ్లాక్ ఆఫీసులో ఎక్కువగా చెట్ల ఉండటంతో ఉదయం వెళ్ల పట్టణ ప్రజలు వాకింగ్,రన్నింగ్ , యోగా చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

కాలుష్యాన్ని తగ్గించేందుకు కృషి



కాలనీల్లో పచ్చదనం ఉండేలా ప్రణాళికలు రూపొం దించుకుని మొక్కలు నాటుతున్నాం. ఎక్కడ ఖాళీ స్థలం ఉన్నా అందులో మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నాం.నాటినవి సంరక్షిస్తున్నాం.

– వీరారెడ్డి, ఆల్విన్ కాలనీ

చెట్ల కింద సేద తీరుతున్నాం



నిత్యం పనుల్లో బిజీబిజీగా ఉంటూ సాయంత్రం కాస్త కాలనీల్లోని చెట్లకింద నుంచి నడుస్తూ సేదతీరుతున్నాం.వేసవిలో ఎంతో హాయిగా చెట్లకింద సేదతీరుతున్నాం. మొక్కలు నాటడం హాబీగా మార్చుకున్నాం.

–విజయ, స్థానికురాలు

చల్లని వాతావరణంలో..



మొక్కల పెంపకంతో వేసవిలో ఎండల నుంచి తప్పించుకోవచ్చు. చల్లని వాతావరణంలో ఒత్తిడి తగ్గి,ప్రశాంత వాతావరణం దొరకుతుంది. మొక్కల్ల పెంపకంతో కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చు.

–యాదగిరి, జేపీ కాలనీ



పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని మార్కెట్‌కు వెళ్లే దారిలో ప్రభుత్వ పాఠశాల ఎదురుగా రోడ్డు పై గుంత ప్రమాదకరంగా మారింది. ఏవైనా ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. -పంపించిన వారు: శివ, స్థానికుడు

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9550408956

న్యూస్ బాక్స్

ఐఎన్‌టీయూసీ క్యాలెండర్ ఆవిష్కరణ



పటాన్‌చెరు టౌన్: ఐఎన్‌టీయూసీ జిల్లా క్యాలెండర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో అఖిల భారత ఐఎన్‌టియూసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మారెడ్డి, ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్ నాయకులు రీయాజ్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా విఠల్


నియామకపత్రం తీసుకుంటున్న విఠల్ మల్లేశం

పటాన్‌చెరు: నియోజకవర్గ పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా విఠల్ మల్లేశం నియమతులయ్యారు. మంగళవారం ఆయన అమీన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఆ పదవిలో నియమించిన తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొసికే యాదగిరి, ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గం పరిధిలో పద్మశాలీకుల బంధువుల సమస్యలపై పోరాడుతామన్నారు.

టీపీయూఎస్ మహిళా ప్రధాన కార్యదర్శిగా కళావతి


కళావతికి నియామకపత్రం ఇస్తున్న యాదమ్మ

జిన్నారం(పటాన్‌చెరు): తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం (టీపీయూఎస్) బొల్లారం గ్రామ మహిళా ప్రధాన కార్యదర్శిగా కళావతిని ఎన్నుకున్నట్లు రాష్ట ఉపాధ్యక్షులు కమల్ తెలిపారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సతీమణి యాదమ్మ చేతుల మీదుగా కళావతికి అందజేశారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో..

దాచారంలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం


కుర్చీలు అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): కిష్టాయిపల్లి గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటైన దాచారంలో అంగన్‌వాడీ కేంద్రాన్నీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ప్రభాకర్‌లు ముఖ్య అతిధిలు హాజరై ప్రారంభించారు. గ్రామంలో తమకు మౌలిక వసతులను కల్పించాలని, ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. వారు మాట్లాడుతూ గ్రామస్తులు సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేలా తమవంతు కృషి చేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి కావాల్సిన కుర్చీలను, గుడ్లను నాయకులు అంగన్‌వాడీ టీచర్లకు అందించారు. ఎంపీడీఓ సుమతి, ఎంపీటీసీ సభ్యుడు రాజు, ప్రకాశ్ చారి ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక


వైఎస్సార్ సీపీలో చేరిన యువకులతో చంద్రశేఖర్

పటాన్‌చెరు టౌన్:పట్టణంలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. శాంతినగర్‌కు చెందిన ప్రభాకర్ రెడ్డితో సహా పలువురు నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆరినేటర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని మండిపడ్డారు. ఆ రెండు పార్టీలకు ప్రజలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరల్లోనే ఉన్నాయన్నారు.వైఎస్ స్వర్ణయుగం మళ్లీ రావాలంటే అది జగన్‌మోహన్‌రెడ్డి తోనే సాధ్యమని స్పష్టం చేశారు.దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల కోసం నిరంతరం పరితపించేవారన్నారు. అందుకోసమే 108, 104, ఆరోగ్యశ్రీ, రూపాయికే కిలో బియ్యం, పక్కా ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి బృహత్తర పథకాలను చేపట్టి తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.నిరుపేద మహిళలు స్వయం సమృద్ధిగా ఎదగాలనే ఉద్దేశ్యంతో వైఎస్ డ్వాక్రా రుణమాఫీ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు.దాని వల్ల అనేక మంది మహిళలు లబ్ధి పొందారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్,శ్రీనివాస్ రెడ్డి,హరనాథ్ రెడ్డి,హిమకాంత్ రెడ్డి, గీతమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

కమిటీని అమలు చేయకూడదు



పటాన్‌చెరు టౌన్:ప్రైవేట్ స్కూళ్ల రుసుములు నియంత్రణపై నియమించిన ఆచార్య తిరపతిరావు కమిటీ ఇచ్చిన నివేదిక సామాన్యుల నడ్డీ విరిచేలా ఉంది. ప్రతి ఏడాది 10 శాతం రుసుము పెంచుకోవచ్చు అనడం బాధాకరం.కమి టీ నివేదికను అమలు చేయకూడదు ఆర్‌టీఈ ప్రకారం ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం ఉచిత విద్యను అందించాలన్న నిబంధన కచ్చితంగా అమలు చే యాలి.

–బలరాం, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు

వెండితెర



హలో:
రుక్మిణి 70ఎం.ఎం
(పటాన్‌చెరు)
11.15, 2.15, 6.15, 9.15

ఎంసీఏ మిడిల్ క్లాస్‌అబ్బాయి:
ఎస్‌వీ సినీ స్క్వేర్
11.00,2.00,6.00,9.00

10:
సంగీత(రామచంద్రాపురం)

హలో:
జ్యోతి 70ఎం.ఎం.

హలో:
జ్యోతి(బొల్లారం)
11.00,2.00,6.00,9.00



శుభాకాంక్షల వెల్లువ

పటాన్‌చెరు:ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి మంగళవారం కూడా వివిధ సంఘాల నాయకులు, పలువురు పార్టీ నేతలు నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు ఆయన నివాసానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం

పటాన్‌చెరు:వ్యాయామంతోనే ఆరోగ్యంగా ఉండగలమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులకు ఎమ్మెల్యే మంగళవారం తన నివాసంలో ట్రాక్‌సూట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మాస్టర్స్ అథ్లెట్లు ఆరోగ్యంగా ఉండటానికి కారణం వారికి క్రీడల పట్ల ఉన్న ఆసక్తేనన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరు తమ శారీరక పటుత్వం పట్ల శ్రద్ధ కలిగి ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ఇందుకోసం వాకింగ్ లేదా ఇతర ఏదోక క్రీడను ఎంచుకోవాలన్నారు. ప్రతి నిత్యం గ్రౌండ్‌కు వెళ్లడం అలవాటుగా చేసుకోవాలన్నారు. అన్ని రకాల క్రీడలను, క్రీడాకారులను తాను ప్రోత్సహిస్తూ వస్తున్నట్లు చెప్పారు. యువత క్రీడల పట్ల ఆకర్షితులైతే ఇతర వ్యసనాలకు, దురలవాట్లకు లోను కారనేది తన భావనగా ఉందన్నారు. చిన్నప్పటి నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటే దీర్ఘాయువు కలిగి ఆనందంగా ఉండవచ్చన్నారు. మాస్టర్ అథ్లెట్లను ఆయన అభినందించారు. వారికి కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తానన్నారు. ఈ నెల 4, 5 తేదీల్లో మంచిర్యాలలో మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారని ఆ క్రీడాపోటీలకు జిల్లా తరపున జట్టు


మాస్టర్ అథ్లెట్లతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పాల్గొంటుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతున్న జిల్లా జట్టు సభ్యులను ఆయన అభినందించారు. ఈ జట్టులో 35 ఏళ్ల నుంచి 90 ఏళ్ల వరకు వయస్సున్న మాస్టర అథ్లెట్లు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మాస్టర్ అథ్లెట్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఫయిమ్ ఇక్బాల్, ప్రధాన కార్యదర్శి బి.సామ్యూల్, నాయకులు పి.బాలయ్య, పద్మిని, ఎస్.అబ్దుల్ అజీమ్,రాములు, పీసీఎస్ రావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎంపీపీ

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లో నెల కొన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రవీందర్‌రెడ్డి అన్నారు. జిన్నారం, గుమ్మడిదల మండలాలకు చెందిన ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీపీ, ఎంపీడీఓ సుమతిలు సమావేశాన్ని నిర్వహించారు. మండల సర్వసభ్య సమావేశంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయమై అధికారులతో చర్చించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో వచ్చిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వచ్చే సమావేశానికల్లా సమస్యల పరిష్కారంతో రావాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. అధికారులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని అధికారులను సూచించారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్‌రెడ్డి

న్యూస్ బాక్స్

టీపీయూఎస్ కార్యవర్గ సమావేశం


సమావేశంలో పాల్గొన్న సభ్యులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని టీపీయూఎస్ కార్యాలయంలో మంగళవారం ముఖ్యనాయకుల సమావేశం జిల్లా అధ్యక్షుడు ఉపేందర్‌చారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల 7న హైదరాబాద్ తెలుగు లలిత కళాతోరణంలో జరిగే టీపీయూఎస్ దశాబ్ది ఉత్సవాలకు జిల్లా నుండి మూడు వేల మందితో వెళ్లేందుకు సభ్యులు చర్చించారు. జిల్లాలోని ప్రైవేట్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని ఉపేందర్‌చారి కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వాజిద్ పాష,ప్రధాన కార్యదర్శిలు శ్రీను, పవన్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మల్లిఖార్జున్, రావు, దామోదర్, అరుణ్‌గౌడ్,అనితచారి తదితరులు పాల్గొన్నారు.

మాదారంలో 'పొలంబడి'



జిన్నారం(పటాన్‌చెరు): నూతన పద్ధతులను ఉపయోగించి రైతులు పంటలను సాగు చేయాలని ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్ సూచించారు.మండలంలోని మాదారంలో పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటిరోజు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు పంట సాగు చేసినప్పటి నుంచి పంట దిగుబడి, మార్కెటింగ్ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

Zone Guide

ఆస్పత్రి సమాచారం

పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం డాక్టర్ శివప్రసాద్ విధులు నిర్వర్తించనున్నారు.ఉదయం 9 నుండి గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటారు.రోగులు సద్వినియోగం చేసుకోవాలి.

వంటగ్యాస్ సమాచారం

పటాన్‌చెరు టౌన్ : పట్టణంలోని హెచ్‌పీ వంట గ్యాస్‌ను బుక్ చేసుకున్న వారికి ఒక్క రోజులోనే సిలిండర్లను పంపిణీ చేస్తున్నట్లు డీలర్ తెలిపారు. ట్రాన్స్‌పోర్టు ద్వారా 24 గంటల సమయం పడుతుందన్నారు. వంట గ్యాస్ బుకింగ్‌కు 9666023456 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు. సమస్యలు ఎవైనా ఉంటే 08455–242865 నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

కూరగాయల ధరలు

టమాట కిలో రూ.10, కాకరకాయ 40, ఆలుగడ్డ 15, క్యారెట్ 35, బీట్‌రూట్ రూ.40, వంకాయ రూ.30, పచ్చిమిర్చి రూ.40, ఉల్లిగడ్డ రూ.40, బెండకాయ రూ.40, క్యాబేజి రూ.40, బీరకాయ రూ.50, చిక్కుడుకాయ రూ.40, బీర్‌నీస్ రూ.40. దోసకాయ 30, చామగడ్డ 40, నిమ్మకాయలు 10కి 5.

సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు



పటాన్‌చెరు టౌన్:నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సోమవారం పట్టణానికి చెందిన టీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీధర్ చారి కలిశారు. ఈ సందర్భంగా ఆయన ప్రగతి భవన్‌లో కలిసి కేసీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్వ్యూ



అంశం: యాసంగి సాగు
సాల్మన్ నాయక్
వ్యవసాయ అధికారి



జిన్నారం(పటాన్‌చెరు):

ప్రశ్న:యాసంగి సాగు వివరాలేంటి ?

జవాబు:మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు యాసండొ పంటలను సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

ప్రశ్న : విత్తనాలు, మందులు అందుబాటులో ఉన్నాయా ?

జవాబు: అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. మందులు కూడా తమ కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : యాసంగిలో ఎలాంటి పంటలను సాగు చేస్తారు?

జవాబు: వరి, మొక్కజొన్న, శనగ పంటలను ప్రధానంగా సాగుచేస్తుంటారు. వీటితో పాటు రైతులు వివిధ రకాల కూరగాయ పంటలను కూడా సాగు చేస్తున్నారు.

ప్రశ్న : రైతులకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

జవాబు: ప్రతి రోజు గంట పాటు రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నాం. రైతులు నూతన పద్ధతులను ఉపయోగించి పంటలను సాగు చేసే తీరును వివరిస్తున్నాం.

ప్రశ్న : రైతులకు మీరిచ్చే సూచనలు ఏంటి ?

జవాబు: రైతులు ఎక్కువగా రసాయ ఎరువులను వాడొద్దు. సాగు విషయంలో, పంటలకు ఏమైన రోగం సోకినప్పుడు తమ సూచనలు, సలహాలు పాటించాలి. పంటల సాగు విషయంలో తాము రైతులకు ఎప్పుడు అందుబాటులో ఉంటాం.



సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ఫయాజ్‌నగర్ కాలనీలో కచ్చా మురుగు కాలువల వల్ల తీవ్ర దుర్వాసన వస్తోంది. పక్కా కాలువలు నిర్మించాలని ప్రజాప్రతినిధులు అధికారులను పలు మార్లు కోరినా ఏమాత్రం ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 8501925249

పరిశ్రమలకు చిరునామా

- సంగారెడ్డి శివారులో వివిధ కంపెనీల ఏర్పాటు
- రవాణా వ్యవస్థ ఉండడంతో ఆసక్తి చూపుతున్న యాజమాన్యాలు
- స్థానిక యువతకు లభిస్తున్న ఉపాధి



జులకల్ శివారులో బెంగుళూరు బైపాస్ రోడ్డు పక్కన ఏర్పాటైన పరిశ్రమలు

సంగారెడ్డి రూరల్: పరిశ్రమలకు నిలయంగా జిల్లా కేంద్రం రూపుదిద్దుకుంటోంది. వివిధ పరిశ్రమలు పూర్వ సంగారెడ్డి మండలంలో ఏర్పాటవుతున్నాయి. మండల పరిధిలోని జుల్‌కల్, ఇంద్రకరణ్ , ఎద్దుమైలారం, చెర్యాల, మామిడిపల్లి, ఫసల్‌వాడి , ఇస్మాయిల్ ఖాన్‌పేట, ఎర్ధనూర్ తదితర గ్రామాల పరిధిలో నూతన పరిశ్రమలు ఏర్పడుతున్నాయి. పరిశ్రమలు తరలిరావడంతో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాది లభిస్తోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సంగారెడ్డి జిల్లా కేంద్రం సమీపంగా ఉండటంతో పాటు జాతీయ రహదారులైన 65వ నెంబర్‌తో పాటు ఇటీవల బెంగుళూర్ బైపాస్ రోడ్డు కూడా నాలుగు లైన్ల విస్తరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. తమ ఉత్పత్తులను ముం బాయి, హైదరాబాద్ తదితర నగరాలకు రవాణ చేసేందుకు సౌకర్యాలు మెండుగా ఉండటంతో పారిశ్రామిక వేత్తలు సంగారెడ్డి మండల శివారులోని గ్రామాల పరిధిలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ఎద్దుమైలారంలో ఓడీఎఫ్(ఆయుధ కార్మగారం) ఏర్పాటైంది. ఆ పరిశ్రమలో సుమారు మూడు వేలకుపైగా కార్మికులు పని చేస్తున్నారు. పటాన్‌చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రమిక వాడగా అనుకొని ఉన్న గ్రామాలు ఇంద్రకరణ్, చెర్యాల శివారులో వివిధ రకాల వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలు అధికంగా ఏర్పడటంతో పారిశ్రామిక వాడగా తయారవుతుంది. ఫసల్ వాదిలో ఏర్పాటు అయిన గణపతి షుగర్ పరిశ్రమలో రైతులు పండించిన చెరుకును గానుగావించడంతో పాటు పలువురికి ఉపాధి లభిస్తోంది. ఇదే కాకుండా పోతిరెడ్డిపల్లి శివారులో గల పెప్సీ పరిశ్రమలో కూడా వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. బెంగుళూర్ బైపాస్ రోడ్డు జుల్‌కల్ గ్రామ శివారులో నుంచి వెళ్లుతుండటంతో ఆ రోడ్డుకు ఇరువైపులా నూతనంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంద్రకరణ్ శివారులో పరిశ్రమల స్థాపన కోసం జిల్లా పరిశ్రమల కేంద్రం ఇప్పటికే కొన్ని వందల ఎకరాల భూమిని కేటాయించింది. నూతనంగా పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి స్థలంతో పాటు విద్యుత్, నీటి సరఫరా తదితర సౌకర్యాలను కల్పిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం పారిశ్రామికవాడగా రూపొందుతోంది. అలాగే పరిశ్రమలు కూడా ఈ ప్రాంతానికి ఎక్కువగా వస్తుండటంతో ఇక్కడి భూముల ధరలు అమాంతంగా పెరిగాయి.

న్యూస్ బాక్స్

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



సంగారెడ్డి జోన్ : నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. మంగళవారం టీఆర్‌ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 2018 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సకాలంలో వర్షాలు సంవృద్ధిగా కురిసి జిల్లా రైతాంగంతో పాటు ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. టీఆర్‌ఎస్ నాయకులు శ్రీకాంత్, అన్వేష్, మోహన్‌సింగ్, వీరేశ్‌చారి, వాజీద్ , సంతోష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

కాలనీల్లో టీమాస్ బృందం పర్యటన



సంగారెడ్డి జోన్: ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తూ మురికి వాడల్లోని సమస్యలను పరిష్కరించాలని టీమాస్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు జయరాజు, పట్టణ చైర్మన్ మల్లయ్యాలు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ ంలోని బాబా నగర్, ఎల్‌బీనగర్, భగత్‌సింగ్ నగర్, నేతాజినగర్‌ల్లో వారు పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీమాస్ నాయకులు మల్లేశ్వరీ, యాదవరెడ్డి, నర్సింలు, రాజు, యాదయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో..

కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

సంగారెడ్డి రూరల్ :దేశ వ్యాప్తంగా వివిధ పథకాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశ , ఏఎన్‌ఎం, సర్వ శిక్ష అభియాన్‌లలో పని చేసే వారందరిని కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సాయిలు డిమాండ్ చేశారు. మంగళవారం కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశావర్కర్లు 106 రోజుల పాటు సమ్మె చేస్తే నెలకు రూ.6 వేలు ఇస్తానని హామీ ఇచ్చిన అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. పనికి తగ్గ వేతనాలు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించడం లేదన్నారు. అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలు సమాజ సేవలో అంకిత భావంతో పని చేస్తున్నారన్నారు. ఆశ వర్కర్లకు నెలకు కనీస వేతనం రూ.18 వేలతో పాటు చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

టీజేఏసీ జిల్లా కన్వీనర్ బీరయ్యయాదవ్



మాట్లాడుతున్న బీరయ్యయాదవ్

కొండాపూర్(సంగారెడ్డి):రైతులకు టీజేఏసీ బృందం అండగా ఉంటుందని టీజేఏసీ జిల్లా కన్వీనర్ బీరయ్య యాదవ్ తెలిపారు.మంగళవారం మండల పరిధిలోని మాందాపూర్ గ్రామంలో టీజెఏసీ అధ్యయన యాత్రలో భాగంగా గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు.అనంతరం ఆయన గ్రామ రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూమిలేని దళితులు గ్రామంలో చాలా మంది ఉన్నారన్నారు. ఇప్పటివరకు ఒక్క దళితుడికి కూడా భూ పంపిణీ చేయకపోవడమే కాకుండా ప్రధాని మన్మోహన్‌సింగ్ హయాంలో సర్వే 22లో రాళ్లు, రప్పలు కలిగిన 200 ఎకరాలను 200 మంది రైతులకు పంపిణీ చేశారన్నారు.ప్రస్తుతం ఆన్‌లైన్‌లో భూమి 1బీలో రావడం లేదన్నారు. సర్వే 22లో గల భూమిని తమ వద్ద నుండి లాక్కొనేందుకు రెవెన్యూ అధికారులు, బ్రోకర్లు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.గ్రామంలో 90 శాతం మంది లక్షల్లో పెట్టుబడి పెట్టి పత్తిని సాగుచేస్తే చాలామంది రైతులు నష్టపోయారని, వారికి పరిహారం ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ రైతు కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా గోపాల్, ఉపాధ్యక్షులుగా శాంతమ్మ, జానయ్య, ప్రధాన కార్యదర్శిగా లాలయ్య, కార్యదర్శిగా సిద్ధయ్య, ప్రచార కార్చదర్శిగా రాములు, కోఆర్డినేటర్‌గా పద్మలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ తుల్జారెడ్డి, మండల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు నరేష్,అనిల్ పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

టెట్ నిర్వహించాలి



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఏడాదికి రెండుసార్లు టెట్ నిర్వ హిస్తామని చెప్పి ఒకేసారి జరపడం అన్యాయం. దీనివల్ల డీఎడ్, బీఎల్ అభ్యర్థులకు నష్టం జరుగుతోంది. టీఆర్టీ నిర్వహణకు సమయం ఉన్నందున ప్రభుత్వం వెంటనే టెట్ ప్రకటనను జారీ చేయాలి. ఫిబ్రవరి వరకు ప్రక్రియను పూర్తి చేసి,టీఆర్టీలో వారికీ అవకాశం కల్పించాలి.

–ఎండీ పయాజ్, పట్టభద్రుల సంఘం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు



వెండితెర



ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి:
రుక్మిణి 70ఎం.ఎం(సంగారెడ్డి)
11.15, 2.15, 6.15, 9.15
టైగర్ జిందాహై
నటరాజ్ 70.ఎం.ఎం
11.00,2.00,6.00,9.00
హలో: సితార
ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి:
జ్యోతి 70ఎం.ఎం.
(సదాశివపేట) 11.15, 2.15,
6.15, 9.15

న్యూస్ బాక్స్

ఘనంగా పడిపూజ



కొండాపూర్ (సంగారెడ్డి): హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి మహా పడిపూజ గొల్ల పల్లి గ్రామంలోని గీతా ఆలయంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం గురు స్వామి దండు మోహన్ పర్యవేక్షణలో గుండా శేఖర్ ఆధ్వర్యంలో స్వామి వారికి వివిధ పూజా ద్రవ్యాలు, ఫలా పుష్పలతో అభిషేకాలు నిర్వహించారు. శంకర్‌పల్లికి చెందిన శబరి భక్తబృందం ఆలపించిన భక్తిగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీనివాస్‌చారి, రాములుగౌడ్, రవికుమార్, కన్నె స్వాములు భరత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్‌గౌడ్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన మాలధారణ స్వాములు, సర్పంచ్ స్వరూప బాలాగౌడ్ ,ఎంపీటీసీ సభ్యుడు డేవిడ్, టీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



హత్నూర(సంగారెడ్డి): ప్రజలకు చేసిన సేవలు చిరకాలం ఉంటాయని పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఎంఎల్ఓ నజీర్‌బాబా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పోస్టుమెన్‌గా పని చేసిన నజీర్ పదవీ విరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంఎల్ఓ మాట్లాడుతూ నజీర్ సేవలు మరువలేమన్నారు. ప్రతి ఉద్యోగి చేసిన సేవలు మాత్రం ప్రజలు మర్చిపోరని ఆయన పేర్కొన్నారు. అనంతరం పోస్టాఫీస్ అధికారులు, సిబ్బంది నజీర్‌ను ఘనంగా సన్మానించారు. ఎస్ఓఎం వెంకట్‌రెడ్డి, పోస్టల్ సిబ్బంది లక్ష్మీనారాయణ, రాజేందర్, బసువప్ప, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణం లోని శాస్త్రి రోడ్డులో నిత్యం వాహనదారులు, పాదచారులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రోజులుగా నిత్యం ద్విచక్ర వాహనాలను రోడ్లపై అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. తోపుడు బండ్ల వ్యాపారులు కూడ నడిరోడ్డుపై నిలపడంతో నిత్యం ట్రాపిక్ ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించాలి.



సమస్యల పరిష్కారంలో సర్కార్ విఫలం

టీమాస్ ఫోరం జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు యాదగిరి

కొండాపూర్(సంగారెడ్డి):తెలంగాణ రాష్ట్రం ఏర్పడి మూడున్నరేళ్లు పూర్తి అయినా గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని టీ మాస్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు యాదగిరి అన్నారు.మంగళవారం టీ మాస్ ఫోరం ఆధ్వర్యంలో ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు అనంగతసాగర్ గ్రామంలో సర్వే నిర్వహించారు. యాదగిరి మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. ఒకవైపు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా సీఎం రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ మారుస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.టీఆర్ఎస్ ఎన్నికల్లో ప్రకటించిన దళితులకు మూడెకరాల భూమి, డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ కేజీ టూ పీజీ, ఉచిత నిర్బంధ విద్య, రైతులకు రుణమాఫీ, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఇంటికో ఉద్యోగం తదితర పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.గ్రామాల్లో పారిశుద్ధ్యం ఎక్కడి వేసిన గొంగడి అన్న చందంగా మారిందన్నారు. కార్యక్రమంలో టీ మాస్ మండల కన్వీనర్ రాంచెందర్, అధ్యక్షుడు అసిఫ్ అలీ, టీ మాస్ నాయకులు రాజయ్య, బాబురావు, ప్రవీణ్, వెంకయ్య, అమృతమ్మ, పాపమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న సభ్యులు

కలెక్టర్, ఎస్పీలను కలసిన సర్పంచ్



హత్నూర(సంగారెడ్డి) :జిల్లా కలెక్టర్ మాణిక్క రాజ్ కణ్ణన్ ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు జిల్లా ఉన్నతాధికారులను సర్పంచ్ జయశ్రీ శివశంకర్‌రావు మంగళవారం కలిసి కొత్త సంవత్సరం సందర్భంగా మొక్కలను అందజేశారు. డీపీఓ వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్ వాసం వెంకటే శ్వర్లును కలసి మొక్కలను అందజేసినట్లు సర్పంచ్ జయశ్రీ శివశంకర్‌రావు తెలిపారు.

ఎస్ఐకి సన్మానం



హత్నూర(సంగారెడ్డి):నూతన సంవత్సరం సందర్భంగా ఎస్ఐ రాజేష్‌ను మంగళవారం మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఇబ్రహిం, కృష్ణ, శ్యామ్, ఫయాజ్ సంగారెడ్డి, రాజు , హరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా న్యూఇయర్ వేడుకలు



సదాశివపేట రూరల్(సంగారెడ్డి):మండల పరిధి లోని మద్దికుంట ప్రభుత్వ ప్రాధమికోన్నత పాఠశాలలో పాటుగా న్యూ గవర్నమెంట్ ప్రాధమిక పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు

క్యాలెండర్ల ఆవిష్కరణ

కొండాపూర్(సంగారెడ్డి):మండల పరిధిలోని మల్కాపూర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎంపీపీ విఠల్ పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఇన్‌చార్జి ఎంఈఓ భీంసింగ్, ప్రధానోపాధ్యాయులు పెంటారెడ్డి, విజయ్‌కుమార్, పండరినాయక్, యాదగిరి, పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభు, సంగయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతకుమార్, దామోదర్, విజయ్‌కుమార్, భీమయ్య, దొండిరావు, ఆనంద్‌కుమార్, ఉమేష్, గణేష్, అరవింద్ పాల్గొన్నారు.తొగర్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ఎంఈఓ భీంసింగ్ టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ప్రార్థన దినోత్సవం పోస్టర్ విడుదల



సంగారెడ్డి రూరల్ :సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 5న తెలంగాణ ప్రార్థన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు బిషప్ ఎంఎస్ పాల్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి శివారులోని రాక్‌చర్చిలో నియోజకవర్గ పాసర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాస్టర్లు పాలెం రాజు, కుమార్, అమృత్‌రాజ్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండె పోటుతో ఒకరి మృతి

కొండాపూర్(సంగారెడ్డి): గుండె పోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ బాలాస్వామి కథనం ప్రకారం మల్కాపూర్‌కి చెందిన కొల్లోజు లింగాచారి (43) ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో పనిచేస్తూ అదే కాలనీలో నివాసం ఉంటున్నారు. భార్య మంగాదేవి తన తల్లిదండ్రులను చూసేందుకు యూసుఫ్‌గూడకు వెళ్లింది. తన భార్యతో 31 రాత్రి ఫోన్‌లో మాట్లాడారు. ఒకటో తేదిన ఎన్నీసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో కంగారుపడి కాలనీ వాసులకు తెలిపింది. వారు కిటీకీలోంచి చూసే సరికి బెడ్ మీద లింగాచారి విగతజీవుడై ఉన్నట్లు తెలిపారు. నిద్రిస్తున్న సమయంలో గుండెపోటు రావటంతో లింగాచారి అక్కడికక్కడే మృతి చెంది ఉంటారని ఎస్ఐ వివరించారు. మృతుడి భార్య మంగాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలస్వామి తెలిపారు.

ఇంటర్వ్యూ

అంశం: చలికాలం.. వ్యాధులు

డాక్టర్ సంగమేశ్వర్
అర్బన్ పీహెచ్‌సీ



సంగారెడ్డి టౌన్ :

ప్రశ్న: పెరుగుతున్న చలికి ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలపగలరు?

జవాబు: పిల్లలు, 50 ఏళ్లు పైబడిన వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.ఎండ వచ్చే వరకు ఉండి బయటకు వెళ్లితే మంచిది.

ప్రశ్న: చలికాలంలో ఎలాంటి దుస్తులు ధరించాలి?

జవాబు:చలితీవ్రత పెరుగుతున్నందున ప్రజలు ఉన్ని దుస్తులు ధరించాలి. చలి నుండి కాపాడుకోవడం చాలా ముఖ్యం.

ప్రశ్న:చలికాలంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

జవాబు: ఎప్పటికప్పుడు వండిన వేడి ఆహారాన్ని తీసుకోవడం మంచింది. ఆహారం పట్ల అశ్రద్ధ మంచింది కాదు. ఒక రోజు ముందు వండిన ఆహారాన్ని తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. శుద్ధి చేసిన నీటిని మాత్రమే తాగాలి. అలాగే వడబోసిన నీరు తాగితే ఆరోగ్యానికి మంచిది.

ప్రశ్న: జలుబు, దగ్గు వస్తే ఎలాంటి వైద్యం తీసుకోవా లి?

జవాబు:వృద్ధులు, చిన్నారులకు దగ్గు, జలుబు వస్తే సొంతంగా వైద్యం చేసుకొని వ్యాధి తీవ్రమయ్యే వరకు ఉండొద్దు. డాక్టర్‌ను సంప్రదించి సరైన వైద్య సహాయం పొందాలి.

ప్రశ్న: నిల్వ ఉంచిన నీటిని సేవించవచ్చా?

జవాబు: ఎక్కువ కాలం పాటు నిల్వ ఉంచిన నీటిని సేవించరాదు. ఏ రోజు కారోజు స్వచ్ఛమెన నీటిని సేవించాలి. బాటిళ్లతో ఎక్కువ సమయం నీటిని నిల్వ ఉంచరాదు. ప్లాస్టిక్ బాటిళ్లను ఆరు నెలలకు పైగా వాడరాదు. నాణ్యత గల బాటిళ్లలోని నీటిని మాత్రమే సేవించాలి. ముఖ్యంగా విద్యార్థులు మంచినీరు తాగకుండా ఉండరాదు. పాఠశాల ఉపాధ్యాయులు సైతం విద్యార్థులు మంచినీళ్లు కావాలని కోరితే నీళ్లు సేవించేందుకు అనుమతి ఇవ్వాలి. వాటర్ బాటిళ్లల్లో ఫంగస్ లేకుండా శుభ్రం చేసి వాటిని ఉపయోగించాలి.